శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

భారత్ – అమెరికా మౌలిక నిబంధనల ఒప్పందం రెడీ
ప్రధాని మోదీ నాయకత్వంలో కనీస పాలన, గరిష్ఠ కప్పిపుచ్చే ధోరణి
07
రైతుల సైకిల్ మోటార్ ర్యాలీ

సంపుటి 09, సంచిక: 224 | మంగళవారం | 14-07-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

తెలంగాణ అభ్యర్థనకు

## సుప్రీంకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ :**పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది.

కన్నెపల్లి నుంచి నేరుగా ఎల్లంపల్లికి

# నీళ్లు తీసుకెళ్లలేం

- గేట్లు కిందికి దించి నీటిని నిల్వ చేస్తే మేడిగడ్డ బ్యారేజీ కొట్టుకుపోతది
- దేవాదుల పనులు వేగవంతం చేస్తాం
- నిధుల కొరత ఉండదు...
- 22 రిజర్వాయర్లు నింపుతాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి స్పష్టీకరణ
- ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పరిశీలన



ప్రజాపక్షం/ములుగు

సాంకేతికంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీళ్లు తీసుకెళ్లే అవకాశమే లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గేట్లు కిందికి దించి నీటిని నిల్వ చేస్తే మేడిగడ్డ బ్యారేజీ కొట్టుకుపోతుందని మంత్రులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం నాణ్యతాలోపంతో నాసిరకంగా, లోపభూయిష్టంగా నిర్మించిందని మండిపడ్డారు.ములుగు జిల్లా కన్నాయి గూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క సాగర్ ప్రాజెక్టును నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో ప్రాజెక్టు పనుల పురోగతి, భూసేకరణ, పంపింగ్ వ్యవస్థ రిజర్వాయర్లలో నీటి నిల్వలు, పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, 38.16 టిఎంసిల నీటి సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత ఉండదని స్ప ష్టం చేశారు. భూసేకరణను వేగవంతంగా పూర్తి చేసి, ప్రాజెక్టు పనుల్లో ఉన్న అడ్డంకులను తొలగిస్తామని చెప్పారు. గోదావరి జలాలను పూర్తి స్థాయిలో వినియోగించి 22 రిజర్వాయర్లను నింపడంతో పాటు దేవాదుల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ఎన్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సాగునీరు, తాగునీటి అవసరాలకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తరువాయి 8లో




# రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం

- రాజకీయాలకతీతంగా అందరూ కలిసి ముందుకు సాగుదాం
- నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర అనుమతుల సాధన పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి
- హైదరాబాద్‌కు ఐఐఎం వచ్చేలా చొరవచూపాలి
- రాష్ట్ర ఎంపిలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో రాష్ట్ర అంశాలను లేవనెత్తాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని, రాజకీయాలకతీతంగా ఈ విషయంలో అందరూ కలిసి ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఎంపీలకు పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధన పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకు బిజెపి ఎంపిలు కూడా సహకరించాలని కోరారు. 'పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపైన'' రాష్ట్ర ఎంపిలతో హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపైన ఎంపిలకు సిఎం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో 10 శాతం జనాభా ఆరు మహా నగరాల్లో ఉందని, ఈ నగరాలు 25 శాతం జిడిపి కలిగి ఉన్నాయని వివరించారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని, ఎంపీలు ఈ విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఐఐఎం మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్I స్వాధీనం, మెట్రో ఫేజ్II విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని ఎంపిలకు వివరించారు. దీనికి సంబంధించి ఎస్‌బిఐ సిఎపిఎస్‌ను కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని ఎంపిలకు సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డికి సిఎం విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని.. ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాల్సి ఉందని, దీనిపైన ఎంపిలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మూసీ పునరుజ్జీవనం పనుల్లో మొదటి దశ టెండర్ల దశకు వచ్చిందని,ఈ పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందని ఈ విషయాన్ని ఎంపిలు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు. అంతరాష్ట్ర నదీ తరువాయి 8లో





ఆరు హత్యల నరహంతకుడు

## రాజ్‌కుమార్ ఆత్మహత్య

- 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామస్తులు
- మృతదేహం పక్కనే లభించిన గడ్డిమందు బాటిల్
- వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటి కమిషనర్ తరుణ్‌జోషి

ప్రజాపక్షం/కొత్తూరు

ఆరు హత్యల నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఫ్యూచర్ సిటి పోలీస్ కమీషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్ పక్కన వ్యవసాయ పొలంలో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆరుగురిని హత్య చేసిన నిందితుడు రాజ్‌కుమార్ సైతం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫ్యూచర్ సిటి పోలీస్ కమిషనర్ తరుష్ జోషి వెల్లడించారు.100 నెంబర్‌కు పోన్ చేసి గ్రామస్తులు పోలీసులకు సమాచారం తరువాయి 8లో

ఎర్రజెండా బలహీనపడిన ప్రాంతాల్లో

# పేదల భూములు లాక్కుంటున్నారు



- మాజీ శాసనసభ్యులు ఉజ్జిని నారాయణరావు పదవ వర్ధంతి సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి
- చింతపల్లిలో సిపిఐ మండల ఆఫీసుకు ఉజ్జిని పేరుతో నామకరణం చేసిన రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/నల్లగొండ

కమ్యూనిస్టులు పేదలకు పంచిన ప్రభుత్వ భూములు ఇప్పటికీ ప్రజల వద్దనే పదిలంగా ఉన్నాయని,ఎర్రజెండా బలహీనపడిన ప్రాంతాల్లో మాత్రం పేదల భూములు తిరిగి లాక్కున్న ఘటనలు చోటుచేసుకున్నాయని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. త్యాగాల పునాదులపై నిర్మితమైన ఎర్రజెండా ఒడిలో ఒరిగిన అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు మరింత పదును పెట్టాలని పిలుపునిచ్చారు. మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జిని నారాయణరావు పదవ వర్ధంతి సందర్భంగా చింతపల్లిలో సోమవారం నాడు సభ నిర్వహించారు. సిపిఐ ఎంఎల్‌సి, నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, అందోజు రవీంద్రాచారి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే తరువాయి 12లో



### మునుగోడు,దేవరకొండల్లో మళ్ళీ అరుణ పతాకం రెపరెపలాడాలి:కూనంనేని

వచ్చే ఎన్నికలో దేవరకొండ,మునుగోడు నియోజకవర్గాల్లో మళ్లీ ఎర్రజెండా రెపరెపలాడేలా చేసేందుకు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పొత్తులు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటాల్లో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావజాలంతో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు ఉజ్జిని నారాయణరావు అని కొనియాడారు. పదవులు, అధికారాలు, తరువాయి 12లో

# హోర్ముజ్ జలసంధిని స్వాధీన పర్చుకుంటాం



- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- మా నియంత్రణలోనే ఉంటుంది:ఇరాన్ ఐఆర్‌జిసి ప్రతిజ్ఞ
- సవాళ్ళు- ప్రతిసవాళ్ళతో తారాస్థాయికి చేరిన ఉద్రిక్తతలు
- ఇరాన్ క్షిపణి,డ్రోన్ దాడులతో దద్దరిల్లిన గల్ఫ్,అరబ్ దేశాలు
- నాలుగు ఇరాన్ క్షిపణులు కూల్చేసిన జోర్డాన్
- భారత నావికుడికోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధిని తామే స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. దీంతో జలసంధి తమ నియంత్రణలోనే ఉంటుందని ఇరాన్ ఐఆర్‌జిసి ప్రతిజ్ఞ చేసింది. జలసంధికి తామే గార్డియన్ (సంరక్షకుడు)గా ఉంటామని, వారు (ఇరాన్) ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఫాక్స్‌న్యూస్‌తో ట్రంప్ అన్నారు. వారిదొక చెడ్డసమూహం, జలసంధిని మేం కాపాడతాం, దానికి మాకు ప్రతిఫలం లభిస్తుందని చెప్పారు. ఒకవైపు వాగ్యుద్ధం కొనసాగుతుంటే మరోవైపు ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రం చేసింది. జులై ఏడవ తేదీ నుండి మొదలైన పరస్పర దాడులు (మధ్యలో కొంత విరామం) నాలుగోరోజు సోమవారం కూడా కొనసాగాయి. ఇరాన్ ఐఆర్‌జిసి భీకరస్థాయిలో పశ్చిమాసియా అంతటా అమెరికా గగనతల స్థావరాలు, మౌలిక సదుపాయాలపై యుద్ధ దాడులను విస్తరించింది.మరోవైపు సైప్రస్ జెండా నౌకపై దాడి కారణంగా జాడ తెలియకుండా పోయిన భారత నావికుడి కోసం తీవ్రస్థాయిలో గాలింపు కొనసాగుతోందని సైప్రస్ షిప్పింగ్‌శాఖ డిప్యూటీమంత్రి చెప్పారు. ఈ ఉద్రిక్తతలమధ్య ప్రపంచమార్కెట్లు అస్థిరానికి గురయ్యాయి. ముడిచమురు ధర నాలుగూ శాతం పైగా పెరిగింది. కాగా,జోర్డాన్‌లోని ప్రిన్స్‌హస్సన్ ఎయిర్‌బేస్, కువైట్‌లో ఉన్న అలీ అల్–సలెం ఎయిర్‌బేస్,అహ్మద్ అల్–జబెర్ ఎయిర్‌బేస్, బహ్రైన్‌లో తరువాయి 8లో

## ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తిగా సన్నద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్తోందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేశామని ఇందులో తొలి దశ కార్యాచరణ అమలుకు తరువాయి 8లో

## 'టెట్' 43.94% అర్హత

- 8809 మంది ఇన్ సర్వీస్ టీచర్లు పాస్
- ఫలితాలు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలాస్..

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజి టెట్ 2026) 43.94 శాతం అర్హత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,53,752 మంది పరీక్ష దరఖాస్తు చేసుకోగా,1,15,028 తరువాయి 8లో

టెండర్లు లేకుండానే

# తాడిచర్ల -2 బొగ్గు బ్లాకులు

తెలంగాణ, సింగరేణిపై ప్రేమతో కేటాయింపులు : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/మణుగూరు

తెలంగాణ ప్రజలపై, సింగరేణి పై ఉన్న ప్రేమతో, 11 సంవత్సరాల తర్వాత టెండర్ లేకుండా తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణి, కార్మికులను కాపాడేందుకే ఎటువంటి టెండర్ లేకుండా న్యాయపమైన చిక్కులు లేకుండా తాడిచర్ల 2 బొగ్గు బాయి ని సింగరేణి సంస్థకు కేటాయించిందన్నారు. కొత్తగూ డెం క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాడిచర్ల 2లో గ్రేడ్ 8 నాణ్యమైన బొగ్గు లభిస్తుందని, ఈ బ్లాక్ తో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆనాడు తరువాయి 12లో

క్రికెట్ పుట్టినింట్లో భారత్ చరిత్ర

ఇంగ్లండ్‌పై ఘన విజయం!



భారత మహిళల టెస్ట్ టీమ్ చరిత్ర సృష్టించింది. క్రికెట్ మక్కాగా పిలిచే లార్డ్స్ మైదానంలో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఆతిథ్య ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో సమష్టిగా రాణించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో భారత మహిళల జట్టు 270 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

భారతదేశ విద్యా వ్యవస్థలో

## విప్లవం రావాల్సిందే

ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** విద్యావ్యవస్థలో చోటు చేసుకుంటున్న ఘటనలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. భారత దేశ విద్యా వ్యవస్థ ఇప్పుడు 'అవినీతిపూరిత దోపిడీ యంత్రాంగం'గా మారిందని దుయ్యబట్టారు. ఈ రంగంలో విప్లవం రావాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన ఉద్ఘాటించారు. 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం కింద విద్యార్థులతో రెండవసారి సమావేశం జరపనున్నారు. కాగా, ఎన్నికల వ్యవస్థలో అవినీతి తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
14-07-2026
www.prajapaksham.in
ఎడిట్
PEOPLE'S VIEWS

# మహా నగరాల్లోనే నిరుద్యోగం ఎక్కువ

మన దేశంలో పట్టణీకరణ, నగరీకరణ పెరుగుతోంది. నగరాల చుట్టూ అభివృద్ధి కేంద్రీకరించటం, అభివృద్ధి కేంద్రాల చుట్టూ పట్టణీకరణ విస్తరించటం సహజలక్షణంగా చూస్తున్నాం. రెండోవైపున, గ్రామీణ పేదరికం పెరుగుదలతో బడుగుజీవులు ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు పెద్ద ఎత్తున వలసపోతున్నారు. దాంతో పట్టణాల్లో పౌరవసతులపై ఒత్తిడి పెరుగుతోంది, మురికివాడలు ఇబ్బడిముబ్బడు అవుతున్నాయి. పట్టణ నిరుద్యోగులకు ఈ వలస శ్రామికులు తోడుకావటంతో శ్రామికుల సంఖ్య అవసరానికి మించి పెరుగుతున్నది. దాంతో లేబర్ మార్కెట్‌లో వేతనాలు కోతకు గురవుతున్నాయి. మహానగరాలు ఉద్ధరిస్తాయనే ఆశతో వలసవచ్చిన వారికి నిరాశ తప్పటం లేదు. 10లక్షలకు పైన జనాభా ఉన్న నగరాల్లోనే నిరుద్యోగ రేటు హెచ్చుగా ఉన్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. పట్టణ భారత్‌లో నిరుద్యోగం రేటు 4.8శాతం ఉండగా, 10లక్షల జనాభా మించిన నగరాలలో సర్వసాధారణంగా 4.9శాతం ఉందని నివేదిక పేర్కొన్నది. అలాగే వివిధ కేటగిరి కార్మికుల – కాంట్రాక్టు, క్యాజువల్, రెగ్యులర్ – ఆదాయార్జనలో తీవ్ర అసమానత ఉంది.

గణాంకాలు, కార్యక్రమం అమలు మంత్రిత్వశాఖకు చెందిన జాతీయ గణాంకాల కార్యాలయం 2025 సంవత్సరానికి సంబంధించి ఇటీవల "లేబర్ మార్కెట్ డైనమిక్స్ ఇన్ మిలియన్ – ప్లస్ సిటీస్" పేరుతో విడుదల చేసిన నివేదిక ఈ విషయాలు చెబుతూ, మహిళల్లో నిరుద్యోగం మహానగరాల్లోని 6.1శాతంతో పోల్చితే మామూలు పట్టణ భారత్‌లో 6.4 శాతంగా ఉందని వెల్లడించింది. పురుషుల్లో నిరుద్యోగం మహానగరాల్లో హెచ్చుగా 4.5 శాతం ఉండగా, పట్టణ భారత్‌లో తక్కువగా – 4.2శాతంగా ఉంది. కరెంట్ వీక్లీ స్టేటస్ (సిడబ్ల్యుఎస్) ప్రకారం రెండు ప్రాంతాల్లోనూ హెచ్చుగా – 6.8శాతం ఉంది. మహానగరాల్లో సిడబ్ల్యుఎస్ రేటు ప్రకారం పురుషుల్లో నిరుద్యోగం 6.2శాతం కాగా మహిళల్లో నిరుద్యోగం 8.8శాతం ఉంది. పట్టణ భారత్‌లో సిడబ్ల్యుఎస్‌లో ఆ సంఖ్యలు వరుసగా 6.1శాతం, 8.9శాతంగా ఉన్నాయి.

వేతనాల రీత్యా చూస్తే మహానగరాల్లోని కార్మికులు మెరుగైన స్థితిలో ఉన్నారు. ఇది అన్ని కేటగిరీల్లోనూ ఉంది. వేతన లేదా ఆదాయార్జన వ్యత్యాసాలు నగరాలు – పట్టణాల మధ్య ఇలా ఉన్నాయి. స్వయం ఉపాధి కార్మికుల ఆదాయం నగరాలలో రూ.30,858 కాగా, పట్టణాలలో రూ.23,013.రెగ్యులర్ వేతన ఉద్యోగుల ఆదాయం వరుసగా రూ.28,808లు, రూ.26,258లుగా ఉంది. క్యాజువల్ లేబర్ ఆర్జన వరుసగా రూ.624లు, రూ.550గా ఉంది. నగరాల్లోని మహిళలు పట్టణాల్లోని శ్రామిక మహిళలకన్నా 58శాతం ఎక్కువ వేతనం పొందుతున్నారు. అలాగే క్యాజువల్ లేబర్‌లో కూడా రోజువారీ వేతనం 18 శాతం హెచ్చుగా ఉంది.

నగరాల్లో కార్మికులు వారానికి 49.5గంటలు, పట్టణాల్లో 47.1 గంటలు పనిచేస్తున్నారు. నగరాల్లో అత్యధికంగా 22.9శాతం కార్మికులు వాణిజ్యం, హోటల్, రెస్టారెంట్ పనుల్లో ఉండగా, వస్తూత్పత్తి రంగంలో 21.6శాతం ఉన్నారు. రవాణా, స్టోరేజి, కమ్యూనికేషన్స్‌లో 13.6శాతం, నిర్మాణాలరంగంలో 7.5శాతం పనిచేస్తున్నారు. ఇతర చిన్నపాటి సేవల్లో 31.5 శాతం ఉన్నారు. అదే పట్టణ ప్రాంతాల్లో ఉపాధులు వరుసగా 23.8; 20.2; 10శాతం, 7.5 శాతం వ్యవసాయంలో ఉన్నారు.

నగరాలలో శ్రామిక శక్తిలో పాల్గొనని వారిలో 53.5 శాతం చదువుల కొనసాగింపును కారణంగా చెప్పారు. 38.9 శాతం మందేమో అనారోగ్యం, వయస్సురీత్యా ఆరోగ్య సమస్యలు కారణంగా చెప్పారు. అలాగే పనులకు వెళ్లని మహిళల్లో 68.7శాతం పిల్లల పెంపకం, ఇంట్లో పనులు కారణంగా చెప్పారు.

చదువుకు తగిన ఉద్యోగాలు లభించకపోవటం, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు కొరవడటం ఒక ప్రధాన సమస్యగా కొనసాగుతున్నది. అందువల్ల వృత్తి నైపుణ్యాల పెంపుదలకు ప్రత్యేక శిక్షణ అవసరం. అది ప్రయోజనకరంగా ఉండాలంటే పరిశ్రమ – కార్మిక శాఖ మధ్య సమన్వ యం అవసరం. ఏటా మిలియన్‌ల కొలది డిగ్రీలతో విద్యాలయాలనుంచి బయటకు వస్తున్నా పై కారణాలరీత్యా రెంటికీ చెడ్డ రేవడి అవుతున్నారు. టెక్నాలజీ వేగంగా మారుతోంది. అందుకనుగుణంగా అకడమిక్ విద్యా కోర్సులు, వృత్తినైపుణ్య కోర్సులు ప్రవేశపెట్టాలి; వృత్తి నిపుణులైన బోధనా సిబ్బందిని త్వరితగతిన సమకూర్చుకోవాలి. అప్పుడే మన దేశానికున్న యువత లాభదాయకతను ప్రయోజనకరంగా ఉపయోగించుకోగలం. యువతను విదేశాలకు వలస కార్మికులుగా పంపటానికి ప్రభుత్వాలు చూపుతున్న ఆసక్తి యువత శిక్షణపై పెడితే దేశ భవిష్యదభివృద్ధికి మేలు చేస్తుంది.



## రీటాబ్రతాకు అదనపు సమయమివ్వొద్దు

**అధికారిక సంతకం చేసేవారి వివరాలు, సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన అంశాలపై తమ వాదనలను సమర్పించడానికి, రీటాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని ప్రత్యర్థి వర్గానికి అదనపు సమయం ఇవ్వొద్దు. జూన్ 22న నిర్వహించిన ప్రత్యేక సమావేశం తర్వాత మేము తీసుకున్న నిర్ణయాల గురించి కమిషన్‌కు సమాచారం అందించాం. తాము చేపట్టిన సంస్థాగత మార్పులకు గుర్తింపు ఇవ్వాలని ఆ వర్గం కోరింది. 'జులై 10 గడువు ముగిసి రెండు రోజులు గడిచినప్పటికీ, ఆ సమాధానానికి సంబంధించి రీటాబ్రతా బెనర్జీ వైపు నుండి నాకు ఎటువంటి సమాచారం అందలేదు. భారత ఎన్నికల సంఘం విధించిన షరతు ఉన్నప్పటికీ, తనకు ఎటువంటి సమాచారం అందకపోవడాన్ని బట్టి చూస్తే, పొడిగించిన గడువులోగా ఎన్నికల సంఘానికి కూడా ఆ సమాధానం సమర్పించబడలేదు.**

– తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ



## అక్షర శిల్పులకు 'అర్హత' సెగ

'బడి గడప దాటి సమాజ వికాసానికి బాటలువేసే అక్షర శిల్పులు ఉపాధ్యాయులు. తరాల భవిష్యత్తును తీర్చిదిద్దే క్రమంలో తమ జీవితాలనే ధార పోసే గురువులు నేడు ఒక అపరిచిత ఆందోళనతో, అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్నారు. దశాబ్దాల బోధనా అనుభవం ఒకవైపు ... చట్టబద్ధమైన పరీక్షా నిబంధనలు మరోవైపు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో 'టెట్' (TET) అనేది కేవలం అర్హత పరీక్షగా కాకుండా, వేలాదిమంది ఉద్యోగ ఉపాధ్యాయుల మనుగడ ప్రశ్నగా మారింది.

ఇటీవల సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. పునఃసమీక్ష అభ్యర్థనలను తిరస్కరిస్తూ, టెట్ తప్పనిసరి అని పునరుద్ఘాటించింది. ఐదేళ్లకు పైగా ఉద్యోగ కాలం మిగిలి ఉన్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్‌లో అర్హత సాధించాలని పేర్కొంది. అలాగే గడువును 2027 ఆగస్టు 31 నుంచి 2028 ఆగస్టు 31 వరకు పొడిగించింది. ఇదే చివరి అవకాశం అని కూడా స్పష్టం చేసింది. దీని వెనుక ఉన్న ఉద్దేశం విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడమే. అనుభవం మాత్రమే సరిపోదని, బాల ల మనోవిజ్ఞానం, ఆధునిక బోధనా విధానాలు, సమకాలీన విద్యా నైపుణ్యాలపై కూడా ఉపాధ్యాయులకు అవగాహన ఉండాలనే అభిప్రాయాన్ని న్యాయస్థానం వ్యక్తం చేసింది.తెలంగాణలో సుమారు 30 వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు ఇంకా టెట్ అర్హత పొందలేదు. 2026 జనవరి లో నిర్వహించిన టెట్‌లో ఉద్యోగ ఉపాధ్యాయుల ఉత్తీర్ణత శాతం 57.76% మాత్రమే ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**ప్రభుత్వ నిర్ణయం స్వాగతించదగ్గదే..**

ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తులు, ప్రజాప్రతినిధుల సూచనలు, పాఠశాల విద్యాశాఖ నివేదికలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్‌ను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయం. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయులు సాధారణ అభ్యర్థులతో పోటీ పడాల్సిన అవసరం తగ్గుతుంది. వారికి అనుకూల వాతావరణంలో పరీక్షరాసే అవకాశం లభిస్తుంది. ఇది ప్రభు త్వం సమస్యను సానుకూలంగా అర్థం చేసుకుందనే సంకేతం.

**సబ్జెక్టుల వైరుధ్యం.. మానసిక నైరాశ్యం**

ప్రభుత్వం ప్రత్యేక టెట్ నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయమే. అయితే ఉద్యోగ ఉపాధ్యాయులు లేవనెత్తుతున్న కొన్ని సమస్యలు మాత్రం ఇప్పటికీ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం అమలులో ఉన్న పరీక్షా విధానం, పాఠ్యాంశాల రూపకల్పన, అర్హతా ప్రమాణాల విషయంలో ప్రభుత్వం మరోసారి సమగ్రంగా పునఃసమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. అత్యంత ప్రధానంగా వినిపిస్తున్న అభ్యంతరం ప్రస్తుత టెట్ పాఠ్యాంశాలు ఉద్యోగ ఉపాధ్యాయులు బోధిస్తున్న అంశాలకు పూర్తిగా అనుగుణంగా లేకపోవడమే. పాఠశాలలో గణితాన్ని బోధించే ఉపాధ్యాయుడు పరీక్ష కోసం జీవశాస్త్రం, సామాజిక శాస్త్రం వంటి ఇతర అంశాలను కూడా చదవాల్సి వస్తోం ది. అలాగే విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు గణితం లేదా సామాజిక శాస్త్రంలోని అంశాలను అభ్యసించాల్సి వస్తోంది.

**శిక్షగా మారొద్దు.. సామర్థ్య వికాసానికి వేదికవ్వాలి!**

టెట్‌ను కేవలం పరీక్షగా కాకుండా ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధికి ఉపయోగపడే ప్రక్రియగా ప్రభుత్వం చూడాలి. దేశంలోని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేస్తే ఉపాధ్యాయులకు, విద్యా వ్యవస్థకు రెండింటికీ మేలు జరుగుతుంది. అదే సమయంలో ఉపాధ్యాయ సంఘాలు కూడా కేవలం డిమాండ్లకే పరిమితం కాకుండా సభ్యులను పరీక్షకు సిద్ధం చేసే బాధ్యతను స్వీకరించాలి. శిక్షణా శిబిరాలు, అధ్యయన వేదికలు, మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి సహకరించాలి.

విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల అనుభవాన్ని గౌరవించడం కూడా అంతే ముఖ్యమైనది. ఉపాధ్యాయులు ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో తరగతి గదిలో నిలబడగలిగితేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

**కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,** 9010128884

# మందిర్, మసీదు, చర్చి.. కాదేదీ చోరీలకు అనర్హం



ఎం. కోటేశ్వరరావు

అయోధ్యలో రాముడి సొమ్ము కొట్టేసిన ఉదంతం అనేక మందితో మాట్లాడిస్తున్నప్పటికీ దేవుడి అంశగా జన్మించినట్లు చెప్పుకున్న నరేంద్ర మోడీ నోరు తెరిపించలేక సాక్షాత్తూ ఆ రాముడే "మౌనం"గా ఉండిపోయాడు! ఓట్ల కోసం రాముడు కావాల్సి వచ్చింది, ఎన్నికల ప్రచారం కోసం సాష్టాంగ ప్రమాణం చేస్తున్న ఫొటోల నిమిత్తం అయోధ్య రామాలయం అవసరమైంది. కానీ దాని లో జరిగిన కుంభకోణం గురించి స్పందించటానికి నోరు రావటం లేదు. తమ గుళ్లలో జరిగే అక్రమాలపై ఎందుకు దేవుళ్లు, దేవతలు స్పందించటం లేదన్నది తరతరాలుగా నాస్తికులు, హేతువాదులు, భౌతికవాదులు వేస్తున్న సమాధానం లేని ప్రశ్న. దేవతల లీలలు, మహిమల గురించి కథకథలుగా చెప్పుకుంటాం. ఇప్పుడు వారికి వచ్చిన కానుకల చోరీ గురించి అయోధ్య దర్యాప్తులో కతలు ఎన్నో వెలువడుతున్నాయి.

ఇంకా గూగులమ్మ తల్లికి ఏ మతం, కులాన్ని అంటగట్టలేదు.అఫ్ కోర్సు తమ కంపెనీ ప్రయోజనాలు, వాటిని పరిరక్షించే నేతలు, పార్టీల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే ఆ తల్లికూడా అలాంటి సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా నిరోధిస్తున్నదని చెబుతున్నారు.అయినా తనకు ఇబ్బందిలేని వాటిని అందిస్తున్నది.ప్రార్థనా స్థలాల్లో భక్తులు, విశ్వాసులు ఇచ్చే కానుకలను కొట్టి వేయటం అన్ని చోట్లా జరుగుతున్నదని ఎవరు అడిగినా చెబుతుంది, కావాలంటే తెలుసుకోవచ్చు. మందిరాలు, మసీదులు, చర్చిలు ఏవీ ఇలాంటి అక్రమాలకు దూరంగా లేవు. పేరు భిన్నంగా ఉండవచ్చు తప్ప ప్రతి చోటా కానుకల స్వీకరణ, వాటి అపహరణ జరుగుతూనే ఉంది. అయోధ్య ఉదంతంతో ఇప్పుడు జనాలకు పాత దొంగతనాలు తెలుస్తున్నాయి. ఇవన్నీ మతం, దేవుళ్లను రాజకీయ అవసరాల కోసం వినియోగించుకొనే సంఘపరివార్ సంస్థలన్నింటినీ జనం అనుమానంతో చూసేందుకు దోహదం చేస్తున్నాయి. దేవాలయాలను ప్రభుత్వ అదుపు నుంచి తొలగించాలని కోరుతున్న వారికి ఇప్పుడు నోట్లో పచ్చివెలక్కాయపడింది. ట్రస్టుల పేరు తో వాటిని నడిపే తమవారి నిర్వాకాలు వెలుగులోకి రావటంతో మింగా కక్కలేకుండా ఉన్నారు. ఇప్పుడు సంఘపరివార్ పెద్దల ఆందోళన దేవుడి సొమ్ము, నగలను కొట్టేయటం కాదు, కోట్లాది మంది భక్తుల్లో బిజెపి, విశ్వహిందూపరిషత్ వంటి తమ సంస్థల పట్ల ఉన్న విశ్వాసం, నమ్మకాలు సడలిపోతే తమ హిందూత్వ అజెండాకే ముప్పు అన్నదే అసలు భయం. కొందరిని కొంతకాలం మోసం చేయగలం, అందరినీ ఎల్ల కాలం మభ్యపెట్టలేము కదా!

కానుకల చోరీ పూర్వరంగంలో అయోధ్య రామాలయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోరాదని విశ్వహిందూపరిషత్ చెబుతోంది. ఎందుకంటే అది తమ చేతుల్లోంచి పోతుందనే భయం. మా హిందూ దేవాలయం, కానుకలు ఇచ్చిందీ, దొంగతనం చేసిందీ మా హిందువులే కదా, మేం మేం చూసుకుంటాం అన్నట్లుగా దాని వైఖరి ఉంది. సమాచార హక్కు చట్టం పరిధిలోకి రామాలయ ట్రస్టును తీసుకురాకూడదని చెబుతున్నారు. దీని అర్థం ఏమిటి? భవిష్యత్‌లో కూడా ఏం జరిగినా ఎవరూ ప్రశ్నించకూడదు, ఎంత పారదర్శకత! తప్పనిసరై రామాలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి సంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామా చేయగా ఆహ్వానితుడు గోపాలరావును ఆ జాబితా నుంచి తొలగించారు. వీరు ముగ్గురూ సంఘపరివార్ గుంపులోని వారే. నరేంద్ర మోదీ ప్రవచించిన జవాబుదారీతనం, నేను తినను ఇతరులను తిననివ్వను' అన్న 'చౌకీదార్' సంగతేమిటి? యావత్ దేశాన్నీ కదలించిన ఈ ఉదంతం అసలు పట్టించుకోవాల్సింది కాదన్నట్లుగా ఇంతవరకు ఒక్క మాటా మాట్లాడలేదు. సాగినంత కాలం సాగుతుంది తప్పదు. రామాలయంలో జరిగింది కుంభకోణం కాదు, చిన్న చోరీ మాత్రమే, అలాంటివి ప్రతిచోటా జరుగుతూనే ఉన్నాయి గనుక పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని కొందరు తక్కువ చేసి చూపేందుకు చూస్తున్నారు. గోడీ మీడియా తప్పనిసరై ఈ కేసు గురించి వార్తలను ఇవ్వకతప్పటం లేదు. గతంలో ఆరోపణలు వచ్చినపుడు వాటన్నింటినీ మూసిపెట్టింది, ఇప్పుడు సాధ్యం కావటం లేదు. నిజమే ప్రతి చిన్న చోరీ విచారణకు పోలీసులు కేసులు పెడతారు తప్ప రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకం గా దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయవు కదా! అయోధ్యలో జరిగింది చిన్న దొంగతనమే అయితే యోగి సర్కార్ సిట్‌ను ఎందుకు ఏర్పాటు చేసినట్లు? అనేక మంది సంఘపరివార్ ప్రముఖులు తీవ్ర ఆరోపణలు ఎందుకు చేస్తున్నట్లు? చిన్న చోరీ అయితే అయోధ్య బార్ అసోసియేషన్ నిందితుల తరఫున వాదించకూడదనే నిర్ణయం ఎందుకు తీసుకున్నట్లు ? ఆరోపణలకు గురైన ట్రస్టు సభ్యులు పట్టణం విడిచి వెళ్లాలని ఎందుకు డిమాండ్ చేసినట్లు? కొందరు చెబుతున్న ఈ "చిన్న" ఉదంతం గురించి సమాధానం లేని "పెద్ద" ప్రశ్నలు ఎన్నో తలెత్తుతున్నాయి.



దేవాలయాలను ప్రభుత్వ ఆధీనంలోకి తెస్తే అక్రమాలకు తావుండదని అర్థం కాదు. పాలక మండళ్లు, అధికారులను ప్రశ్నించటానికి అవకాశం ఉంటుంది. సరైన సమాధానం చెబుతారా లేదా అన్నది పక్కన పెడితే కనీసం సమాచార హక్కు చట్టం వర్తిస్తుంది. అదే ప్రైవేటు ట్రస్టులైతే రామాలయం గతే ! కాశీ విశ్వనాథుడి ఆలయంలోని శివలింగం వద్ద 1983 జనవరి ఐదున 2.55కిలోల బంగారం మాయమైంది. దాని దర్యాప్తులో బయటపడిన లోపాల తరువాత మహంతుల(పూజారుల) అదుపు నుంచి తప్పించేందుకు కాశీ విశ్వనాథ ఆలయ చట్టం 1983చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ట్రస్టుకు అప్పగించారు. ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆలయంలో చోరీ వార్తలు వెలువడగానే వారణాసిలో తీవ్రమైన నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఇప్పుడు అయోధ్యలో అలాంటిదేమీ కనిపించటం లేదు. ఎందుకంటే అధికారంలో ఉన్నది బిజెపి గనుక, వీధుల్లోకి వచ్చేవారెవరుంటారు. కాశీ ఆలయచోరీ కేసులో నిందితులకు పదిహేడేళ్ల తరువాత 2000సెప్టెంబరు ఏడున కోర్టు శిక్షలు విధించింది. గట్టి ఇనుప ఊచల కవచం మధ్య గర్భగుడిలో ఉన్న ఆ బంగారం చోరీ జరిగిన తీరు చూస్తే ఇంటి దొంగలపనే అని విచారణలో తేలింది. కవచ ద్వారాలను తెరిచినట్లు తప్ప పగలగొట్టిన ఆనవాళ్లు లేవు. ఆ సమయంలో గుడిలో ఉన్న ఇద్దరు పూజారులు తాము నిద్రించి ఉన్నట్లు చెప్పారు. పూజారుల ఏలుబడిలో గుడిలో నగదు,ఆస్తుల వివరాలు సక్రమంగా లేవని తేలింది.అంతా అడ్డగోలు వ్యవహారాలు నడిచాయి.ఆలయంపై వారసత్వ అధికారం ఎవరిదన్న కీచులాటలు కోర్టుకు ఎక్కగా వివాదం తేలేంతవరకు రోజువారీ రాబడిని కేసుల్లో ఉన్న పూజారులకు సమంగా పంచాలని 1950 దశకంలో సుప్రీంకోర్టు ఒక తీర్పు ఇచ్చింది. 1983 చోరీతో పూజారుల హక్కులకు తెరపడింది. నాలుగు వందల సంవత్సరాల పాటు ఒక పూజారి కుటుంబం ఆలయాన్ని ఏలింది. వెయ్యి సంవత్సరాల క్రితం రామానుజాచార్యుడు ప్రారంభించినట్లు చెబుతున్న వారసత్వ అర్చకత్వానికి లేదా మిరాసీదార్ల వ్యవస్థకు 1987లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వస్తి పలికింది. లడ్డూ కల్తీ అంశం వెలుగులోకి వచ్చిన తరువాత కొందరు దేవాలయాలను ప్రభుత్వ పరిధి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు అయోధ్యలో జరిగిందాన్ని సమర్థించుకొనేందుకు కాషాయ ప్రియులు నానా పాట్లు పడుతున్నారు.

నాలుగు దశాబ్దాలకు పైగా రామాలయం చుట్టూ రాజకీయాలను తిప్పి లబ్దిపొందిన కాషాయ దళాలకు తొలిసారిగా కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరచిన ఉదంతం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వచ్చే ఏడాది జరిగే ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలియని స్థితి. రాముడిని, రామాలయాన్ని వ్యతిరేకించిన ప్రతిపక్షాలు కానుకల కుంభకోణం నుంచి పెద్దగా లబ్దిపొందలేవని కొందరు వెంటనే ముక్తాయింపులు ఇవ్వటం ప్రారంభించారు.రామాలయ ఆందోళన ప్రారంభించిన వెంటనే బిజెపికి లబ్ది చేకూరలేదు. అదే విధంగా తమ మనోభావాలను బిజెపి పెద్దలు ఎలా దెబ్బతీశారో గ్రహించటానికి కూడా జనానికి సమయం పడుతుంది. దానికి నాంది పడింది. రాముడిని వీధుల్లోకి లాగింది మతవాదులు. వారి ప్రభావానికి లోనైన జనాన్ని దాన్నుంచి బయటపడవేసేందుకు ఎవరు ప్రయత్నించాలి? మరింత మూఢత్వంవైపు నెట్టేందుకు కాషాయ దళాలు చూస్తాయి. రాముడు(అయోధ్య), కృష్ణుడు(మధుర), శివుడి(వారణాసి) ఆలయాల పేరుతో ప్రారంభించిన క్రీడను దాన్ని వ్యతిరేకించే శక్తులందరూ ముల్లును ముల్లుతోనే తీసినట్లు ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కేరళ, తమిళనాడు వంటిచోట్ల కులవివక్షకు వ్యతిరేకంగా దేవాలయ ప్రవేశ ఉద్యమం ముందుకు వచ్చింది. దాని అర్థం దానిలో పాల్గొన్నవారు మతవాదులు కాదు, వివక్షను వ్యతిరేకించటం అసలు విషయం. ఆ ఉద్యమంలో ఉన్న ఏకె గోపాలన్ వంటి వారు ఎందరో తరువాత కమ్యూనిస్టునేతలుగా ఎదిగిన సంగతి తెలిసిందే. బిజెపి దేవుళ్లతో రాజకీయం చేసి లబ్ది పొందినట్లు భావించిన పవన్ కల్యాణ్ సనాతనవాది అవతారమెత్తి లబ్దిపొందేందుకు చూస్తున్నారు. తిరుమల లడ్డూ కల్తీ గురించి వెల్లడించటం ద్వారా తానే పెద్ద హిందూత్వవాదినని జనం ముందుకు వచ్చేందుకు చంద్రబాబు నాయుడు చేసిన ప్రయత్నం ఏమిటో తెలిసిందే. సున్నిత మనోభావాలతో కూడుకున్న అంశాల పట్ల మొరటుగా వ్యవహరించాల్సిన అవసరం లేదు. ఏ ఇతిహాసా లు, పురాణాల నుంచి తిరోగమన భావాలను ముందుకు తెస్తున్నారో, వాటి నుంచే ఎదుర్కొనే ఆయుధాలను వెలికి తీయాల్సిన తరుణమిది. హిందూత్వ భావజాలం ఒక్క రోజులో ఎలా పెరగలేదో దాన్ని ఎదుర్కొనే భావాలు జనంలోకి వెళ్లటానికి సమయం పడుతుంది. మొక్కనాటగానే కాయలు కాయవు.

అయోధ్యలో అవినీతి గురించి ఆరోపణలు రావటం ఇదే ప్రథమం కాదు, గతంలో అయోధ్య వివాదంలో అసలు పిటీషన్‌దార్లలో ఒకటైన నిర్మోహి అఖారా అనేక ఆరోపణలు చేసింది. రామాలయం పేరుతో దేశంలో, విదేశాల నుంచి విశ్వహిందూపరిషత్ వసూలు చేసిన నిధుల్లో పద్నాలుగు వందల కోట్లకు పైగా దుర్వినియోగం, స్వాహా జరిగిందని మహంత్ సీతారామ్ ఆరోపించారు. తాజాగా, రామాలయం కోసం రెండుకోట్లతో భూమి కొని దానికి రు.18.5కోట్లు బదలాయించినట్లు ఆరోపణలు వచ్చాయి. గతంలోలాగా ఆరోపణలు దాటవేయటం, మూసిపెట్టటం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపికి ఇప్పుడు అది సాధ్యం కాదు. ఇంతకాలం కాషాయ దళాలు, అవాస్తవాలను ప్రచారం చేశాయి. వాటిని వ్యతిరేకించే వారు ఇప్పుడు అసలు విషయాలను జనంలోకి తీసుకుపోవాలి.నిజాలు నిలకడ మీద బుర్రల్లోకి ఎక్కుతాయి !

# పోలీస్ వ్యవస్థపై పెరగాల్సిన నిఘా !

క్రమశిక్షణకు మారుపేరైనా పోలీస్ వ్యవస్థలో కొందరి తీరు మొత్తం వ్యవస్థ ప్రతిష్టను మసకబారేలా చేస్తుంది. ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న ఘటనలు మొత్తం పోలీస్ శాఖను వేలేత్తేలా చూపిస్తున్నాయి. పోలీస్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడి జైళ్లకు వెళ్లడమేగాక, కొందరు రాజకీయ నాయకులకు తాబేదారులుగా మారి వారు చెప్పినట్లు చేసి ఖాకీ వ్యవస్థకు మచ్చ తెస్తున్నారు. ఎసిబి దాడుల్లో పట్టుబడటం, వందల కోట్ల అక్రమాస్తులు బయటకురావడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా పోలీస్ వ్యవస్థ అధికారం వైపు తప్ప న్యాయం వైపు చూడటం లేదన్న విమర్శలు మూటకట్టుకుంటుంది. ఇక బాధితులు, న్యాయ అన్యాయాలు, ఫిర్యాదుల సేకరణ, బాధితులపట్ల పోలీసుల వ్యవహార శైలి పక్కనపెడితే పోలీస్ శాఖలోని కొందరు వ్యక్తులు అక్రమాలకు పాల్పడటం జరుగుతుంది. నకిలీ నోట్లతో ప్రజలను మోసగించి దోపిడీకి పాల్పడుతున్న ఘటనలో ఇద్దరు పోలీసులు ఉండటం అందులో ఒకరు ఎఎస్ఐ కావడం గమనార్హం.

దొంగలను పట్టుకోవాల్సిన పోలీసులే దొంగలుగా మారి తమ ఒంటిపై యూనిఫాంతోనే అక్రమ సంపాదన చేస్తూ దొరికిపోవడం నిజంగా ఆలోచించాల్సిన విషయం. పోలీస్ శాఖలో పనిచేస్తున్న వారిపైన నిఘా అవసరమని ఈ ఘటన చెబుతుంది.

గతంలో చిట్టి వ్యాపారాలు చేయడం, కుటుంబ సభ్యుల పేరుతో వ్యాపారాలు సాగించి తమ యూనిఫాంతో బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలు తగ్గినా ఈ అక్రమ వసూళ్లకు సంబంధించి పోలీసులు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇవి చాలా వరకు వెలుగు చూడటం లేదు. ఖమ్మం నగరంలో పనిచేసే ఓ పోలీస్ అధికారి ప్రభుత్వం కేటాయించిన నెంబర్ గల ఫోన్‌ను అసలు ఎత్తడని సొంత ఫోన్‌ను తప్ప శాఖపరమైన నెంబర్‌ను వినియోగించకపోవడం వల్ల బాధితులు ఇబ్బందులు పడుతున్నారని ఎన్ని రోజులు గడిచినా ఫిర్యాదులు నమోదు చేయరన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఓ కానిస్టేబుల్ సొంత సోదరినే హతమార్చేందుకు ప్రయత్నించి ఇప్పుడు అరెస్టయ్యారు. సోదరి వద్ద రూ.35లక్షలు, ఇతర బంగారు ఆభరణాలు తీసుకున్న సిఆర్ పిఎఫ్ కానిస్టేబుల్ రమేష్ తిరిగి చెల్లించేందుకు నిరాకరించడంతో పాటు సోదరి, మేనకోడలిపై హత్యాయత్నానికి పాల్పడి అరెస్టయ్యాడు. ఈ ఘటన కూడా సంచలనంగా మారింది. అక్రమ సంబంధాల నేపథ్యం లో కూడా పోలీసులు అరెస్టు కావడం ఆ శాఖకు ఇబ్బందికరమే.

కేసులు, దర్యాప్తులు ఇటువంటి విషయాల్లో ఆరోపణలు అప్పుడప్పుడు సహజమే కానీ వ్యక్తిగత జీవితాలకు సంబంధించి ఆరోపణలకు గురికావటం, పలు కేసుల్లో అరెస్టు కావడం క్రమశిక్షణ గల పోలీస్ వ్యవస్థకు మచ్చ తెస్తుంది. అందుకే పోలీస్ శాఖలో పనిచేస్తున్న వారిపై కూడా నిఘా అవసరమేనన్న భావ న వ్యక్తమవుతుంది. నాల్గవ సింహం దారి తప్పితే ఈ సమాజానికి ఇబ్బందికరంగా మారుతుంది. కంచే చేను మేసిందన్నట్లుగా ఈ వ్యవస్థను సన్మార్గంలో నడి పే ప్రధానమైన పోలీస్ శాఖ దారి తప్పడం పైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఆలోచించాల్సి ఉంది.



**సిఫారసుతో ఇబ్బందులు :**

పోలీసు అధికారుల నియామకాలకు సంబంధించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం సరికొత్త ఆనవాయితీని ప్రవేశపెట్టింది. డిఎస్‌పి స్థాయి కంటే దిగువన ఉన్న అధికారులకు ఆయా ప్రాంత శాసన సభ్యులు సిఫారసు చేస్తే పోస్టింగ్స్ ఇచ్చే అవకాశాన్ని కల్పించింది. ఇది రెండు రకాలుగా ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. ఒకటి, శాసన సభ్యుని సిఫారసుతో వచ్చిన ఎస్ఐ లేదా ఇతర సిబ్బంది ఆయన కనుసన్నల్లోనే పనిచేస్తుండటంతో కొందరు బాధితులకు న్యాయం జరగడం లేదు. రెండవది, సిఫారసు లెటర్ కోసం పోలీస్ అధికారులు కూడా రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూ ఎంతో కొంత ముట్టచెబుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో ఓ శాసన సభ్యుడు ఇద్దరు పోలీస్ అధికారులను మెప్పించేందుకు ఒకే పోస్టుకు ఇద్దరికి సిఫారసు లేఖ ఇచ్చినట్లు చర్చ సాగుతుంది. ఆయా ప్రాంతాల పరిస్థితి పోలీస్ సిబ్బందికి వృత్తి పట్ల గల అంకిత భావం, సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోస్టింగ్‌లు ఇస్తే ప్రజలకు మేలు జరుగుతుంది తప్ప ఈ రాజకీయ సిఫారసుతో పోస్టింగ్ పోలీస్ శాఖ ఓ వైపే చూసే ప్రమాదం ఉంది. గతంలోనూ ఇప్పుడు కూడా కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు చెబితేనే ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టులు కొనసాగుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో పోస్టింగ్‌లకు సిఫారసు లేఖలను అనుమతించకుండా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుని పోలీస్ వ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం**

# పిల్లలకు 'ఆల్బెండజోల్' మాత్ర తప్పనిసరి

● మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయన్నారు. పిల్లల్లో నులిపురుగుల (నట్టలు) సమస్యను నివారించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకుమాత్ర పంపిణీ చేశారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ నులిపురుగులు బయటకు కనిపించకపోయినప్పటికీ పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, అందుకే ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ మాత్ర వల్ల నులి పురుగుల సమస్య తొలగిపోయి పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని, తిన్న ఆహారంలోని పోషకాలు శరీరానికి బాగా అందుతాయని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం కూడా మెరుగుపడుతాయని ఆయన తెలిపారు. విద్యాశాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు ఉన్న 96,81,855 మంది చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగెందర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ జాప్యంపై డిజిపి ఆగ్రహం

● మిగిలిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న జాప్యంపై తెలంగాణ డిజిపి, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు సివి ఆనంద్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ, మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను కఠినంగా ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై సోమవారం నిర్వహించిన సొసైటీ కమిటీ సమావేశంలో డిజిపి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు వేగానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థలో పోలీసు కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ కుటుంబాల పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి విద్య అందించడమే లక్ష్యమని డిజిపి తెలిపారు. సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం, 2025–26 విద్యా సంవత్సరంలో 345 మంది విద్యార్థులు చేరగా, 2026– 27 విద్యా సంవత్సరానికి 360 మంది ప్రవేశాలు పొందారు. వీరిలో 184 మంది పోలీసు కుటుంబాలకు, 176 మంది సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం నర్సరీ నుంచి ఆరో తరగతి వరకు బోధన కొనసాగుతుండగా, పాఠశాల విస్తరణలో భాగంగా 17 తరగతి గదులతో నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణ ప్రతిపాదనను డిజిపికి అధికారులు వివరించారు. పాఠశాల పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రొక్యూర్‌మెంట్, అకాడమిక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కోఆర్డినేషన్ తదితర కమిటీలను ఏర్పాటు చేసి వాటి విధివిధానాలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డిజి (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, గ్రే హౌండ్స్ డిజి డాక్టర్ అనిల్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఐజి గజరావు భూపాల్, ఇతర ఉన్నతాధికారులు, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రిన్సిపల్ అనితా రెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి




● హామీల అమలుకై ఆగస్టు 2న హైదరాబాద్‌లో మహాసభ

● ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న సుమారు 50 వేల మంది కార్మికులకు కనీస వేతనం అమలు చేసి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 2న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని అధ్యక్షతన సోమవారం జరిగిన తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, పూసాల రమేష్, విజయలక్ష్మి, రామ్మూర్తి, పి.చక్రపాణి, వెంకటేష్, లక్ష్మణ్, రామకృష్ణ, ముంతాజ్, రజిత, రంగారెడ్డి, పుష్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు కేవలం రూ.3 వేలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని, ఎన్నికల సమయంలో వారికి రూ.10 వేల కనీస వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర కార్మిక సంఘాలన్నీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు. వంటకు అవసరమైన నిత్యావసర సరుకులు, కూరగాయలు, గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, కార్మికుల వేతనాల పెంపుపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఒకవైపు విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని, ప్రభుత్వ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల సమస్యలను మాత్రం విస్మరిస్తోందని ఎస్.బాలరాజ్ ఆరోపించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలకు నేడు చలో సచివాలయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ, ఎఐడిఎస్ఒ, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి, ఎఐపిఎస్‌యూ తదితర వామపక్ష విద్యార్థ సంఘాల నేతలు ఈ నెల 14న'ఛలో సచివాలయం'కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి విద్యార్థుల పెండింగ్ ఫీజులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల అసలు విద్యా సర్టిఫికెట్లను నిలిపివేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు అందక అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రవేశాలు, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే విడుదల చేయించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 14న నిర్వహించే 'ఛలో సచివాలయం' కార్యక్రమాన్ని విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు అనిల్, భాను, భరత్, మురళి, ఉదయ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోండి

● సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (పిఆర్‌పి) అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల 2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు. ఈ విజ్ఞప్తులపై స్పందించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాలి**

మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని ఆయన సూచించారు.
డిప్యూటీ సిఎంకు సింగరేణి అధికార సంఘం నాయకుల కృతజ్ఞతలు సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినందుకు వారు డిప్యూటీ సిఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి, విస్తరణ, సుస్థిర భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరపున సంపూర్ణ మద్దతు అందిస్తూ, సంస్థ పురోగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు చెప్పారు.

## కర్ణాటక తరహాలో తెలంగాణలో పిఆర్‌సి విధానం

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు ప్రభుత్వం యోచన: షబ్బీర్ అలీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కర్ణాటక తరహాలో తెలంగాణలో శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం(పిఆర్‌సి) జారీ చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. సిఎం ఎ.రేవంత్ రెడ్డికి తాను చేసిన విజ్ఞప్తి మేరకు ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, దీనిపై అధ్యయనం చేసేందుకు త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో 2002 ఓటరు జాబితాలో పేర్లు లేని వారికి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ ధ్రువీకరణతో పిఆర్‌సి జారీ చేస్తే శాశ్వత నివాసాన్ని నిరూపించుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. జననం, విద్యా ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, ఆస్తి వివరాలు, ఓటరు నమోదు, ప్రభుత్వ ఉద్యోగ రికార్డులు తదితర ఆధారాలను పరిశీలించి పిఆర్‌సి జారీ చేసే విధానాన్ని కర్ణాటకలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో కూడా ఇదే తరహా విధానం అమల్లోకి వస్తే నిజమైన నివాసితులకు ఉపశమనం కలుగుతుందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

# స్వర్ణ పతకం సాధించిన ప్రవల్లికకు సిఎం అభినందనలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** చైనాలోని ఒర్డోస్‌లో జరుగుతున్న తొలి ఏషియా అండర్ 23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2026లో మహిళల (4X400) రిలే పరుగుపందెంలో స్వర్ణ పతకం సాధించిన ప్రవల్లిక నరిమళ్లకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ బిడ్డ ప్రవల్లిక నరిమళ్ల ఆసియా అండర్ 23 అథ్లెటిక్ ఛాంపియనిన్‌షిప్‌లో అసమాన ప్రతిభ కనబరిచి మహిళల 4X400 మీటర్ల రిలేలో ఆమె స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. నల్గొండలోని ఎస్‌సి గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతూ, డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది అంతర్జాతీయ వేదికపై రాణించిన ప్రవల్లిక యువ క్రీడాకారులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని సిఎం ప్రశంసించారు. తాపీ మేస్త్రీ కూతురైన ప్రవల్లిక పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారని ఆయన పేర్కొన్నారు. ఏషియా అండర్ 23 అథ్లెటిక్ చాంపియన్షిప్ 4X400 మీటర్ల రిలే జట్టులో ప్రవల్లిక, శ్రావణి సచిన్ సాంగ్లే, సాంద్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్‌లతో కలిసి స్వర్ణ పతకం సాధించారు. ఈ నలుగురు సభ్యుల బృందం 3:33.62 సెకన్ల సమయంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని, ఆతిథ్య దేశమైన చైనాను అధిగమించింది. అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి ముందే, ప్రవల్లిక వివిధ వేదికల్లో 23 స్వర్ణాలతో సహా మొత్తం 35 రాష్ట్ర స్థాయి పతకాలను సాధించి అద్భుతమైన దేశీయ రికార్డును నెలకొల్పారు. ప్రవల్లికకు శిక్షణ అందించిన కోచ్‌లకు సిఎం అభినందనలు తెలిపారు. ఈ చాంపియన్ షిప్‌లో మొత్తంగా 3 స్వర్ణ, 4 రజత, 9 కాంస్య పతకాలతో సహా 16 పతకాలను సాధించిన భారత క్రీడాకారులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.



## తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకం

● రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల ముఖాముఖిలో కమిటీకి వినతులు

● సిఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధనలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమైందని ఉద్యమకారుల కమిటీ కొనియాడింది. సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంటి ఉద్యమాలు విజయవంతం కావడంలో క్షేత్రస్థాయి కార్యకర్తల త్యాగాలు మరువలేనివని పేర్కొంది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సోమవారం అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఉద్యమకారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించింది. కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్‌రెడ్డి, ఎస్.రాములు నాయక్ పాల్గొన్నారు. ఉద్యమకారుల సంక్షేమ కమిషన్‌కు చట్టబద్ధ హోదా కల్పించడం, ఉద్యమకారుల పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు, మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు, ఆర్‌టిసి బస్సుల్లో జీవితకాల ఉచిత ప్రయాణం, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, సొంత ఇల్లు లేని కుటుంబాలకు 250 గజాల నివాస స్థలం, గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్, ప్రభుత్వంతో పాటు గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవల కోసం ప్రత్యేక హెల్త్ కార్డులు జారీ చేయాలని ఉద్యమకారులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్పందిస్తూ ఉద్యమకారులు ప్రతిపాదించిన ప్రతి అంశాన్ని సమగ్ర నివేదికలో పొందుపరిచి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

## కేరళలో భారీ చోరీ..

● హైదరాబాద్‌లో కేరళ పోలీసుల దాడులు

● 200 ఏళ్ల క్రితంనాటి అయ్యప్పస్వామి విగ్రహం స్వాధీనం

● పోలీసుల అదుపులో నిందితులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేరళలోని కొట్టాయం జిల్లా తలయోలపరంబు ప్రాంతంలో ఉన్న నంబూదిరి కుటుంబ పూర్వికుల ఇంట్లో భారీ చోరీ జరిగింది. దుండగులు ఇంట్లోకి చొరబడి అత్యంత విలువైన, 200 ఏళ్ల క్రితం నాటి ప్రాచీన శాస్తా (అయ్యప్ప) విగ్రహాన్ని అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల విచారణలో ఈ దోపిడీ కేసులో హైదరాబాద్ లింకులు బయటపడ్డాయి. దీంతో కేరళం పోలీసులు సోమవారం హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అంతకుముందు పోలీసులు దోపిడీ జరిగిన ఇంటి పరిసరాల్లో ఆధారాలను సేకరించి, వేలిముద్రల నిపుణుల సహాయంతో దర్యాప్తు ప్రారంభించారు. దొంగలను గుర్తించేందుకు సమీప ప్రాంతాల్లోని సిసిటివి కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. అపహరించబడిన శాస్తా విగ్రహం ప్రాచీన కాలానికి చెందినదిగా, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగినదిగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులకు హైదరాబాద్ లింకులు బయటపడ్డాయి. దీంతో ఓ పోలీసు బృందం హైదరాబాద్ చేరుకుని ఇక్కడి పోలీసులు సహకారంతో దోపిడీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడ్డ ముగ్గురు నిందితులను హైదరాబాద్ నుంచి కొట్టాయానికి తరలిస్తున్నట్లు తెలిసింది.

## వారం రోజుల పాటు తేలికపాటి వర్షాలు

● ఎండాకాలాన్ని తలపిస్తున్న వాతావరణం

● సాధారణం కంటే 4.6 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా జూలై 20 వరకు వర్షాలు కొనసాగనున్నప్పటికీ, పలు జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. మరోవైపు రాష్ట్రంలో వర్షాకాలంలోనూ ఎండల తీవ్రత తగ్గకపోవడంతో సాధారణం కంటే 3 నుంచి 4.6 డిగ్రీల వరకు అధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. బుధవారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు.

**ఎండాకాలాన్ని తలపిస్తున్న వాతావరణం**

వర్ష సూచనలు ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. సాధారణంగా జూలై రెండో వారంలో నమోదయ్యే ఉష్ణోగ్రతల కంటే ప్రస్తుతం 3 నుంచి 4.6 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల్లో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, మెదక్ జిల్లాలో సాధారణం కంటే 4.6 డిగ్రీలు అధికంగా నమోదైందన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కొనసాగుతోందని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 30 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైనట్లు చెప్పారు. జూన్ చివరి వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా గణనీయమైన వర్షాలు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయన్నారు. గతంలో కొనసాగిన ఈదురుగాలుల తీవ్రత కూడా తగ్గిపోవడంతో ఎండల ప్రభావం మరింత పెరిగిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే స్వల్ప జల్లులు కురుస్తున్నాయని, వర్షభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావం వల్లేనని తెలిపారు. రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ పనులు చేపట్టాలని సూచించారు.

## అరాచకాలు ప్రజలు మరిచిపోరు: ఎంపి చామల




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రజలకు బిఆర్ఎస్ పాలనలో జరిగిన అరాచకాలు, అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలు బాగా తెలుసునని, రక్తదాహం, అధికార దాహం, ధనదాహం ఎవరికి ఉందో తెలంగాణ ప్రజలే తీర్పు చెప్పారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కెసిఆర్ కుటుంబం దోపిడీ రాజకీయాలను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని కెటిఆర్‌కు సూచించారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఏమైందో రాష్ట్ర ప్రజలకు తెలుసని అన్నారు. రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్ నాయకులు గుర్తు చేసుకోవాలని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని బిఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ రెండు ఒకటేనని, ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు తర్వాత కెసిఆర్ కుటుంబం మొత్తం ఢిల్లీలో సోనియా గాంధీని కలిసి కృతజ్ఞతలు తెలిపిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు కాంగ్రెస్ పాత్రను విస్మరించడం సరికాదని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో దక్షిణ తెలంగాణలో ఒక్క ప్రధాన ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కెటిఆర్ పాత్ర ఏమిటో కూడా ప్రజలకు తెలుసని, ఉద్యమకారుడు కె.కె.మహేందర్ రెడ్డి అవకాశాన్ని దెబ్బతీసి 2009లో కెటిఆర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని ఆరోపించారు.

**వ్యవసాయ మార్కెట్ కమిటీ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా.**

బహిరంగ వేలము ప్రకటన

లేఖ సంఖ్య: వ్య.మా.క/క/44/2026-27 తేది: 10.07.2026

వ్యవసాయ మార్కెట్ కమిటీ, కల్వకుర్తి పరిధిలో గల సమస్త ఆసక్తి గల వ్యాపారస్తులకు తెలియపరుచుట ఏమనగా! మార్కెట్ కార్యాలయము వెనుకభాగమున ఖాళీగా ఉన్న వికలాంగుల కేటగిరికి సంబంధించి షాప్ నెం. (06), యస్.సి. కేటగిరికి సంబంధించిన షాప్ నెం. (07), జనరల్ కేటగిరికి షాప్ నెం. (11), మొత్తము (03) దుకాణములు నెలసరి అద్దెపై కేటాయించుటకు బహిరంగవేలం జరుపబడును.
వేలములో పాల్గొనులకు పైన పేర్కొనబడిన కేటగిరిల ప్రకారం ఆసక్తి గలవారు దరఖాస్తు EMD రూ॥ 1,00,000/- (ఒక లక్ష రూపాయలు మాత్రమే) "**Secretary Agril Market Committee, Kalwakurthy**" అను పేరు మీద డి.డి. ద్వారా దరఖాస్తుతో పాటు వారియొక్క స్వంత చిరునామా గల ఏదేని ఆధార్ కార్డు / రేషన్ కార్డు / ఓటర్ ఐడిని జతచేసి మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి తేది: 20.07.2026 సోమవారం లోగ కార్యాలయములో జమచేయవలెను.
ఇట్టి విషయములో పూర్తి వివరములు, దరఖాస్తు ఫారము కొరకు కార్యాలయ పని వేలలో సంప్రదించి పొందవచ్చు. బహిరంగ వేలము తేది: 22.07.2026 బుధవారము రోజున మ॥ 12:00 గం॥లకు శ్రీయుత సంయుక్త సంచాలకులు మార్కెటింగ్ శాఖ హైద్రాబాద్ మరియు శ్రీయుత ఉపసంచాలకులు మార్కెటింగ్ శాఖ, హైద్రాబాద్ వారి ఆద్వర్యంలో ఈ-ఆక్షన్ మార్కెట్ కమిటీ కార్యాలయములో నిర్వహించబడును.
బహిరంగ వేలమునకు సంబంధించి పై అంశములను తిరస్కరించుటకు మరియు సమయాన్ని బట్టి మార్పులు గాని రద్దుగాని చేయుటకు పూర్తి అధికారము ఇట్టి మార్కెట్ కమిటీ కార్యాలయమునకు కలదు. ఇతర విషయములు కార్యాలయపు పనివేలలో సంప్రదించి తెలుసుకొనగలరు. ఇట్టి సందేహాలకు కార్యాదర్శి ఫోన్ నెం. 9885579063 కి సంప్రదించగలరు.

సం/- కార్యదర్శి,
వ్యవసాయ మార్కెట్ కమిటీ,
కల్వకుర్తి.

DIPR R.O. No. : 5946-PP/CL/ADVT/2026-27, Date: 13-07-2026



## వ్యవసాయ రంగానికి ఇరిగేషన్ మౌలిక వసతుల కల్పనే ప్రధానం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత నిస్తూ, సాగునీటి కొరతను శాశ్వతంగా నివారించేందుకు మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులను వేగవంతం చేసినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నీటి పారుదల శాఖ ముఖ్య అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుల నుంచి వస్తున్న నీటి అవసరాల డిమాండ్లకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలపై సమగ్ర కార్యాచరణ నివేదికను రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా బోర్ బావులు ఎండిపోకుండా నివారించవచ్చని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతికూల పరిస్థితులు రాకుండా ముందస్తుగా పెండింగ్ పనులకు మోక్షం కలిగించాలన్నారు. సమీక్ష ముగిసిన వెంటనే నియోజకవర్గ పరిధిలో 11 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఎన్ఎస్పీ లెఫ్ట్ కెనాల్ ఆధునికీకరణ మరమ్మత్తు పనులను క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షించారు. సాగునీరు కింది స్థాయి రైతులకు సకాలంలో అందేలా చూడటానికి కాలువల మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి కావాలన్నారు. వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎస్.సి మల్లికార్జున రావు, ఈఈ గోపినాథ్, ఈఈ మనోహర్, డీఈలు, జేఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యం

యాదాద్రి జోన్ డిఐజి జోయెల్ డేవిస్




**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి శా)య ఆధారాలతో విచారణ చేపట్టాలని యాదాద్రి జోన్ డీఐజీ డి.జోయెల్ డేవిస్ సూచించారు.నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయాన్ని డీఐజీ డి.జోయెల్ డేవిస్ సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈసమావేశంలో జిల్లా ఎస్పిశరత్ చంద్ర పవార్, జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు,శాంతిభద్రతల పరిస్థితి,నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు,పెండింగ్ కేసులు,దర్యాప్తు పురోగతి,బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన,కమ్యూనిటీ పోలీసింగ్,ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈసందర్భంగా డీఐజీ డి.జోయెల్ డేవిస్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు అత్యుత్తమంగా ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రమేష్,ఎస్‌బీ డిఎస్పి మల్లారెడ్డి,నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి,దేవరకొండ డీఎస్పీ శ్రీనివాస రావు,డీసీఆర్‌బీ డీఎస్పీ రవి,డీటీసీ డిఎస్పి నగేష్,సైబర్ క్రైమ్ డిఎస్పి లక్ష్మీ నారాయణ, ఏ.ఆర్ డిఎస్పిశ్రీనివాసులు,జిల్లా సీఐలు,ఆర్ఐలు,ఎస్ఐలు,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నులిపురుగులను నిలిపేస్తేనే శారీరక పెరుగుదల : తడక



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** నులి పురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నలిపేస్తేనే శారీరక పెరుగుదల ఉంటుందని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ 2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనానంతరం విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థిని విద్యార్థులు తప్పకుండా ఈ నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్బెండజోల్ తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్ బాబు, పద్మావతి జానకి ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ రమాదేవి, శంకర్, హెల్త్ సూపర్వైజర్స్ శ్రీదేవి, వరలక్ష్మి, ప్రభాకర్ మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో అంగన్వాడీ కేంద్రాలలో పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.మండల వ్యాప్తంగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ఎంఎంఎల్ హెచ్‌పిలు వారి కేంద్రాల పరిధిలో పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 8536 పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి వివరాలు తెలిపారు.

## చేనేత కార్మికులకు పని కల్పించే ధ్యేయంగా పనిచేస్తాం

**ప్రజాపక్షం/రామన్నపేట :** చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించే విధంగా నూతన కార్యవర్గం పనిచేస్తుందని జనంపల్లి వెంకటరమణ చేనేత సహకార సంఘం అధ్యక్షులు వనం శ్రీనివాస్ అన్నారు. సోమవారం చేనేత సహకార సంఘం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఎన్నికల అధికారి తరుణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. సంఘం ఉపాధ్యక్షులు ఎక్కలదేవి నరసింహ, కార్యదర్శి సంగిశెట్టి గోవర్ధన్, కోశాధికారి కైరంకొండ సరిత, డైరెక్టర్లు సంగిశెట్టి ధనుంజయ, సంగిశెట్టి బిక్షం, కర్నాటి నరసింహ, కైరంకొండ శ్రవణ్ కుమార్, సంగిశెట్టి అనితలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చేనేత వృత్తిదారులు, కార్మికులు, పద్మశాలీలు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



# జిల్లా అభివృద్ధి ప్రణాళికలకు సెన్సస్ హ్యాండ్ బుక్ కీలకం

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో సెన్సస్ హ్యాండ్ బుక్ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు. 2027 జనాభా గణనలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ తయారికి క్షేత్రస్థాయిలో పనిచేసే గణకులకు సోమవారం జిల్లా కేంద్రంలో శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని 265 గ్రామాలు, 5 మున్సిపాలిటిల పరిధిలో సమగ్ర సమాచార సేకరణ కోసం మొత్తం 270 మంది గణకులను నియమించినట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం జూలై 13 నుండి 18 వరకు మొత్తం ఆరు రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. ప్రతి రోజు 50 మందికి చొప్పున శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ డైరెక్టరీ తయారీలో భాగంగా గణకులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రధానంగా 9 అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యాసదుపాయాలు, వైద్య సౌకర్యాలు, నీరుపారిశుద్ధ్యం, కమ్యూనికేషన్, రవాణా సౌకర్యాలు, బ్యాంకులు రుణాలు, విద్యుత్ సౌకర్యాలు, భూవినియోగం, ప్రధాన వ్యవసాయ తయారీ ఉత్పత్తులు, హస్తకళలు, గ్రామ పరిశీలన అంశాలపై ఎక్కడా తప్పులు దొర్లకుండా, వాస్తవ సమాచారాన్ని సేకరించి నిర్ణీత గడువులోగా నివేదికలను సమర్పించాలని గణకులను కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్. కిషన్, జిల్లా సెన్సస్ అధికారి ఇస్లావత్ హోబా లాల్, గణాంక అధికారి వి. రామారావు, ఉప గణంక అధికారి ఎం. రాజేష్, పర్యవేక్షకులు దున్న శ్యామ్ పాల్గొన్నారు.

## రోమా ఇండస్ట్రీస్ బయోమెడికల్ వ్యర్థాల ప్లాంట్ విస్తరణను వెంటనే తిరస్కరించాలి

జిల్లా కలెక్టర్‌కు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ వినతి

**ప్రజాపక్షం/భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తొక్కపూర్ గ్రామంలోని సర్వే నెం.103లో ఉన్న రోమా ఇండస్ట్రీస్ ఉమ్మడి బయోమెడికల్ వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని ప్రస్తుతం ఉన్న 3 టన్నుల (3 టిపిడి) సామర్థ్యం నుండి 15 టన్నుల (15 టిపిడి)కు విస్తరించేందుకు ప్రతిపాదించిన పర్యావరణ అనుమతులను వెంటనే తిరస్కరించాలని కోరుతూ ఎఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమ విస్తరణ వల్ల పర్యావరణం, ప్రజారోగ్యం, భూగర్భ జలాలు, వ్యవసాయం, పశుసంపద, పరిసర గ్రామాల ప్రజల జీవనంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రజల ఆరోగ్యం, భావితరాల భద్రత దృష్ట్యా ఈ విస్తరణకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. 08/07/2026న నిర్వహించిన ప్రజా అభిప్రాయ సేకరణలో తాను ప్రత్యక్షంగా పాల్గొని పరిశ్రమ విస్తరణను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. ఆ సందర్భంగా తన అభ్యంతరాలను వీడియో రూపంలో నమోదు చేశారని, తెలుగు దినపత్రికల్లో కూడా వార్తలు ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. సంబంధిత



వీడియోలు, పత్రిక కటింగ్లను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే, భువనగిరి ఆర్డీవో శ్రీ కృష్ణారెడ్డి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యావరణ ఇంజనీర్ (ఇఇ) వెంకన్న సమక్షంలో జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణలో స్థానిక గ్రామాల ప్రజల కంటే ఇతర జిల్లాల నుండి వచ్చినవారు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆరోపించారు. స్థానిక ప్రజలు, రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను ప్రభుత్వం తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

## మిర్యాలగూడ డివిజన్ స్థాయి ప్రజావాణికి 20 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం డివిజన్ స్థాయి 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ప్రజావాణికి డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజల నుండి సుమారు 20 ఫిర్యాదులు, దరఖాస్తులు వచ్చాయి. ప్రతి సోమవారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ ప్రజావాణిలో అర్జీదారులు నేరుగా అధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయానికి 3, మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయానికి 6, దామరచర్ల తహసీల్దార్ కార్యాలయానికి 3, నిడ్మనూర్ తహసీల్దార్ కార్యాలయానికి 2 దరఖాస్తులు వచ్చాయి. అలాగే పెద్దవూర, అనుముల, తిమ్మలగిరి సాగర్ తహసీల్దార్ కార్యాలయాలకు ఒక్కొక్కటి చొప్పున, నల్లగొండ వ్యవసాయశాఖకు 1 మరియు మిర్యాలగూడ విద్యుత్ శాఖకు ఒక దరఖాస్తు అందాయి.ఈ సందర్భంగా ఆర్డీఓ రమణారెడ్డి మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను తక్షణమే ఆయా సంబంధిత శాఖల అధికారులకు పంపించి, గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దూరప్రాంతాల నుండి వచ్చే గ్రామీణ ప్రజల సౌకర్యార్థం డివిజన్ కేంద్రంలోనే ఈ ప్రజావాణిని నిర్వహిస్తున్నామని, ప్రజల అర్జీలను స్వీకరించి సత్వరం పరిష్కరిస్తున్నామని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ తహసీల్దార్ పి. శ్రీనివాస్, వ్యవసాయశాఖ ఏడీఏ కె. జగదీశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎం.ఋష్యేంద్ర మణి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు పాల్గొన్నారు.



## ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర ఇబ్బందుల్లో రైతులు

మెట్ట పంటలకు ఎకరాకు రూ.8వేలు ప్రోత్సాహకం ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య

**ప్రజాపక్షం/కోదాడ:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో అశించినంతగా వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వరికి ప్రత్యామ్నాయంగా మెట్ట పంటలు సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.8వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు అశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. పడిన కొద్దిపాటి వర్షాలకే రైతులు పత్తి విత్తనాలు వేశారని, అయితే దాదాపు 30 శాతం విత్తనాలు మొలకెత్తలేదని తెలిపారు. నకిలీ విత్తనాల సమస్య కారణంగా పలు జిల్లాల్లో రైతులు తీవ్ర నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 17జిల్లాలో లోటువర్షపాతం నమోదైందని, మెట్ట పంటల సాగుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం వెంటనే అందుబాటులోకి తీసుకరావాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో రైతులకు ఆర్థికంగా, మానసికంగా భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని దొడ్డ వెంకటయ్య పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని, ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే ధర్నాలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్, పుట్టపాక అంజయ్య, మొక్క వీరబాబు పాల్గొన్నారు.

## మహిళల, విద్యార్థినుల రక్షణలో పోలీసు అక్క పటిష్టంగా పనిచేయాలి

సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట :** మహిళల, విద్యార్థినుల రక్షణలో పోలీసు అక్క పటిష్టంగా పనిచేయాలని జిల్లా ఎస్పి కె. నరసింహ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి పోలీసు అక్క కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఆధ్వర్యంలో మహిళల, బాలికల, విద్యార్థినుల రక్షణ కోసం పోలీసు అక్క అనే వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. సమాజంలో మహిళలకు, పాఠశాలల్లో విద్యార్థులకు ధైర్యం కల్పించడం, పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదుదారులకు, బాధితులకు బరోసా కల్పించడం, స్నేహపూర్వక వాతావరణంలో వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేయడం ఈ పోలీస్ అక్క కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మహిళలు, విద్యార్థినులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా లేదా భయపడకుండా తమ సమస్యలను ఒక సొంత అక్కతో పంచుకున్నట్లు పోలీసులతో పంచుకునేలా చేయడమేనన్నారు. మహిళల, విద్యార్థినుల రక్షణలో, భద్రతలో ఎన్నో మార్పులు, ఎన్నో చట్టాలు వచ్చాయన్నారు. షీ టీం, బరోసా సెంటర్, సఖీ సెంటర్, ఇలా అనేక రక్షణ విభాగాలు వచ్చాయని తెలిపారు. సతీసహగమనం లాంటి పరిస్థితుల నుండి శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు చేయడం, చట్టాలను, ప్రభుత్వ పాలనను నడిపించే స్థాయికి మహిళలు ఏదిగారన్నారు. సమస్యలు, వేధింపులు ఉంటే డయల్ 100, 112లను సంప్రదించి పోలీసు సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, మహిళా ఎస్ఐలు మౌనిక, నీలిమ, జాన్సీరాణి, ఏఎస్ఐలు సైదాని, అరుణాదేవి, కవిత, మహిళా సూపరింటెండెంట్ సబితారాణి, శ్రీదేవి, అన్ని పోలీస్ స్టేషన్‌ల పోలీసు అక్కలు పాల్గొన్నారు.

## కాలుష్య కోరల నుండి కాపాడండి



జిల్లా కలెక్టర్‌కు పిట్టంపల్లి గ్రామస్థుల మొర

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామాన్ని కాలుష్య కోరల నుండి కాపాడాలని ఆ గ్రామానికి చెందిన పలువురు సోమవారం జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. గ్రామ పరిసరాలలో నెలకొని ఉన్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలమంతా అనారోగ్యాలకు గురౌతున్నామని, పంట పొలాలు నాశనమవుతున్నాయని కలెక్టర్‌కు నివేదించారు. గత కొన్ని రోజులుగా పరిశ్రమల నుండి దట్టమైన పొగ కారణంగా భరించలేని దుర్వాసన, ధూళి కణాలతో గ్రామంలో నివసించడం దుర్లభంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణం ప్రమాదంలో పడుతున్నాయని, చిన్న పిల్లలు, పశుపక్ష్యాదులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. వెంటనే సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం

నీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి : కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోవడంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నందున జిల్లాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలలు,హాస్టళ్లు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మండల స్థాయి అధికారులు ప్రతి రెండు వారాలకు ఒకసారి హాస్టళ్లు,పీహెచ్‌సీలు,అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, వాటి నివేదికలను స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు.పాఠశాల విద్యార్థుల యూనిఫాంను ఈ నెల 15వ తేదీలోగా రెసిడెన్షియల్ పాఠశాలల బాలికలకు పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కాగా ఈ సోమవారం ప్రజావాణిలో మొత్తం 105 దరఖాస్తులు అందగా,రెవెన్యూ శాఖకు 55,తక్కిన శాఖలకు 50 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్



రెడ్డి,శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

**పారదర్శకంగా భూముల రీ సర్వే నిర్వహించాలి:** ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా భూముల రీ సర్వేను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సర్వేయర్లను ఆదేశించారు.సోమవారం ఎన్‌జి కళాశాలలో భూముల రీ సర్వే విషయమై సర్వేయర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే నిర్వహించే సమయంలో గతంలోని సర్వే రికార్డులను ఆధారం చేసుకోవాలని, సర్వే నంబర్ ట్యాలీ చేసుకుని నిర్ధారణకు వచ్చిన తర్వాతే సర్వే చేయాలన్నారు. టిప్పన్ మ్యాప్ కూడా సర్వే సమయంలో దగ్గర ఉంచుకోవాలని, సర్వేలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## చర్చి భూములను కాపాడాలి

రౌడీ మూకలతో బెదిరిస్తున్నారని ఆరోపణ

**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని కమ్మగూడెం పరిధిలోని చర్చికి సంబంధించిన భూమితో పాటు ఇతర వ్యక్తుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.రౌడీ మూకలతో దాడులు చేయిస్తున్న వారిని అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరారు.సోమవారం చర్చి ఆలయంలో 50 నుంచి 60 కుటుంబాలు కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం ఊరు నుంచి వెళ్లిపోయిన గొల్లపూడి కుటుంబానికి చెందిన గొల్లపూడి జెర్మియాష్,గొల్లపూడి జోజప్ప,గొల్లపూడి శౌరయ్య,గొల్లపూడి సాగర్‌లు కలిసి రాజకీయ నాయకులతో సంబంధాలు ఏర్పరచుకుని మాకు పట్టాలు ఉన్నాయని చెప్పి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు.రెండు మూడు కుటుంబాలను బెదిరించడమే కాకుండా చర్చికి సంబంధించిన భూములను కూడా రౌడీ మూకలతో బెదిరించి కబ్జా చేసుకోవాలని చూస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఎలాంటి హక్కు లేకుండా ప్రశాంతంగా ఉన్న తమ గ్రామంపై రౌడీలతో బెదిరింపులకు పాల్పడుతున్న గొల్లపూడి కుటుంబ సభ్యులను అరెస్టు చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.




## 18, 19న తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు



**ప్రజాపక్షం/దేవరకొండ :** జులై 18, 19న జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు రమావత్ దేవీలాల్ అన్నారు. సోమవారం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. భద్రాచలం కొత్తగూడెం జిల్లాల్లో జులై 18, 19తేదిన జరిగే మహాసభల విజయవంతానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. గిరిజనులపై జరిగే దాడులను అరికట్టాలని గిరిజన రైతుల పోడు భూముల పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు వెంటనే పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని అన్నారు. గిరిజన విద్యార్థి యువతకు బ్యాగ్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంగలయ్య, రాములు, పెద్ద ఎల్లయ్య, యర్రయ్య, వెంకటేష్, వెంకటయ్య, అంజయ్య, గురవయ్య తదితరులు ఉన్నారు.



## అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.60.37 కోట్ల నిధులు మంజూరు చేయండి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్అండ్‌బి రహదారుల పునరుద్ధరణ కోసం రూ.60.37 కోట్ల నిధులు మంజూరు చేయాలని అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం ద్వారా కోరడం జరిగింది. ఈ నియోజకవర్గంలోని రహదారులు చాలా కాలంగా పీరియాడికల్ రెన్యువల్ పనులు జరగక దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రితో అన్నారు. గ్రామాలు, మండలాల పర్యటనల్లో ప్రజలు రహదారుల దుస్థితిని తన దృష్టికి తీసుకు వచ్చి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శాఖ ప్రతిపాదించిన 15 రహదారుల పీరియాడికల్ రెన్యువల్ పనులతో పాటు రెండు చిన్న వంతెనల నిర్మాణానికి మొత్తం రూ.60.37 కోట్ల నిధులు మంజూరు చేసి, పరిపాలనా అనుమతి ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే విజయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడుతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పుల్లూరు రఘురెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో 'సర్'పై అవగాహన సదస్సు

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్లలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర పోలమోని నరసింహులు, ముఖ్య అతిథులుగా హాజరై ఎస్ఐఆర ప్రక్రియ ప్రాముఖ్యత, ఓటరు వివరాల సక్రమ నమోదు, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన బాధ్యతలపై వివరంగా ప్రసంగించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు పాత్ర ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని వారు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి బూత స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జడ్చర్ల పట్టణ అధ్యక్షులు ఎడ్ల అమర్‌నాథ్ గౌడ్, రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు బూత్ లెవల్ లీడర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/కృష్ణ :** మక్తల్ నియోజకవర్గంలో జరిగే బహిరంగ సభకు సోమవారం కృష్ణ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. మక్తల్‌లో జరిగే రూ.237 కోట్లతో మక్తల్ నారాయణపేట్ నాలుగు లైన్ల హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కోసం మంత్రులు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, దామోదర్ మేరకు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ గౌడ్, యువజన అధ్యక్షుడు షేక్ సర్వరాజ్, సీనియర్ నాయకులు సర్పంచులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న ఓటర్ సవరణ ప్రక్రియ కార్యక్రమం

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి , తొలి మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుకేషిని విశ్వేశ్వర్, 11వ వార్డు బిఆర్ఎస్ ఇన్‌చార్జి మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ యాదగిరి సూచన మేరకు ఓటర్ సవరణ ప్రక్రియలో భాగంగా 11వ వార్డు ఓటర్ల ఫారాలను వార్డు యూత్ అధ్యక్షులు సద్దాం ఖురైషి, ఖాదర్ పాషా, హఫీజ్ రహేమాత్, సోసూలు సర్ ప్రక్రియ ఫారాలను నింపి ప్రజలకు సహకరించారు. మరో 12 రోజుల్లో సర్ ప్రక్రియ ముగియనున్నందున ఓటర్లు తమ ఫారాలను 11వ వార్డులో తాము ఏర్పాటు చేసుకున్న టెంట్ వద్ద తీసుకు వచ్చి నింపించుకోవాలని వార్డు బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు సద్దాం ఖురైషి కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు బిఎల్‌ఏ, బిఆర్ఎస్ పార్టీ బిఎల్‌ఏ లు పాల్గొన్నారు.



## ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

పిల్లలందరికీ ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**ప్రజాపక్షం/మక్తల్ :** రాష్ట్ర వ్యాప్తంగా పిల్లల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మక్తల్ మండలం చిట్యాల గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలు కిశోర బాల బాలికలందరికీ ఈ కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణ మాత్రలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ.కనకాద్రి మాట్లాడుతూ నులిపురుగులు (కడుపులో పురుగులు) పిల్లల శరీరంలో చేరడం వల్ల వారు రక్తహీనత, పౌష్టికాహార లోపం, అలసట మానసిక, శారీరక ఎదుగుదల లోపించడం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీని వల్ల పిల్లలు చదువులో, ఆటల్లో వెనుకబడే ప్రమాదం ఉందని అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించి, మీ పరిధిలోని పిల్లలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర వేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు, ఆరోగ్య కార్యకర్త ఉపాధ్యాయులు అందరూ నులిపురుగులను నిర్మూలిద్దాం. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం అని ప్రతిజ్ఞ చేశారు.

## హెల్త్ కార్డులు జారీ చేయకుండానే

# 1.5% జీతం కట్ చేయడం దారుణం

పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బి.గోపాలం



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అధ్యక్షుడు బి.గోపాలం అధ్యక్షతన సోమవారం పెన్షనర్స్ సంఘం సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్‌కు హెల్త్ కార్డులు జారీ చేయకుండానే, విధివిధానాలను రూపొందించకుండానే మే నెల, జూన్ నెల జీతంలో ఒకటి పాయింట్ (1.5%) ఐదు శాతం డబ్బులు కట్ చేసుకోవడం దారుణం అని, దీనిని వ్యతిరేకిస్తున్నామని మక్తల్ పెన్షనర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.గోపాలం, బి.భాస్కర్ తెలిపారు. 1.5% మినహాయించడం పెన్షనర్స్ అందరూ ఆందోళనకు గురిఅయ్యారని, ఇది న్యాయం కాదని, వెంటనే వెనక్కి తిరిగి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.
అసలు పెన్షనర్స్ నుండి హెల్త్‌కార్డులు కోసం ఒకటి పాయింట్ ఐదు శాతం మినహాయింపు ఇవ్వాలి. వసూలు చేయరాదని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 15న అందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలని, ప్రాథమిక హక్కులో భాగంగా పెన్షనర్స్ అందాల్సిన బెనిఫిట్స్‌సకాలంలో అందక చాలా మంది మరణించారని ఈ మరణాలకు ప్రభుత్వమే కారణమని తెలిపారు. 2023 నుండి పెండింగులో ఉన్న డిఏ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ పిఆర్‌సిని రాష్ట్ర ప్రభుత్వము ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రకటించాలని వారు కోరారు. ఈ మధ్య ప్రభుత్వ ప్రచారము. బ్యాంకుల ద్వారా పెన్షనర్స్ ప్రమాద బీమా పథకాలను ప్రకటించాము. సాధారణంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే వేతనాన్ని బట్టి రూ.30లక్షల నుండి కోటి వరకు పరిహారం ఇస్తామని బ్యాంకులు వెల్లడించాయి.
ప్రస్తుత ఆర్థిక అవసరాల కోసం పిల్లల చదువులు, వైద్య ఖర్చుల కోసం పిల్ల పెళ్లిళ్ల కోసం పెన్షనర్స్ అప్పుల పాలవుతుంటే ప్రభుత్వం మీరు చనిపోతే కోట్లు వస్తాయి అనడం పెన్షనర్స్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమే, పెన్షనర్స్ న్యాయం అయిన డిమాండ్ల నూతన పిఆర్సీ అమలు, పెండింగు డిఎలను వెంటనే విడుదల చేసి, వారి కుటుంబాలకు భద్రత, భరోసా కల్పిస్తారని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. పెన్షనర్స్ అందరూ ఈనెల 31 లోపల ఐటి ఈ ఫైలింగ్ చేసుకోవాలని, ఎస్‌టిఒలో ఏవైనా సమస్యల ఉంటే వాటిని పరిష్కారిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు బి.గోపాలం, బి.భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాష్, లక్ష్మీ కాంత్‌రెడ్డి, తిప్పారెడ్డి, యశోద ల పుట్టినరోజు సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి అభినందించారు.
ఈ కార్యక్రమంలో బి.సంజన, సూర్య ప్రకాష్, సిద్ది లింగయ్య, తులసప్ప, అరుణ, విద్యావతి, సుజాత, యశోద, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, నారాయణరెడ్డి, సిద్దిరాములు, నరసింహులు గౌడ్, ఈశ్వరయ్య, తిప్పారెడ్డి, లక్ష్మీ కాంత్‌రెడ్డి, జి.సురేందర్, సత్యనారాయణ, బసవరాజ్, జనార్దన్, అశోక్ గౌడ్, ఎల్లప్ప, మహ్మద్ హుస్సేన్, ఖదీర్, రామచందర ఆశన్న, రమేష్ 80 మంది సభ్యులు పాల్గొన్నారు.



## దిగ్విజయంగా తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమం

**ప్రజాపక్షం/నారాయణపేట :** గ్రామీణ స్థాయి వరకు నాణ్యమైన క్రీడా విజ్ఞానాన్ని అందించి, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్‌నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమం మక్తల్ నియోజకవర్గం కేంద్రంలో విజయవంతంగా నిర్వహించబడింది. మక్తల్ బాయ్స్ హై స్కూల్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ క్రీడా శాఖ రూపొందించిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా క్రీడా నిపుణుల జ్ఞానాన్ని రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం, జిల్లాకు చేరవేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి మొబైల్ బృందంలో ముగ్గురు కోచ్‌లు, ఒక ఫిజియోథెరపిస్టు, ముగ్గురు సీనియర్ క్రీడాకారులు, ఒక ప్రత్యేక అధికారి పాల్గొని క్రీడలకు సంబంధించిన శాస్త్రీయ అవగాహన, ప్రాయోగిక శిక్షణ, మార్గదర్శకాన్ని అందించారు. ఇందుకు అవసరమైన ప్రత్యేక శిక్షణ కిట్లను కూడా వారికి అందజేశారు.
ఈ కార్యక్రమంలో ప్రధానంగా క్రీడల ప్రాథమిక నైపుణ్యాలు, ఆధునిక సాంకేతికతలు, గాయాల నివారణ, పునరావాసం, పునరుద్ధరణ, హైడ్రేషన్ , క్రీడా పోషకాహారం, ఒత్తిడి నిర్వహణ, క్రీడాకారులు మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి శెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడల్లో క్రియాశీలకంగా ఉన్న ప్రాంతాలకు విస్తరించి మరింత మంది క్రీడాకారులకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/ వెల్దండ :** మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామంలో కామినేని ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ సిద్దగోని రమేష్‌గౌడ్ ప్రారంభించారు. శిబిరంలో కామినేని ఆస్పత్రికు గ్రామప్రజలకు రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, సాదారణ ఆరోగ్య సమస్యలపై పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన కామినేని ఆస్పత్రి యాజమాన్యానికి వైద్య సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి పడకల సామర్థ్యం పెంచాలి

వేతనాల కోతను నిరసిస్తూ పారిశుద్ధ్య కార్మికుల నిరవధిక సమ్మె



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పడకల సామర్థ్యాన్ని తగ్గించిన కారణంగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల్లో కోత విధించడాన్ని నిరసిస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆసుపత్రి కార్మికులు సోమవారం నిరవధిక సమ్మెకు దిగారు. ఉదయం నుంచే విధులను బహిష్కరించి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, వీపనగండ్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పడకల సామర్థ్యాన్ని 30 నుంచి 23 కు తగ్గించడంతో, గత రెండేళ్లుగా అందుతున్న రూ.11వేల వేతనాన్ని రూ.7,500 కు తగ్గించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు రోగులకు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపేలా వేతనాల్లో భారీ కోత విధించడం బాధాకరమన్నారు. వేతనాల సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించి ఆందోళనలు నిర్వహించినా ఎలాంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సామర్థ్యం పెంచి, తగ్గించిన కాలానికి సంబంధించిన బకాయిలు కూడా చెల్లించగా, వీపనగండ్ల ఆసుపత్రిలో మాత్రం ఇప్పటికి పడకల సంఖ్య పెంచకపోవడంతో పాటు బడ్జెట్ విడుదల చేయకపోవడం వల్ల కార్మికులు నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులను పలుమార్లు ప్రశ్నించినా స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించి, రెండేళ్లుగా తగ్గించిన వేతనాల బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు, పడకల సామర్థ్యంతో సంబంధం లేకుండా పూర్తి స్థాయి వేతనాలు చెల్లించాలని కార్మికులు డిమాండు చేశారు. ఈ ఆందోళనలో వరలక్ష్మి , లింగమ్మ, అలివేలు, పార్వతమ్మ, రేణుక, పొన్నమ్మ, నాగమ్మ, మనెమ్మ, బాలేశ్వరమ్మ, అనిల్, గణేష్, ప్రసాద్ ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాధికారిని సస్పెండ్ చేయాలి

బిసి విద్యార్థి సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యాశాఖ పరిపాలన పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా విద్యాధికారి (డిఇఒ) పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తూ ఎఐఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, యుఐఎస్ఎఫ్ బిసి విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా విద్యాధికారిని సస్పెండ్ చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ 2024లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఒక ప్రైవేట్ పాఠశాలపై ఎంఇఒ, డిఇఒలకు ఫిర్యాదు చేసినప్పటికీ రెండు సంవత్సరాలుగా ఎలాంటి విచారణ చేపట్టలేదని తెలిపారు.



అయితే ఈ విద్యా సంవత్సరంలో అదే పాఠశాలకు అనుమతి ఇవ్వడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అచ్చంపేట పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలపై బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, కమిషన్ విచారణ నిర్వహించాలని జిల్లా విద్యాధికారికి ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, యంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుక్కాపురం మహేష్, బిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దెలబండ సాయి బాబు, యుఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు దేగ అనిల్ కుమార్, తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


# కుమ్మరికుంట చెరువు ఆక్రమణ ఆపండి

ముదిరాజ్ సంఘం నాయకులు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 756 సర్వే నెంబర్‌లో గల 1.37 ఎకరాల కుమ్మరి కుంట చెరువు అక్రమణ గురైందని చెరువును కాపాడాలని ముదిరాజ్ సంఘం నాయకులు జమ్ముల శ్రీకాంత్ సోమవారం కల్వకుర్తి ఆర్డీ జనార్దన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 756 లో గల 1.37 ఎకరాల కుమ్మరి కుంట చెరుకు కబ్జాకు గురి అవుతుందన్న అంశం గత కొద్ది ఏళ్లుగా పత్రికలు, టీవీ ఛానల్లో అనేక కథనాలలో రావడంతో గతంలో కల్వకుర్తి తాహసీల్దారుగా పనిచేసిన రాంరెడ్డి అక్రమ ప్రహరీ గోడను కూల్చడం జరిగిందని అయితే అనంతరం చెరువును అక్రమించి ప్రహరీ గోడ తిరిగి నిర్మించడం జరుగుతుందని, సదరు మిల్లు యజమాని అక్రమ నిర్మాణం చేపట్టినట్లుగా 2025 సంవత్సరంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సైతం అక్రమ నిర్మాణం అని తేల్చడం జరిగింది. గతంలోనే ఎఫ్‌టిఎల్ పరిధిలో, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణం చేపట్టడం జరిగిందని, సదరు యజమానికి నోటీసు సైతం ఇవ్వడం జరిగిందని పేర్కొంటూ హద్దులు నిర్ణయించి, అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని, భవిష్యత్తులో అక్రమ నిర్మాణం చేపట్టవద్దని ఆదేశించడం జరిగిందన్నారు. అయినప్పటికీ సదరు వ్యాపారవేత్త తిరిగి అక్రమ నిర్మాణం చేపట్టడంతో ముదిరాజ్ వర్గానికి ఉపాధి కల్పించే కుమ్మరి కుంట చెరువుల ను అక్రమణకు గురికాకుండా నిలువరిస్తూ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి మా ముదిరాజ్ వర్గానికి తిరిగి ఉపాధి కల్పించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిలకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మక్తల్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం 12 జూలై ఆదివారం వట్టం రవి కన్వెన్షన్ హాల్ నందు మాజీ అధ్యక్షులు లయన్ ఎ.సత్యాంజనేయులు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ప్రోగ్రాం చైర్మన్ లయన్ జి.జయపాల్ రెడ్డి స్వాగత ఉపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమయింది. లైన్స్ అంతర్జాతీయ సంస్థ వ్యవస్థాపకులు లయన్ మెల్విన్ జోన్స్ చిత్రపటానికి అతిథులచే పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి లయన్ డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ సమాజంలో సేవ చేసేవాళ్లు చాలామంది ఉంటారు కానీ, సేవను పుచ్చుకునే వాళ్లు ఉన్నప్పుడే సేవ చేసే వారికి అవకాశం ఉంటుందని, పుచ్చుకునేవారు లేనప్పుడు సేవ చేసే భాగ్యము కలగదని తెలియజేశారు. అదేవిధంగా లైన్స్ ఐ హాస్పిటల్ నిర్మాణానికి ప్రస్తుతం నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పరిసరాల్లో అర్ధ ఎకర స్థలము ఇవ్వడానికి అంగీకారం తెలియజేశారు.



మక్తల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 ఎ నందు అత్యుత్తమ సేవలకు పేరుగాంచిందని, ఎన్నో అవార్డులు పొందినదని భవిష్యత్తులో కూడా నూతన కమిటీ సభ్యులు కలిసి లైన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ బీమాకు ఉత్తమ సేవల ద్వారా మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ ఆత్మారాం హెడికే, అధ్యక్షులు రవికుమార్, ఉట్కూరు క్లబ్ అధ్యక్షులు జయసింహారెడ్డి, సభ్యులు వై.జనార్ధన్‌రెడ్డి, మశ్చింద్ర రెడ్డి, రాయచూర్ క్లబ్ నుండి లయన్ పరిటాల రాము, పాస్ట్ ఆర్‌సి హాజరైనారు.
అదే విధంగా మక్తల్ సీనియర్ లయన్ సభ్యులు వి.నరేందర్, డి.బసవరాజ్, బి.కొండయ్య, ప్రోగ్రాం కో చైర్మన్ జి.శరణప్ప, సిద్ది లింగయ్య, సుజాత, అరుణ, జయశ్రీ, ఆడెం శ్రీనివాస్, వెంకటేష్, పాపిరెడ్డి, డి.వి.చారి, వాదిరాజ్ అంజన్ ప్రసాద్, ఆడం సత్యనారాయణ, కోళ్ల వెంకటేష్, సుకన్య, శేఖర్, కావాలి తాయప్ప, తాన్సింగ్ , భార్గవ్ రానా, కర్ని స్వామి, రమేష్ కుమార్, కాకులారం అశోక్, వట్టమ్ రతన్ కుమార్ గుప్తా, రవికుమార్ గౌడ్, పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా లయన్ రవి కిరణ్, లయన్ డివి చారి పాల్గొన్నారు.




## ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు చదువులో రాణిస్తారని, ఫలితంగా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని గద్వాలలోని ప్రభుత్వ బాలికోన్నత పాటశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సాధన చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. నులిపురుగుల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఉన అంగన్వాడీ కేంద్రాల చిన్నారులతో పాటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు న్యూట్రీషన్ సమస్యలు లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి , ఇతర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




## నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో..

## ఆధార్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఆధార్ ఆపరేటర్లకు ఆధార్ నమోదు, నవీకరణ సేవలను సమర్థవంతంగా అందించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో యూఐడీఏఐ తెలంగాణ రాష్ట్ర మేనేజర్ నరేష్ చంద్ర ప్రధాన వక్తగా పాల్గొని, ఆధార్ నమోదు , అప్డేట్ ప్రక్రియ, ఈప్రాసెస్ విధానం, ధృవీకరణ ప్రక్రియలు, వివిధ ఆధార్ సేవలకు అవసరమైన చెల్లుబాటు అయ్యే సహాయక పత్రాల గురించి సవివరంగా అవగాహన కల్పించారు. అలాగే, యూఐడీఏఐ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఆధార్ ఆపరేటర్లందరూ పాల్గొన్నారు. అలాగే కే.విజయ్ కుమార్, ఈడిఎం కె.రామ్ మోహన్, జిల్లా మేనేజర్ డియం, శివ ప్రసాద్, జిల్లా మేనేజర్ హాజరయ్యారు. శిక్షణ సందర్భంగా పాల్గొన్న ఆపరేటర్ల సందేహాలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు ఆధార్ సేవల నిర్వహణలో నాణ్యత, ఖచ్చితత్వం సామర్థ్యాన్ని పెంపొందించే అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.

## మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని ఎల్‌బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ నగర్‌లో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరిరెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, చంద్రారెడ్డి, రాంచంద్రారెడ్డి, పరమేష్‌తో పాటు కాలనీవాసులు రమేష్, వెంకట్ రెడ్డి, శోభన్, ఏడుకొండలు, యాదిరెడ్డి, కిరణ్, యాదగిరి రెడ్డి, రజని, నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడి ఇంటిపై రాళ్లదాడి

**ప్రజా పక్షం/హయత్‌నగర్ :** యాదగిరిగుట్ట టెంపుల్ డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ మనుమడు అతని అనుచరులు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఇంటిపై రాళ్ల దాడి చేశారు. ఈ సందర్భంగా శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అంతర్గత విషయాలకు కులాన్ని ఆపాదించి యాదవ సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టి తన ఇంటిపై రాళ్ల దాడి చేశారని ఆరోపించారు. కొంతకాలంగా సోషల్ మీడియా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ఎఐ టెక్నలాజి ఉపయోగించి నేను అనని మాటలు అన్నట్లు యాదవ సామాజిక వర్గాన్ని కించపర్చినట్టు నాపై ఆరోపణలు చేయడమే గాక నా ఇంటిపై దాడి చేయడం ఏమిటి అని ప్రశ్నించారు.

## సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు మాకొద్దంటూ రహదారి దిగ్బంధం



**ప్రజాపక్షం/కొత్తూరు:** సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు మాకొద్దు సారూ అంటూ సోమవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్లతోపాటు వివిధ గ్రామాలు, గిరిజన తండా నుండి పెద్ద ఎత్తున కొత్తూరు మండల కేంద్రానికి చేరుకొని 44వ జాతీయ రహదారిని దిగ్బందం చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకుడు అంబటి ప్రభాకర్, ఎల్లారం శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ డంపింగ్ యార్డుకు సంబంధించిన పనులు ప్రారంభం కాకముందే అడ్డుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. చెత్త డంపింగ్ యార్డు ఇక్కడికి వస్తే భవిష్యత్‌లో మనం ఏమి లేయలేని పరిస్థితులు ఏర్పడుతాయని, ఇక్కడి భూములు, పర్యావరణం పూర్తిగా కలుషితమైపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజకీయ జెండాలను, విబేధాలను పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు కలిసి పోరాటం చేసేందుకు ముందుకు రావాల్సిన అదసరం ఎంతైనా ఉందన్నారు. కొత్తూరు పోలీసులు జెఎసి నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 44వ జాతీయ రహదారిని దిగ్బందించడంతో కిలో మీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## సర్ ప్రకియకు ఓటర్లు సహకరించాలి



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఎన్యుమరేషన్ ధ్రువపత్రాల స్వీకరణ మరియు ఆన్లైన్ ఎంట్రీ చేయడంవంటి పనులను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ యోగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయడానికి ఓటర్లు సహకరించాలని కోరారు. ప్రతి వార్డులు బిఎల్వోలు సర్ ధ్రువపత్రాలను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఓటర్ పత్రాలు పూర్తి చేయడంలో బి ఎల్ ఓ లు సహకరిస్తారని చెప్పారు.

## చిన్నారులందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/యాచారం :** నులి పురుగుల నివారణ కార్యక్రమంలో చిన్నారులందరికీ మాత్రలు వేయాలని యాచారం మండల అభివృద్ధి అధికారి రాధారాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణిని పరిశీలించారు. ఈ సంధర్బంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని గ్రామాల్లోని అంగన్వాడి, అరోగ్య ఉప కేంద్రంలో మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అరోగ్య సిబ్బంది, అంగన్ వాడి కార్యకర్తలు, అశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.
సర్ ను విజయవంతం చేయాలి..

## చిట్యాల మేఘనకు చెక్కు అందజేత



**ప్రజాపక్షం/షాబాద్ :** షాబాద్‌లో కుటుంబసభ్యులు హత్యకు గురి అయి అనాధాగా మారిన చిట్యాల మేఘనకు ప్రభుత్వం తరపున రూ.10 లక్షల రూపాయాల ఎక్స్ గేషియా చెక్కును ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఛీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండ చూడాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

# 'క్యూర్' చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ

– రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీల ప్రతినిధులతో ఉన్నతాధికారుల సమావేశం

– మహిళల భద్రత, ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిపాదిత 'తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) (క్యూర్) చట్టం–2026'పై ప్రభుత్వం విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. అందులో భాగంగా మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌లతో కలిసి వివిధ రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీల (ఆర్‌డబ్ల్యూఎస్) ప్రతినిధులతో ఒక ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ క్యూర్ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశాలను, దాని విశిష్ట లక్షణాలను వివరించారు. సమగ్ర పట్టణ పరిపాలన, మెరుగైన పౌర సేవల లభ్యత, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ గవర్నెన్స్, లింగ సమానత్వం, పౌర కేంద్రిత పరిపాలనపై ఈ చట్టం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని తెలిపారు.

### సొసైటీల నుంచి వెల్లువెత్తిన సూచనలు

ప్రభుత్వం చేపట్టిన ఈ ముందస్తు సంప్రదింపుల ప్రక్రియను రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీల ప్రతినిధులు ముక్తకంఠంతో అభినందించారు. అనంతరం చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు పలు విలువైన సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పౌరుల భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు క్యూర్ చట్టం కింద ఏర్పాటయ్యే వివిధ కమిటీలలో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రతినిధులకు స్థానం కల్పించాలని కోరారు. పబ్లిక్ ప్లేగ్రౌండ్స్ (ఆట స్థలాలు)లో బాలికలు, మహిళల కోసం ప్రత్యేక గంటలను కేటాయించాలని ప్రతిపాదించారు. బహిరంగ ప్రదేశాలు, ప్రజా సౌకర్యాల కేంద్రాల్లో శానిటరీ ప్యాడ్ వెండింగ్ మెషీన్లు, వాటిని నిర్మూలించే ఇన్సినరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలోని పబ్లిక్ ప్రాంతాల్లో మెరుగైన లైటింగ్, సిసిటివి సర్వైలెన్స్, తగిన భద్రతా ఏర్పాట్ల ద్వారా మహిళల రక్షణను మరింత పెంపొందించాలని కోరారు.

**సానుకూలంగా స్పందించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి...** ఆర్‌డబ్ల్యూఎస్ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సానుకూలంగా స్పందించారు. ఈ సంప్రదింపుల ప్రక్రియలో వచ్చిన అన్ని నిర్మాణాత్మకమైన సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తుందని, చట్ట రూపకల్పనలో వీటికి తగిన ప్రాధాన్యత ఇచ్చేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో నగరంలోని పలు ప్రాంతాల సొసైటీల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల నియంత్రణకు సమన్వయమే కీలకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్‌నేరాలు, టెలికాం ఆధారిత ఆర్థిక మోసాలను సమర్థంగా అరికట్టేందుకు కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ (డిఓటి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం ఉన్నత స్థాయి భద్రతా సదస్సు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ సంస్థలు, చట్ట అమలు సంస్థలు, బ్యాంకులు, టెలికాం సేవల సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ మాట్లాడుతూ టెలికాం ఆధారిత సైబర్ మోసాలను అరికట్టడంలో 'ఆపరేషన్ ఆక్టోపస్–3.0' విజయవంతమైందని తెలిపారు. మారుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కోవాలంటే డిఓటి, పోలీసు శాఖ, బ్యాంకులు, టెలికాం సంస్థల మధ్య నిరంతర సమన్వయం అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు 'ఘోస్ట్ సిమ్ నెట్‌వర్క్స్' ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. సదస్సు అనంతరం టెలికాం డైరెక్టర్ జనరల్ ఆనంద్ ఖారే హైదరాబాద్‌లోని టిఓటి ఎపి ఎల్ఎస్ఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'నెట్‌వర్క్ సెక్యూరిటీ లాబొరేటరీ'ని ప్రారంభించారు.డిఓటి పరిధిలో దేశంలోనే తొలి ప్రయోగశాలగా రూపొందిన ఈ కేంద్రం సైబర్ ముప్పుల విశ్లేషణ, శిక్షణ, సాంకేతిక సామర్థ్యాల పెంపు కోసం ఉపయోగపడనుంది.



# ఓటరు నమోదు దరఖాస్తుకు ఆధార్ అడగొద్దు





హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆధార్ కార్డు ఇవ్వాలని ఒత్తిడి చేయవద్దని, భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) నిబంధనలను కచ్చితంగా పాటించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. ఓటరు నమోదు (ఎన్యూమరేషన్) ఫారంతో పాటు ఆధార్ కార్డు సహా మరే ఇతర పత్రాలను జతచేయాలని పౌరులను అడగకూడదని, వాటిని సేకరించకూడదని ఆయన స్పష్టం చేశారు. నగరంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026) కార్యక్రమం పురోగతిపై కర్ణన్ సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి అదనపు కమిషనర్(ఎన్నికలు) బి.సంతోష్, శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ హాజరయ్యారు. ఇంటింటి సర్వే, ఓటరు నమోదు ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియల స్టేటస్‌ను ఆయన ప్రతినిధులకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ ఏలు), రాజకీయ పార్టీల మధ్య సమన్వయం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఓటర్లలో అవగాహన కల్పించడం, బిఎల్‌ఓల అందుబాటు, ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ కేంద్రాల పనితీరుపై రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు అంశాలను లేవనెత్తారు. దీనిపై స్పందించిన జిల్లా ఎన్నికల అధికారి, పౌరులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలకు బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తక్షణమే స్పందించేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు టామ్‌టామ్, సాట్ ఆటోల ద్వారా ప్రచారం ముమ్మరం చేయాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్‌ఓలు), ఎఈఆర్‌ఓలను ఆదేశించారు. అలాగే, ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయ్యే వరకు బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన ఫీల్డ్ ఏరియాల్లోనే ప్రతి రోజు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రాజకీయపార్టీలతో జరిగే వారాంతపు సమావేశాల్లో అప్డేట్ చేసిన బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల జాబితాలతో పాటు, దరఖాస్తుల సేకరణ, డిజిటలైజేషన్ కేంద్రాల వివరాలను అందించాలని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఆయన పలు సూచనలను ఆహ్వానించారు. వారు లేవనెత్తిన సమస్యలన్నింటిని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సత్వరమే పరిష్కరిస్తామని డిఈఓ కర్ణన్ హామీ ఇచ్చారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మర్రి శశిధర్ రెడ్డి, పొన్న వెంకటరమణ(బిజెపి) మహ్మద్ వాజిద్ హుస్సేన్(కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రూ.2.96 కోట్ల విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం



**ప్రజాపక్ష/హైదరాబాద్:** హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు భారీ దెబ్బ కొట్టారు. కమిషనర్ టాస్క్‌ఫోర్స్, జూబ్లీహిల్స్ జోన్ బృందం, బోరబండ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో రూ.2.96 కోట్ల విలువైన 23.706 లీటర్ల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరు అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ఎర్రగడ్డ బస్టాప్ వద్ద బెంగళూరు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం మీడియా సమావేశంలో కమ కమిషనర్ విసి సజ్జనార్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన లసంగి యాకోబు అలియాస్ వెంకట్, యేంద్రపల్లి సూరిబాబు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి, హాష్ ఆయిల్ అక్రమ రవాణాలోకి దిగారు. ఒడిశా నుంచి తెప్పించిన హాష్ ఆయిల్‌ను ఆంధ్రప్రదేశ్‌లో స్వీకరించి, రైలు మార్గంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి అక్కడి నుంచి బెంగళూరులోని ఓ డ్రగ్ పెడ్లర్‌కు సరఫరా చేయాలని యత్నిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 23.706 లీటర్ల హాష్ ఆయిల్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మాదకద్రవ్యం విలువ సుమారు రూ.2.96 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.ప్రధాన నిందితుడు యాకోబుపై గతంలో గంజాయి రవాణా కేసుతో పాటు 2025లో బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసు కూడా ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2025, 2026లో పలుమార్లు బెంగళూరుకు హాష్ ఆయిల్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. డిసిపి గైక్వాడ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షణలో జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్, బోరబండ పోలీసుల సంయుక్త బృందం ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది.

## ఐఎన్‌టియుసి కృషితోనే జిఓ–88

ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, ఉద్యోగుల వ్యవస్థపై సమగ్ర ఆడిట్ నిర్వహించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జిఓ 88 జారీ చేయడం ఐఎన్‌టియుసి నిరంతర పోరాట కృషి ఫలితమని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజి రెడ్డి తెలిపారు. గత రెండు నెలలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించామని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పారదర్శకత, సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని కోరామని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. జిఓ 88 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పనితీరు, ఉద్యోగులకు ఈపిఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాల అమలు, డిబిటి ద్వారా వేతనాల చెల్లింపు, నకిలీ ఏజెన్సీల గుర్తింపు, ఉద్యోగుల పూర్తి డేటాబేస్ రూపకల్పన వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించనుండడం హర్షణీయమన్నారు. ఈ నిర్ణయం వల్ల ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల హక్కులకు మరింత భరోసా లభిస్తుందన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేయించాలి : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణిలో అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా అదనపు కల్లెక్టర్ డా. కిరణ్మాయి సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం వినోభానగర్ ప్రాంతంలో నల్ల కంచె తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలిక పాఠశాల్లో జాతీయ నులీపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అదనపు కల్లెక్టర్ డాక్టర్ కిరణ్మాయి విద్యార్థినులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డా.స్వర్ణకుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిని డా.షీబా, డిప్యూటీ డిఎంఎచ్ఒ సత్యరత్న పాల్గొన్నారు.

## 83.70కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.255.34కోట్లు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీఠ వేస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో హ్యామ్ విధానంలోమొత్తం ఆరు రహదారులు మంజూరు అయ్యాయని, వీటి పొడవు 83.70కిలో మీటర్లు ఉంటుందని, అంచనా వ్యయం రూ.255.34కోట్లుగా ఉందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికి అభివృద్ధి కార్యక్రమాలకు ఏమాత్రం వెనుకంజ వేయకుండా ముందుకు వెళ్తుందని వివరించారు. హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో భారీ ఎత్తున రహదారుల అభివృద్ధికి పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఈ పనులు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పనుల్లో కమిషన్ల సంస్కృతి నెలకొని ఉండేదని అన్నారు. పారదర్శకత, నాణ్యత, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు

# గడువులోగా సర్ ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

సి.నారాయణ రెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గడువులోగా ఎస్ఐఆర్ 2026 ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను జూలై 24 చివరి తేదీలోగా పూర్తి చేయడం జిల్లా యంత్రాంగం లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది, స్థానిక సంస్థల సిబ్బంది, ప్రత్యేక బృందాలను సమన్వయంతో వినియోగిస్తూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ పనులను వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ 2026 ప్రక్రియపై అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ఒరియెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వహించేలా అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి అర్హత గల ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం చేరేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఫారాలు పూర్తి వివరాలతో సేకరించి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ఓటర్లు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా జూలై 24లోగా తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సంబంధిత బూత్ లెవల్ అధికారులకు తప్పనిసరిగా అందజేసి ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.

# రైతుల సైకిల్ మోటార్ ర్యాలీ

### ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై నిరసనలు



**చండీగఢ్ :** ప్రతిపాదిత భారత్‌–అమెరికా వాణిజ్య ఒప్పందం, ఇతర సమస్యలపై నిరసన తెలుపుతూ భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు – రాజేవాల్) సోమవారం ఒక మోటార్‌సైకిల్ ర్యాలీని నిర్వహించింది. ఈ ఒప్పందంపై సంతకం చేస్తే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించింది. చండీగఢ్‌లో రైతుల నిరసన కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వ వాణిజ్య విధానాలు రైతులు, పాడి పరిశ్రమ ప్రయోజనాలను దెబ్బతీస్తూ బహుళజాతి కంపెనీలకు, ప్రపంచ వాణిజ్య ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్నాయని నిరసనకారులు ఆరోపించారు. అమెరికా రైతులు భారీగా ప్రభుత్వ మద్దతును పొందుతూ పెద్ద ఎత్తున సాగు చేస్తారని, దీనివల్ల తక్కువ భూమి కలిగిన భారతీయ రైతులకు పోటీని ఎదుర్కోవడం కష్టమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు భారతీయ మార్కెట్లలోకి భారీగా ప్రవేశించే అవకాశం ఉందని, తద్వారా రైతుల ఆదాయం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినవచ్చని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. 'అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంతకం చేస్తే, అదే రోజు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతాం' అని బికెయు (రాజేవాల్) అధినేత బల్బీర్ సింగ్ రాజేవాల్ అన్నారు. 'ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు, ఈనెల 17న పంజాబ్‌లోని అన్ని రోడ్లపై టోల్ వసూలును రెండు గంటల పాటు నిలిపివేసి ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తాం' అని ఆయన తెలిపారు. సోమవారం నాటి నిరసనపై మాట్లాడుతూ తమ సమస్యలలో కొన్ని కేంద్రానికి, మరికొన్ని రాష్ట్రానికి సంబంధించినవని రాజేవాల్ చెప్పారు. పంజాబ్‌లో అంతకంతకూ పడిపోతున్న భూగర్భ జలమట్టం, వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన దృష్ట్యా, చండీగఢ్ పోలీసులు సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరంలోని పలు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నిరసన సమయంలో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు. అంతకుముందు బికెయు (ఏక్తా ఉగ్రహన్), ఇతర రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెక్టార్ 34 నుండి మట్కా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వంటి అంశాలపై నిరసన తెలిపేందుకు, శుక్రవారం నాడు రైతు సంఘాలు ఇక్కడి నగర రహదారులపై పెద్ద సంఖ్యలో ట్రాక్టర్‌ట్రాలీలు, బస్సులు, జీపులు, ఇతర వాహనాలను నడిపాయి.

## భారత్-అమెరికా
# మౌలిక నిబంధనల ఒప్పందం రెడీ

- బిటిఎపై ముందుకు దూసుకెళుతున్న చర్చలు
- సరైన సమయంలో సంతకాలు చేస్తాం
- అమెరికా నుండి ఇంధన దిగుమతి పెరుగుతోంది, విభేదాలు లేవు
- న్యూఢిల్లీలో అధికారుల ప్రకటన





**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు సజావుగా సాగుతున్నాయని, సంబంధిత మౌలిక నిబంధనల ఒప్పందం (ఫ్రేమ్‌వర్క్ డీల్)సిద్ధంగా ఉందని, సరైన సమయంలో ఈ ఒప్పందంపై రెండు దేశాలూ సంతకాలు చేస్తాయని అధికారులు సోమవారం న్యూఢిల్లీలో చెప్పారు. అమెరికాతో వాణిజ్యం చేస్తున్న ఇతర దేశాలతో పోలిస్తే సుంకాల విషయంలో కొన్ని ప్రయోజనాలతో కూడిన తులనాత్మకమైన ఒప్పందాన్ని భారత్ కోరుకుంటున్నదని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.బిటిఎపై చర్చలు ముందుకు దూసుకుపోతున్నాయని చెప్పారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోందని, అమెరికా నుండి భారత్‌కు క్రమంగా ఇంధన దిగుమతులు పెరుగుతున్నాయని, అందువల్ల రెండు దేశాల మధ్యా ఎలాంటి విభేదాలు లేవని అధికారులు చెప్పారు. ఈ ఫ్రేమ్‌వర్క్‌కు అతీతంగా చర్చలు జరగడంలేదని, పరస్పర అవగాహనతో చర్చలు ముందుకు వెళుతున్నాయని చెప్పారు.
పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఆపద్ధర్మంగా రష్యా నుండి దిగుమతులకు అమెరికా అనుమతించింది. కొత్త ఒప్పందాల ప్రకారం భారత్ అధికభాగం ఇంధన దిగుమతులకోసం అమెరికావైపు మొగ్గుచూపుతుంది.
''అమెరికా వాణిజ్యబృందంతో చర్చలు మంచి వాతావరణంలో బాగా జరిగాయి. దీర్ఘకాలిక వాణిజ్య ఒప్పందానికి అవసరమైన మౌలిక నిబంధనల ఒప్పందం సిద్ధంగా ఉంది, సరైన సమయం వచ్చినప్పుడు ఈ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై సంతకాలు చేస్తాం,మేం రెండు ఒప్పందాల విషయంలో చర్చలు జరుపుతున్నాం, ఒకటి ఫ్రేమ్‌వర్క్ డీల్ కాగా, రెండవది ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ), ఈ రెండు విషయాలపైనా చర్చలు సజావుగా ముందుకు సాగుతున్నాయి'' అని అధికారి చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశకు సంబంధించి అపరిష్కృతంగా మిగిలిపోయిన చిన్న చిన్న సమస్యలపై కేంద్ర వాణిజ్యశాఖామంత్రి పీయూశ్ గోయల్,అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ మధ్య గతనెల న్యూఢిల్లీలో ద్వైపాక్షిక సంభాషణలు జరిగాయి. ''ఈ వాణిజ్య ఒప్పందాలన్నీ పూర్తిగా ఇరు దేశాలు పరస్పర మార్కెట్లలోకి ప్రవేశించే ప్రాధాన్యతలకు సంబంధించినవి లేదా పోటీతత్వంతో కూడిన, ఉభయులకు సమాన ప్రయోజనాలకు సంబంధించిన అంశాలే. అందువల్ల ఈ ఒప్పందానికి ఒక రూపం వస్తోంది, ఈ విషయంలో రెండు దేశాలమధ్యా పటిష్టమైన అవగాహన ఉంది, చర్చల సందర్భంగా ఉభయపక్షాలు గాడి తప్పకుండా మౌలిక నిబంధనల ఒప్పందంలో ఏముంది? ద్వైపాక్షిక ఒప్పందంపై ఎలాంటి చర్చలుజరుగుతున్నాయి? అనే స్పష్టతతో సురక్షితమైన పద్ధతులలో చర్చలు ముందుకు తీసుకువెళుతున్నాం, అందువల్ల అపోహలకు అవకాశం లేదు, చర్చలు ముందుకు దూసుకుపోతున్నాయి'' అని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పారు.

#### వాణిజ్య ఒప్పందంలో రైతుల ప్రయోజనాలు కాపాడతాం: గోయల్

భారత్–అమెరికావాణిజ్య ఒప్పందంపై వచ్చిన మీడియా నివేదికను కేంద్ర వాణిజ్యమంత్రి పీయూశ్ గోయల్ సోషల్ మీడియా పోస్టులో ఖండించారు. ఒప్పందం విషయంలో రెండు దేశాలమధ్యా సమతుల్యత ఉందని, భారతదేశ రైతులు,వ్యాపారులు,పారిశ్రామిక వేత్తలు,వినియోగదారుల ప్రయోజనాలకు అనుకూలమైన ఒప్పందం జరుగుతుందని, వారి ప్రయోజనాలు కాపాడతామని పీయూశ్ గోయల్ చెప్పారు. ఇరు దేశాల రైతులు,కార్మికులు,వ్యాపారులు,వినియోగదారుల ప్రయోజనాలు కాపాడేవిధంగా ఒక తులనాత్మకమైన ఒప్పందంపై సంతకాలు చేస్తామని చెప్పారు. దేశ వినియోగదారులు,రైతులకు స్పష్టమైన ప్రయోజనాలు అందించేదిశగా ఈ చర్చలు ముందుకు వెళుతున్నాయని పోస్టింగ్‌లో రాశారు. లక్ష్యాలను సాధించేందుకు, ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు రెండు వైపులా చర్చల బృందాలు ఒక అవగాహనతో కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు.

# మోదీది కప్పిపుచ్చే ధోరణి

- 'తాను అవినీతికి పాల్పడను, మరెవరినీ పాల్పడనివ్వను' హామీ పూర్తిగా బూటకం
- దేశంలో 'నేను తింటా, ఇతరులని తిననిస్తా, తినిపిస్తా' అన్నట్లుగా పాలన : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి వ్యతిరేక వైఖరిపై కాంగ్రెస్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ప్రధాని మోదీ హామీ 'నా ఖావూంగా, నా ఖానే దూంగా' (తాను అవినీతికి పాల్పడను, మరెవరినీ పాల్పడనివ్వను) పూర్తిగా బూటకమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. ప్రస్తుతం దేశంలో 'నేను తింటా, ఇతరులని తిననిస్తా, తినిపిస్తా' అన్నట్లుగా పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'కనీస పాలన, గరిష్ఠ కప్పిపుచ్చే ధోరణి' మాత్రమే కనిపించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మెరకు రమేశ్ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 2014లో అవినీతి నిర్మూలన పేరుతో మోదీ ఇచ్చిన హామీలు కొద్ది కాలానికే వాస్తవం కాదని తేలిపోయాయని విమర్శించారు. 2016లో జరిగిన పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ 'వ్యవస్థీకృత, చట్టబద్ధమైన దోపిడీ'గా అభివర్ణించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే కేంద్ర ప్రభుత్వ అవినీతి నిరోధక వైఖరి ఎంతవరకు నిజమో చెప్పిందని విమర్శించారు. గుజరాత్ మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన రూ.20వేల కోట్ల కుంభకోణాన్ని కప్పిపుచ్చడానికే ఆ రాష్ట్ర పెట్రోలియం కార్పొరేషన్‌ను ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్‌లో బలవంతంగా విలీనం చేశారని ఆరోపించారు. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా భారీ స్థాయిలో రాజకీయ నిధుల వ్యవహారం జరిగిందని విమర్శించారు. ఈ వ్యవస్థ పారదర్శకతను దెబ్బతీసిందని, దీనిపై దేశవ్యాప్తంగా అనేక సందేహాలు వ్యక్తమయ్యాయని పేర్కొంది. అలాగే రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై గతంలో లేవనెత్తిన ప్రశ్నలకు ఇప్పటికీ సంతృప్తికర సమాధానాలు రాలేదని జైరాం రమేశ్ అన్నారు. పిఎం కేర్స్ నిధి పూర్తిగా పారదర్శకత లేని విధంగా నిర్వహించబడుతోందని కాంగ్రెస్ నేత ఆరోపించారు. ప్రభుత్వ వ్యయాలపై పర్యవేక్షణ చేసే వ్యవస్థలు బలహీనపడ్డాయని, అయినప్పటికీ ఆయుష్మాన్ భారత్, పిఎం కౌశల్ వికాస్ యోజన వంటి పథకాల అమలులో అవకతవకలపై పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ పదవిలో కొనసాగుతున్న అంశాన్ని కూడా జైరాం రమేశ్ ప్రస్తావించారు. కుటుంబం సభ్యలకు లబ్ధి చేకూర్చేలా తీసుకున్న నిర్ణయాలపై విచారణ అవసరమని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అలాగే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు సంబంధించిన భూ లావాదేవీలపై వచ్చిన ఆరోపణలపైనా కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. ఢిల్లీ సిఎం రేఖా గుప్తా కుటుంబ సభ్యులు పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ పనితీరుపైనా కాంగ్రెస్ నేత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత దెబ్బతిన్నదని, విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై వస్తున్న విమర్శల నేపథ్యంలో కూడా ప్రధాని మోదీ ఆయనకు మద్దతు ఇవ్వడం సరైన విధానం కాదని జైరాం రమేశ్ అన్నారు.

### బద్రినాథ్ విరాళాల్లో అవకతవకలు
# బికెటిసి మాజీ ఉద్యోగి అరెస్టు



**డెహ్రాడూన్ :** బద్రీనాథ్ ఆలయం విరాళాల నిర్వహణలో అవకతవకలకు సంబంధించి ఆలయ కమిటీ మాజీ ఉద్యోగి ప్రమోద్ నౌటియాల్‌ను ఉత్తరాఖండ్ పోలీసులు అరెస్టు చేసినటు అధికారులు తెలిపారు. చమోలి పోలీసులు ఆదివారం రాత్రి నౌటియాల్‌ను ఆయన నివాసం వద్ద అరెస్టు చేసి బద్రీనాథ్‌కు తరలించారని, అక్కడ ప్రస్తుతం ఆయనను విచారిస్తున్నారని చమోలి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) సుర్జిత్ సింగ్ పన్వార్ చెప్పారు. బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బికెటిసి)లో నౌటియాల్ సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగి. ఆలయ కమిటీ అధికారి యుధ్వీర్ ఫర్స్వాన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈనెల 8న బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పన్వార్ పిటిఐకి తెలిపారు. ఆలయానికి సమర్పించిన కానుకలను నౌటియాల్ దుర్వినియోగం చేశారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ప్రాథమిక విచారణ, సిసిటివి ఫుటేజీలో నౌటియాల్ కొన్ని వస్తువులు, నగదును తీసుకువెళ్లినట్లు తేలిందని, ఈ ఆధారాల మేరకే ఆయనను అరెస్టు చేశామని ఎస్ఎస్‌పి పేర్కొన్నారు. బికెటిసి చైర్మన్‌కు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన నౌటియాల్‌పై మంగళవారం రాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విరాళాల నిర్వహణలో నౌటియాల్‌పై వచ్చిన అవకతవకల ఆరోపణలు ప్రాథమికంగా నిజమేనని బికెటిసికి చెందిన నలుగురు సభ్యుల విచారణ కమిటీ నిర్ధారించింది. కాగా, నౌటియాల్ అరెస్టు అధికారంలో ఉన్న బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. అరెస్టు అయిన ఉద్యోగిపై ఇతర వ్యక్తుల పేర్లను వెల్లడించకుండా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ బికెటిసి అధ్యక్షుడు గణేష్ గోడియాల్ ఈ విచారణపై సందేహాలు వ్యక్తం చేశారు. బికెటిసి అధ్యక్షుడిపై చర్యలు తీసుకుని, ఆయన్ని పదవి నుంచి తొలగించకపోతే ఈ విచారణను నమ్మలేమని గోడియాల్ అన్నారు. బద్రీనాథ్ ఆలయ కానుకల దుర్వినియోగం అనేది ఘోరమైన పాపమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర భట్ అన్నారు. ప్రభుత్వం ఎటువంటి నేరస్తులను కాపాడదని, దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. నౌటియాల్ అరెస్టు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. విరాళాల నిర్వహణలో అవకవతకల ఈ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఉత్తరాఖండ్ ప్రభుత్వం గత వారం ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి గర్వాల్ డివిజన్ కమిషనర్ అధ్యక్షత వహిస్తారు. కమిటీ తన పరిశీలనలు, సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది.

# అహంకారాల పోరుగా మార్చొద్దు

### విద్యార్థుల సమస్యలపై కేంద్రానికి సిజెపి సూచన
### సోనమ్ ప్రాణాలు పణంగా ఉన్నందున డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల్లో పదే పదే అవకతవకలపై ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని, విద్యాశాఖ మంత్రి ప్రధాన్ డిమాండ్ చేస్తూ సిజెపి చేపట్టిన నిరసనకు సంఘీభావంగా పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన ప్రాణాలను పణంగా పెట్టిన నిరవధి నిరాహారదీక్ష చేస్తున్నారు. జంతర్‌మంతర్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభమైనప్పటి నుండి ఆయన 8.2 కిలోల బరువు తగ్గారని, ఆయన రక్తంలో గ్లూకోజ్ స్థాయి 67 ఎంజి/డిఎల్‌కి పడిపోయిందని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) సోమవారం తెలిపింది. సోనమ్ ప్రాణాలు పణంగా ఉన్నందున నిరసనకారుల డిమాండ్లను పరిష్కరించాలని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వాంగ్‌చుక్ నిరవధిక దీక్ష 16వ రోజుకు చేరుకోవడంతో, ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. సిజెపి అందించిన ఆరోగ్య సమాచారం ప్రకారం, వాంగ్‌చుక్ రక్తపోటు 107/70 ఎంఎం హెచ్‌జిగా నమోదైంది. సిజెపి చేపట్టిన నిరసన సోమవారంతో 24వ రోజుకు చేరుకుంది. ఈ సమస్యను 'అహంకారాల పోరుగా మార్చవద్దని కేంద్రానికి విజ్ఞప్తి చేసిన సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే, నిరసనకారుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. తప్పును అంగీకరించడం బలహీనతకు సంకేతం కాదని, అది పరిణతికి, జవాబుదారీతనానికి, సరిదిద్దుకునే సంసిద్ధతకు చిహ్నమని, తాము కోరుతున్నది కేవలం జవాబుదారీతనాన్ని మాత్రమే అని దీప్కే ఎక్స్‌లో పేర్కొన్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి నేతృత్వంలోని ఆప్ ప్రతినిధి బృందం నిరసన స్థలాన్ని సందర్శించి, ఆందోళనకు తమ సంఘీభావాన్ని తెలిపినట్లు సిజెపి పేర్కొంది.
సిపిఐ(ఎం) ఎంపి అమ్రా రామ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లకు చెందిన సీనియర్ ఆ పార్టీ నాయకులు కూడా నిరసన స్థలాన్ని సందర్శించి, డిమాండ్లకు మద్దతు తెలిపారు.

# సోనమ్ దీక్షకు ఉద్ధవ్ థాక్రే మద్దతు

### నిరాహారదీక్ష విరమించాలని విజ్ఞప్తి

**ముంబయి :** ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహారదీక్షకు శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే సంఘీభావం ప్రకటించారు. రాజకీయ అనుబంధాలను పక్కనపెట్టి పార్టీలు ఈ ఆందోళనకు మద్దతు ఇవ్వాలని ఆయన అన్నారు. సోమవారం ముంబయిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ మాట్లాడుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ ఆందోళనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే, వాంగ్‌చుక్ ప్రాణం చాలా విలువైనదని పేర్కొంటూ, ఆయన తన నిరాహార దీక్షను విరమించుకోవాలన్నారు. పరీక్షల అక్రమాల ఆరోపణలపై న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన గత 24 రోజులుగా కొనసాగుతోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఈ ఏడాది మే నెలలో నీట్ పేపర్ లీక్ అయినప్పటి నుండి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం చెల్లించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. కాగా, ఏ రాజకీయ జెండా లేకుండా సిజెపి నిరసనకు పార్టీలు మద్దతు ఇవ్వాలని థాక్రే అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని కోరడంలో తప్పు లేదా తక్కువతనం ఏమీ లేదని సేన (యుబిటి) నాయకుడు అన్నారు. ఈనెల 20న న్యూఢిల్లీలో సిజెపి పార్లమెంట్ వైపు నిరసన ర్యాలీ చేపట్టినప్పుడు, ఆ ఉద్యమానికి మద్దతుగా మహారాష్ట్రలో సేన (యుబిటి) కూడా నిరసన కార్యక్రమాన్ని చేపడుతుందని ఆయన చెప్పారు. వర్షాకాల సమావేశాల్లో సేన ఎంపిలు ఈ అంశాన్ని లేవనెత్తుతారని థాక్రే తెలిపారు. ప్రభుత్వం ఈ నిరసన పట్ల పెద్దగా పట్టించుకుంటున్నట్లు కనిపించడం లేదని పేర్కొన్న ఆయన, దేశానికి వాంగ్‌చుక్ ప్రాణం ఎంతో విలువైనదన్నారు. ఆయన తన నిరాహార దీక్షను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాలను చోరీ చేశారన్న ఆరోపణలపై ఈ నెల ప్రారంభంలో తాను చేపట్టిన 'రామ్ రక్ష' నిరసన కార్యక్రమం కోసం, 18న నాగ్‌పూర్‌కు వెళ్లనున్నట్లు కూడా థాక్రే తెలిపారు.

# ఇసి గందరగోళం సృష్టిస్తున్న

### సర్ నిర్వహణ తీరుపై కాంగ్రెస్ ఫైర్

**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ (సర్) నిర్వహిస్తున్న తీరును కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. ఎన్నికల పర్యవేక్షక సంస్థ ఎవరినీ వదలకుండా గందరగోళాన్ని, సంపూర్ణ అరాచకాన్ని సృష్టించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ ఆర్.ఎస్. శర్మ రాసిన ఒక వ్యాసాన్ని ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు. పౌరసత్వాన్ని నిరూపించుకోమని ప్రజలను అడగడం ప్రభుత్వ వైఫల్యమని ఆ వ్యాసంలో ఆయన పేర్కొన్నారు. కాగా, 'సైన్స్, టెక్నాలజీ రంగంలో నేపథ్యం ఉన్న ఒక ప్రముఖ మాజీ సివిల్ సర్వెంట్ రాసిన శక్తివంతమైన, ధైర్యవంతమైన వ్యాసం ఇది అని రమేశ్ చెప్పారు. ఎన్నికల సంఘం బిజెపికి ఒక చేయిలా పని చేస్తోందని, ఓటర్ల జాబితాలను తారుమారు చేసి మెజారిటీని సృష్టించే మోదీషా వ్యూహంలో 'సర్' ఒక భాగమని కాంగ్రెస్ ఇది వరకే ఆరోపించింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎవరూ వ్యతిరేకించడం లేదని, అయితే ఎన్నికల సంఘం (ఇసి) ఈ మొత్తం ప్రక్రియను నిర్వహిస్తున్న, సమన్వయం చేస్తున్న, తారుమారు చేస్తున్న తీరునే వ్యతిరేకిస్తున్నారని రమేశ్ పేర్కొన్నారు. మరణించిన, నకిలీ, వేరే చోటికి మారిన, గైర్హాజరైన ఓటర్లతో పాటు విదేశీ జాతీయులను తొలగించడమే ఈ ఎన్నికల జాబితా సవరణ లక్ష్యమని ఇసి చెబుతూ వస్తోంది.

# రామాలయ సిఇఒకు నోటిఫికేషన్

**అయోధ్య :** ఉత్తరప్రదేశ్‌లో అయోధ్యలోని రామమందిరానికి సంబంధించి మొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) పదవికి దరఖాస్తులను 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' సోమవారం ఆహ్వానించింది. పేర్లను సమర్పించడానికి ఈనెల 18ని గడువు తేదీగా నిర్ణయించింది. ఆరోజున సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని ట్రస్ట్ తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో పేర్కొంది. ఆలయ విరాళాల చోరీ ఆరోపణల నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలన, ఆర్థిక నిర్వహణను బలోపేతం చేసే చర్యలలో భాగంగా ట్రస్ట్ ఈ పదవిని ప్రవేశపెట్టింది. ట్రస్ట్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, సిఇఒను మూడేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తారు. పని తీరు సంతృప్తికరంగా ఉంటే ఈ గడువును పొడిగించే అవకాశం ఉంటుంది. ఈ ఉద్యోగం అయోధ్యలో ఉంటుంది. జీతం, ఇతర సేవా ప్రయోజనాలను పరస్పర చర్చల ద్వారా నిర్ణయిస్తారని ట్రస్ట్ 'ఎక్స్'లో పంచుకున్న వివరాలు పేర్కొన్నాయి. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం బ్యాచిలర్ డిగ్రీ, 50 నుండి 70 ఏళ్ల మధ్య వయస్సు, ఏదైనా పెద్ద ప్రభుత్వ సంస్థ, ప్రభుత్వ శాఖ లేదా కంపెనీలో కనీసం 20 ఏళ్ల నిర్వహణ (మేనేజీరియల్) అనుభవం ఉండాలని ట్రస్ట్ అర్హతలను నిర్దేశించింది.
అభ్యర్థికి పరిపాలన, ఆర్థికం, అకౌంట్స్, మానవ వనరులు, ప్రజా సంబంధాలు, సమాచార సాంకేతికత (ఐటి), భద్రత, న్యాయపరమైన వ్యవహారాల వంటి విభాగాలను పర్యవేక్షించడంలో అనుభవం ఉండాలి. 'చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసిన వారికి లేదా ఆలయం లేదా హిందూ మతపరమైన సంస్థను నిర్వహించిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న పదవీ విరమణ చేసిన అధికారులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు' అని ట్రస్ట్ పేర్కొంది. అభ్యర్థులకు హిందీ, ఆంగ్ల భాషలపై కచ్చితంగా పని పరిజ్ఞానం ఉండాలని కూడా తెలిపింది.

### 'రామాలయం విరాళాల చోరీపై నివేదిక సమర్పించండి'
# సిట్‌కు సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ :** అయోధ్య రామాలయం విరాళాల చోరీపై దర్యాప్తు పురోగతి నివేదికను సమర్పించాలని సిట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. విరాళాల చోరీ వ్యవహారంపై తగిన వివరణ ఇవ్వాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. రామాలయంలో భక్తులు సమర్పించిన కానుకల చోరీ వ్యవహారంపై సిబిఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రామాలయ వ్యవహారాలను పర్యవేక్షించే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ నిర్వహించాలని ఓ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆలయ ట్రస్ట్ వ్యవహారాలు, పరిపాలనకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సిబిఐ నేతృత్వంలో దర్యాప్తు చేయాలని కోరారు. కోట్లాది మంది భక్తులు, దాతల విశ్వాసాన్ని నిలబెట్టడానికి అవసరమైన నియంత్రణ, పర్యవేక్షణ, ఆడిట్ యంత్రాంగాలను ఏర్పాటు చేసే విధంగా కేంద్రం, యుపి ప్రభుత్వం, ట్రస్ట్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో వివరించారు. ఎఫ్ఐఆర్ లేదా సాధారణ క్రిమినల్ కేసు కూడా నమోదు చేయకుండానే సిట్ ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించిందని పిటిషనర్లు ఆక్షేపించారు. ట్రస్ట్‌కు సంబంధించి నిధుల దుర్వినియోగం, ఇతర అవకతవకలకు సంబంధించిన నివేదికలు చివరికి నిజమని తేలినా, తేలకపోయినా, అవన్నీ అయోధ్య పూర్వ వైభవాన్ని పునరుద్ధరణకు పోరాడిన తరాల్లో తీవ్ర ఆందోళనను కలిగించాయన్నారు. ఇందులో ఉన్న అంశాలు కేవలం 'కాగ్నిజబుల్ (పోలీసులు స్వయంగా కేసు నమోదు చేసే) నేరాలకు సంబంధించినవి మాత్రమే కాదని, అసంఖ్యాక భక్తులు, ప్రజల విశ్వాసం, మనోభావాలు, నమ్మకాలపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని తెలిపారు.

**ట్రస్ట్ విరాళాలు, కానుకల పూర్తి వివరాలు ఇవ్వాలని పిటిషన్**

శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పడిన నాటి నుంచి స్వీకరించిన అన్ని విరాళాలు, కానుకల పూర్తి వివరాలను అందించేలా సుప్రీంకోర్టు ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ వివరాల్లో నగదు విరాళాలు, బ్యాంకు బదిలీలు, డిజిటల్ చెల్లింపులు, విదేశీ విరాళాలు, వస్తు రూపంలో విరాళాలు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులతో పాటు, వాటి అకౌంటింగ్, సంరక్షణ, వినియోగానికి సంబంధించిన వివరాలు కూడా చేర్చాలని తెలిపారు.

**సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామన్న సొలిసిటర్ జనరల్**

ఈ సందర్భంగా కేసు విచారణలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని కోర్టుకు వివరించారు. అయితే, ఆ నివేదిక ప్రతిని తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా, ఆ అభ్యర్థనకు వ్యతిరేకంగా మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, 'మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు' అని స్పష్టం చేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు జారీ చేసిన నోటీసులను మెహతా స్వీకరించారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 20కు వాయిదా వేసింది.

# హామీలు ఒకలా...వాస్తవం మరోలా!

### ఇథనాల్ కలిపినా పెట్రోల్ ధర ఎందుకు తగ్గలేదు? గడ్కరీ హామీలపై మళ్లీ ప్రశ్నలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వల్ల పెట్రోల్ ధర రూ.55 లకు, డీజిల్ రూ.50 లకు అందుబాటులోకి వస్తుంది' అని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ గతంలో చేసిన ప్రకటనలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమ విధానం (ఇ20) దేశవ్యాప్తంగాఅమలులోకి వచ్చినప్పటికీ, పెట్రోల్ ధరల్లో ప్రజలు ఆశించిన తగ్గుదల కనిపించకపోవడంతో కేంద్ర ప్రభుత్వ హామీలపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో 20 శాతం వరకు ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా అమలు చేసింది. ఈ చర్యతో ముడి చమురు దిగుమతులు తగ్గడంతో పాటు వినియోగదారులకు చౌక ధరలో ఇంధనం అందుతుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, వాస్తవంగా పెట్రోల్ ధరలు గణనీయంగా తగ్గకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు స్థిరంగా ఉన్న కాలంలోనే పెట్రోల్ ధరలు తగ్గుతాయని ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో పెట్రోల్ ధరలు ఇంకా రూ.100 పైగానే కొనసాగుతున్నాయి. దీంతో 'ధరలు తగ్గుతాయి' అన్న హామీ ఏమైందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇ20 ఇంధనం వాడుతున్న వాహనదారులలో కొందరు మైలేజీ తగ్గుతోందని, పాత మోడల్ వాహనాల్లో ఇంజిన్ పనితీరుపై ప్రభావం కనిపిస్తోందని, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ అంశాలపై వాహన తయారీ సంస్థలు, నిపుణుల అభిప్రాయాలు వేర్వేరుగా ఉన్నాయి. ఇ20కు అనుకూలంగా రూపొందించిన వాహనాల్లో సమస్యలు తక్కువగా ఉంటాయని, పాత వాహనాల్లో మాత్రం తయారీదారుల సూచనలను పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇథనాల్ విధానం వల్ల చమురు దిగుమతులు తగ్గడం, చెరకు రైతులకు ప్రయోజనం కలగడం వంటి సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, సామాన్య వినియోగదారుడు ఆశించినట్లుగా ఇంధన ధరలు తగ్గకపోవడం మాత్రం ప్రభుత్వంపై విమర్శలకు తావిస్తోంది. ఒకవైపు 'చౌక పెట్రోల్' హామీ, మరోవైపు యథాతథంగా కొనసాగుతున్న ధరలు' ఈ రెండింటి మధ్య ఉన్న అంతరంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## 'జురాసిక్‌పార్క్‌' సామ్‌ నీల్‌ హఠాన్మరణం



సిడ్నీ: 'జురాసిక్‌ పార్క్‌' చిత్రం ద్వారా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన న్యూజిలాండ్‌ నటుడు, వ్యాపారి సామ్‌ నెయిల్‌ (78) ఆకస్మికంగా మరణించారు. సిడ్నీలో ఆయన ఆకస్మికంగా మరణించినట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. సర్‌ నైజెల్‌ జాన్‌ డెర్మోట్‌ సామ్‌ నీల్‌ 1947 సెప్టెంబర్‌ 14వ తేదీన ఉత్తర ఐర్లాండ్‌ టైరోన్‌ కౌంటీ ఓమాగ్‌లో జన్మించారు. యూనివర్సిటీ స్థాయి నుండే నాటకరంగంలో స్టేజీ ఆర్టిస్టుగా షేక్స్‌పియర్‌ సృష్టించిన పాత్రలు పోషించి పేరు సంపాదించుకున్నారు. 1977లో మొదటిసారి సినీరంగ ప్రవేశం చేసి "స్లీపింగ్‌ డాగ్స్‌" చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. మై బ్రిలియంట్‌ కెరీర్‌ (1979) ద ఫైనల్‌ కాన్‌ఫ్లిక్ట్‌(1981),పోస్ట్‌ ఫోర్స్‌ జెడ్‌(1982),డెడ్‌కామ్‌(1989), డెత్‌ ఇన్‌ బ్రన్స్‌విక్‌(1990) సహా అనేక చిత్రాల్లో ఆయన ప్రసిద్ధి చెందారు. చివరకు 1993లో విడుదలైన "జురాసిక్‌ పార్క్‌" చిత్రంలో డాక్టర్‌ అలాన్‌ గ్రాంట్‌ పాత్రతో ఆయన అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతి సంపాదించారు. జురాసిక్‌ పార్క్‌–3(2001), జురాసిక్‌ పార్క్‌ డొమినియన్‌ (2022) చిత్రాల్లో కూడా ఆయన అదే అలన్‌గ్రాంట్‌ పాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించారు. సినిమాలకు అతీతంగా ఆయన అనేక టెలివిజన్‌ ధారావాహికల్లో కూడా నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. అనేక డాక్యుమెంటరీలు సమర్పించారు. వ్యాఖ్యాతగా ప్రసిద్ధి చెందారు. ది ట్యూడర్స్‌, క్రూసో, హ్యాపీటౌన్‌, అల్కాట్రాజ్‌ వంటి ధారావాహికలు ఆయనకు మరింత పేరు తెచ్చాయి.

## చైనా–రష్యా జలాంతర్గాముల
# ఉమ్మడి విన్యాసాలు అరుదైన ఘట్టం

బీజింగ్‌: చైనా–రష్యాలు సంయుక్తంగా నిర్వహించిన సైనిక విన్యాసాలు గడిచిన శనివారం ముగిసిన తర్వాత కూడా దీనిపై చర్చ కొనసాగుతోంది. ఈ రెండు దేశాల జలాంతర్గాములు ఉమ్మడిగా పసిఫిక్‌ ప్రాంతంలో విన్యాసాలలో పాల్గొన్నాయి. ఈ విధంగా రెండు దేశాలకు చెందిన జలాంతర్గాములు ఉమ్మడి విన్యాసాలు ప్రపంచంలోనే ఒక అరుదైన ఘట్టమని చైనా సైనిక వ్యవహారాల నిపుణుడు వాంగ్‌ యున్‌ఫే వ్యాఖ్యానించారు. ఈ ఘట్టం రెండు దేశాలమధ్య పరస్పర విశ్వాసానికి ఒక చిహ్నమని అన్నారు.ప్రపంచంలో ఇలా జలాంతర్గాములు కలిసి ఒకే చిత్రంలో కనిపించడం అరుదైన ఘట్టమన్నారు. సాధారణంగా ప్రతిదేశంలో జలాంతర్గాముల రహస్యంగా పనిచేస్తాయి. వాటి ధ్వని సంకేతాలను కూడా చాలా రహస్యంగా ఉంచుతారు. ఇప్పుడు ఇలా రష్యా–చైనా జలాంతర్గాములు కలిసిపనిచేయడంవల్ల వారి ధ్వనిసంకేతాలు రెండు దేశాలకు పరస్పరం సులభంగా తెలుస్తాయి. దీని అర్థం రెండు దేశాలమధ్య అత్యంత సన్నిహిత మైత్రిని తెలియజేస్తుంది. ప్రపంచంలోనే అత్యాధునికమైన టైప్‌ 039 జలాంతర్గామిని చైనా ప్రదర్శించడం దీనికి విశ్వసనీయతను పెంచిందన్నారు. గడచిన సోమవారం దక్షిణ పసిఫిక్‌ ప్రాంతంలో మొట్ట మొదటిసారి జలాంతర్గామి నుండి చైనా చేసిన అరుదైన ఖండాంతర అణు క్షిపణి పరీక్ష అమెరికా,బ్రిటన్‌ సహా నాటో వర్గ ప్రపంచదేశాల్లో కలకలం సృష్టించింది. చైనా భూభాగం నుండి బయలుదేరి దాదాపు 8000 కి.మీ పైగా దూరం ప్రయాణించేసి అమెరికా భూభాగాలలో లక్ష్యాలను ఛేదించగల ఖండాంతర అణుక్షిపణిని చైనా పరీక్షించడం మొట్టమొదటిసారి ఒక అరుదైన ఘట్టం కాగా, ఇది ఆధిపత్యవాదంతో హద్దులు లేకుండా ప్రవర్తిస్తున్న అమెరికాకు ఒక అతిపెద్ద హెచ్చరికగా భావిస్తున్నారు. భూమి,ఆకాశం,సముద్ర మార్గాల ద్వారా నిరాటంకంగా అణుక్షిపణులను ప్రయోగించగల సామర్థ్యాన్ని సంతరించుకున్న క్షిపణులను అమెరికాకంటే చైనా శరవేగంగా నిర్మిస్తోంది. ఈ విషయంలో చైనా ముందంజలో ఉంది. ఐతే ఈ చర్యను ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బెనీస్‌ సహా పలు దేశాలు తప్పుపట్టాయి.



## ప్రభుత్వం సన్నద్ధం
**(మొదటి పేజీ తరువాయి)**

అన్ని జిల్లాల అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌లో భారత వాతావరణ విభాగం, ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐఐఆర్‌, ఐసిఎఆర్‌, సిఆర్‌ఐడిఏ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి వ్యవసాయ యాజమాన్య చర్యను రైతులకు క్షేత్రస్థాయిలో చేరవేసి, వాటి అమలును జిల్లా అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి వర్షాభావ పరిస్థితులను పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున ఆయా జిల్లాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందుగానే సమీకరించుకోవాలని మంత్రి తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, నేల తేమ సంరక్షణ, నీటి పొదుపు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరించేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే 'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా ఎల్నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్‌, ఇక్రిశాట్‌ డిప్యూటీ డైరెక్టర్‌ జనరల్‌ స్టాన్‌ఫోర్డ్‌ బ్లేడ్‌, వ్యవసాయశాఖ డైరెక్టర్‌ గోపి, హార్టికల్చర్‌ డైరెక్టర్‌ యాస్మిన్‌ బాషా, కమిషనర్‌ కో ఆపరేషన్‌ రాహుల్‌ రాజ్‌, హాకా ఎండి చంద్రశేఖర్‌, గిడ్డంగుల శాఖ ఎండి లక్ష్మి, టిజిఎస్‌పిడిఎల్‌సి సిఎండి జితేష్‌ పాటిల్‌, అగ్రి, హార్టికల్చర్‌ యూనివర్సిటీల విసిలు జానయ్య, రాజిరెడ్డి, ఇక్రిశాట్‌ ప్రిన్సిపల్‌ సైంటిస్ట్‌ హరికిషన్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 17 నుండి 20 వరకూ
# షాంఘైలో ప్రపంచ ఎ.ఐ సదస్సు

షాంఘై: చైనా నగరం షాంఘైలో జులై 17వ తేదీ నుండి 20వ తేదీ వరకూ ప్రపంచస్థాయీ కృత్రిమ మేధ సదస్సు (డబ్ల్యుఎఐసి)జరుగుతుంది. దీంతో పాటు గ్లోబల్‌ ఎ.ఐ గవర్నెన్స్‌పై ఉన్నతస్థాయీ సమావేశం కూడా నిర్వహిస్తారు. ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ ముఖ్యఅతిథిగా హాజరై కీలక ప్రసంగం చేస్తారని చైనా విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలు సదస్సులలో చర్చలు, ఎ.ఐ తో ఎదురయ్యే సవాళ్ళు, దాని నియంత్రణ, పోటీలు, అవార్డులు, అప్లికేషన్‌ అనుభవాలు,నవీన ఆవిష్కరణలు, టాలెంట్‌, రిక్రూట్‌మెంట్‌ కార్యక్రమాలు ఈ మూడు రోజుల్లో నిర్వహిస్తారు. కృత్రిమ మేధను ముందుకు తీసుకువెళ్ళడంలో చైనా ప్రపంచంలో అమెరికాతో పోటీ పడుతూ ఆ దేశాన్ని సవాలు చేస్తోంది. ఇప్పటికే స్కూలు స్థాయి నుండి యూనివర్సిటీ వరకూ వందలకొద్దీ ఎ.ఐ కోర్సులను చైనా ప్రవేశపెట్టింది. ప్రపంచ కృత్రిమ మేధ సదస్సుకు షాంఘై ప్రధాన కేంద్రంగా విలసిల్లుతోంది. 2018లో మొదటిసారి ఈ నగరం కృత్రిమ మేధ ప్రపంచ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. గత ఏడాది జులై నెలలో కూడా ఎనిమిదవ డబ్ల్యుఎఐసి కి షాంఘై ఆతిథ్యం ఇవ్వగా 3.35 లక్షలమంది ఈ సదస్సును సందర్శించారు.

### 150 దేశాలకు చైనా రోబోల ఎగుమతి

ఈ ఏడాది మొదటి ఐదునెలల కాలంలో వివిధ కేటగిరీలకు చెందిన రోబోలను చైనా భారీ ఎత్తున 150 దేశాలకు ఎగుమతి చేసి రికార్డు సృష్టించింది. ఎక్కువగా యూరప్‌, ఆసియా దేశాలే ఈ ఎగుమతులకు గమ్యస్థానాలు. పారిశ్రామిక రంగాలకు ఉపయోగపడే 70,000 రోబోలను ఈ ఏడాది చైనా ఎగుమతి చేసింది. గత ఏడాది పారిశ్రామిక రోబోల ఎగుమతులు చైనా నుండి 48.7 శాతం పెరిగాయి. ఈ ఏడాదిలో 28 శాతం పెరిగాయి. గత ఏడాది చైనాలో 140కి పైగా పూర్తిస్థాయీ రోబో తయారీ సంస్థలు ఉండగా, 330 హ్యూమనాయిడ్‌ రోబో ఉత్పత్తులు విడుదలయ్యాయి. రోబో టెక్నాలజీతో జనవరి నుండి మే నెల వరకూ 10.377 మిలియన్ల రోబోలను అనేక దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా 2.98 మిలియన్‌ డాలర్లు లేదా 20 బిలియన్‌ యువాన్ల ఎగుమతులను సాధించింది. చాలా వైవిధ్యభరితమైన రోబోల ఎగుమతులు జరుగుతున్నాయి.క్లీనింగ్‌కు ప్రాధాన్యతనిచ్చే రోబోలనే యూరప్‌,ఆసియా దేశాలు అత్యధికంగా కొనుగోలు చేస్తున్నాయి. మొత్తంగా చూస్తే 14 బిలియన్‌ యువాన్లు విలువైన క్లీనింగ్‌ రోబోలను చైనా ఎగుమతి చేసింది.

## బ్యాంకాక్‌ పబ్‌లో అగ్నిప్రమాదం: 27 మంది మృతి

### 25 మంది పరిస్థితి సీరియస్‌



బ్యాంకాక్‌: బ్యాంకాక్‌లోని ప్రసిద్ధ చాటుచాక్‌ జిల్లాలోని పబ్‌లో ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 27 మంది మరణించారు. ఈ ఘటనలో మరో 73 మంది గాయపడ్డారు. వీరిలో 25 మంది చావుబ్రతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్నారు. మరణించినవారిలో తొమ్మిదిమంది పురుషులు,18 మంది మహిళలు ఉన్నారు. రోంగ్‌ బీర్‌ నాలాట్‌ ఫ్రావో బార్‌, పబ్‌లో ఈ ఘటన జరిగింది. పబ్‌లో మైమరపించే సంగీత కార్యక్రమాన్ని అందరూ ఎంజాయ్‌ చేస్తూ గాలిలో తేలిపోతున్న తరుణంలో వేదిక సమీపంలో ఆకస్మికంగా పేలుళ్ళు సంభవించాయి. ఆ తర్వాత పెద్ద పెద్ద మంటలు, దట్టమైన పొగ పబ్‌ లోపల గది మొత్తం ఆవరించుకుందని, చాలామంది తప్పించుకున్నారని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. మిగిలిన చాలా మంది బయటకు వెళ్ళలేక పబ్‌ వెనుకభాగంలో ఉన్న టాయిలెట్స్‌లోకి వెళ్ళి తలదాచుకున్నారు. కానీ వారంతా గాలి ఆడక ఉక్కిరిబిక్కిరై మరణించారు. అగ్నిమాపక బృందాలు తర్వాత ఎక్కువ మృతదేహాలను టాయిలెట్స్‌లోనుండే వెలికితీశాయి. లి ఆడక ఉక్కిరిబిక్కిరైపోవడంతో ఎక్కువమంది మరణించారు. ఈ ఘటనపట్ల థాయ్‌లాండ్‌ ప్రధానమంత్రి ఛర్న్‌విరాకుల్‌ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదస్థలాన్ని ఆయన సందర్శించారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలియజేశారు.ఎయిర్‌ కండిషనర్‌లో విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌ ఘటనకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనావేశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనలో కాలిన గాయాలతో గాయపడిన అనేక మందిని ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేస్తున్నట్లు పాత్రికేయులకు ఛర్న్‌విరాకుల్‌ చెప్పారు. పబ్‌లోకి శరవేగంగా దట్టమైన పొగ వ్యాపించిందని, ఎవరూ తప్పించుకోవడానికి వీ లు లేకుండా పూర్తిగా ఆ ప్రాంతాన్ని పొగ కమ్ముకుందని చెప్పారు. పైగా బార్‌లోపల ఇంటీరియర్‌ పైభాగం అంతా మంటలను ఎక్కువగా ఆకర్షించే పదార్థాలతోనే అలంకరించారని, ఇది కూడా మంటలు బాగా వ్యాపించడానికి కారణమయ్యాయని చెప్పారు. అగ్నిమాపకదళాలు ఇంకా ఆ ప్రాంతంలో పరిస్థితిని అదుపుచేసి మృతదేహాలకోసం గాలిస్తున్నాయి. 2022లో కూడా ఇదేవిధంగా థాయ్‌లాండ్‌ మ్యాజిక్‌ పబ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 14 మంది మరణించారు. అంతకుముందు 2009 జనవరి ఒకటో తేదీన కూడా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా థాయ్‌లాండ్‌ రాజధానిలోని సంతిక నైట్‌క్లబ్‌లో ఉత్సవాలు జరుగుతుండగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 66 మంది మరణించారు. 200 మందికి పైగా గాయపడ్డారు. ఆనాడు అక్కడ పబ్‌లో బాణసంచా పేలుడు కార్యక్రమం సందర్భంగా ప్రమాదం సంభవించింది.

## ఆత్మహత్య (మొదటి పేజీ తరువాయి)



ఇచ్చారని, దాంతోనే తమ పోలీస్‌ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నట్లు వెల్లడించారు. రాజ్‌కుమార్‌ నిందితుడిని పట్టుకునేందుకు తొమ్మిది బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టామని, ఎట్టకేలకు మేనమామ ఊరు పెంజర్ల గ్రామ సమీపంలోని ప్రైవేట్‌ వెంచర్‌ పక్కన వ్యవసాయ పోలంలో మృత దేహం లభిందని వివరించారు. మృతుడు రాజ్‌కుమార్‌ అన్నతోపాటు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని, వారు ఇక్కడికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతదేశానికి పంచనామ నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చెవేళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. మృతుడి వద్ద రూ.1260నగదు, ఒక సెల్‌ఫోన్‌ (ఫ్లైట్‌ మోడ్‌), ఒక బస్‌ టికెట్‌ లభించినట్ల కమీషనర్‌ తరుణ్‌ జోషి వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గడ్డిమందు ఎప్పుడు తాగాడు అనే కోణంలో సైతం దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. అంతేకాకుండా కోదాడ వద్ద ఉన్నట్లు సమాచారం వస్తే అక్కడికి తమ బృందం సభ్యులు వెళ్ళి తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఈ ఘటన స్థలానికి అదనపు పోలీస్‌ కమీషనర్‌ చందన దీప్తి, షాద్‌నగర్‌ డిసిపి శిరీష, చెవేళ్ళ డిసిపి యోగేష్‌ గౌతం, షాద్‌నగర్‌ ఏసిపి లక్ష్మి నారాయణ, కొత్తూరు సిఐ నర్సయ్యలు చేరుకొని పరిశీలించారు. ఘటన వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకొకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. శాంతిభద్రల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం

**(మొదటి పేజీ తరువాయి)**

జలాల విషయమై ఇటీవల కర్నాటకలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సిఆర్‌ పాటిల్‌ ఆధ్వర్యంలో ఏపి, కర్నాటక ముఖ్యమంత్రులతో చర్చించిన అంశాలను ఎంపీలకు సిఎం వివరించారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావాల్సి ఉన్నప్పటికీ పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్నాటక సహకరించేలా ఒప్పించాలని కేంద్ర మంత్రి సిఆర్‌ పాటిల్‌ను కోరామని, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలన్నారు.

నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విష యంలో ఛత్తీస్‌ఘడ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందన్నారు.గోదావరిలో ఛత్తీస్‌ఘడ్‌కు 300 టీఎంసీల వాటా ఉందని, వాటిని ఛత్తీస్‌ఘడ్‌ వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయని అన్నారు. అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందని సిఎం వివరించారు. గోదావరి నుంచి ఏపీ ప్రాంతం మీదుగా తమిళనాడు, కర్నాటక, కేరళకు నీరు తీసుకెళ్లే గోదావరికావేరి అనుసంధానం ఉందని, ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఇక్కడ నీళ్లు ఛత్తీస్‌ఘడ్‌వి అయితే, నిధులు మాత్రం కేంద్ర ప్రభుత్వానివని, ఆ రెండింటిని తెలంగాణకు అనుకూలంగా సాధించాలన్నారు.

**ఏపీ ప్రభుత్వం ఎన్‌ఒసి ఇవ్వాల్సి ఉంది..**

ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రాలు (ఎన్వోసీ) ఇవ్వాల్సి ఉందని సిఎం రేవంత్‌ రెడ్డి వివరించారు. ఈ విషయంపైనా కేంద్ర మంత్రి సీఆర్‌ పాటిల్‌, ఏపీ ముఖ్యమంత్రితో చర్చించామని, వారు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఎన్వోసీలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని సిఎం అన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సిఎం అన్నారు.

### కొలిక్కికొచ్చిన బుల్లెట్‌ రైళ్లు ..

శంషాబాద్‌ ఎయిర్‌పోర్ట్‌ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్‌ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు ఒక కొలిక్కివచ్చాయని సిఎం రేవంత్‌ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌ ఢిఫెన్స్‌ ఎయిర్‌పోర్ట్‌, వరంగల్‌ ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామన్నారు. ఈ ఎయిర్‌పోర్ట్‌లో ఎంఆర్వో (మెయింటెనెన్స్‌, రిపేర్స్‌, ఓవర్‌ హాలింగ్‌), ఎయిర్‌ కార్గోలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామని,ఈవిషయంపైనా ఎంపీలు దృష్టిసారించాలన్నారు.

### ఢిల్లీ తెలంగాణ భవన్‌ నుంచి కో ఆర్డినేషన్‌

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సహకరిస్తున్నామని సిఎం రేవంత్‌ రెడ్డి తెలిపారు. పార్టీలకు అతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందించేందుకు ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్‌ కు ఒక ఐఏఎస్‌ అధికారి అద్వైత్‌ కుమార్‌ సింగ్‌ను నియమించామన్నారు. పెండింగ్‌ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఎంపీలు ఆయన దగ్గర నుంచి తీసుకోవచ్చని సూచించారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎంపీలు అడిగే సమాచారం వేగంగా వారికి అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అన్ని రాజకీయ పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీల కన్వీనర్‌ డాక్టర్‌ మల్లు రవికి ఆయన సూచించారు.

**సమాఖ్యస్ఫూర్తికి అనుగుణంగానే సహకార ధోరణి: భట్టి విక్రమార్క**

ఎంపీలు అడిగిన ప్రతి సమాచారాన్నీ అందజేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా తాము కేంద్ర ప్రభుత్వంతో సహకార ధోరణితోనే ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రానికి చెందిన వివిధ అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి గతంలో పంపిన లేఖలు, ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ లేఖలు సిద్ధం చేసి పార్లమెంట్‌ సమావేశాల సమయంలో ఎంపీలకు అందుబాటులో ఉంచాలని అధికారులను భట్టి విక్రమార్క ఆదేశించారు.

### 8 నెలల్లో 'గద్వాల' ఆయిల్‌ మిల్లు పునరుద్ధరణ..

కాగా గద్వాల వద్ద మూతపడిన ఆయిల్‌ మిల్లు పునరుద్ధరణపై ఎంపీ డాక్టర్‌ మల్లు రవి అడిగిన ప్రశ్నకు అధికారులు స్పందిస్తూ 78 నెలల్లో పునరుద్ధరణ పూర్తవుతుందని సమాధానమిచ్చారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటు చేయాలని ఎంపి చామల కిరణ్‌ కుమార్‌ రెడ్డి కోరారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్‌ కమిటీ, కన్సల్టెన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారని, ఆ సమాచారం తీసుకొని ఆయా అంశాలకు సంబంధించిన పెండింగ్‌ విషయాలు తెలియజేస్తే సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు.

**రాష్ట్రంలో స్టోరేజీ సమస్య: ఈటల రాజేందర్‌**

రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్‌ సామర్థ్యం లేదని, స్టోరేజీ సమస్య ఉందని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. ఈ అంశంపైన ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రొటోకాల్‌ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### 'కాళేశ్వరం, పాలమూరు'లోపాలు..

నిపుణులతో కమిటీ వేయండి కొండా విశ్వేశ్వర్‌ రెడ్డి....

కాళేశ్వరం,పాలమూరురంగారెడ్డి డిజైన్లలోనే లోపాలు ఉన్నాయని.ఈ అంశంపైన నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రఘువీర్‌ రెడ్డి, అనిల్‌ కుమార్‌ యాదవ్‌, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌ జాజు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వాధీన పర్చుకుంటాం
**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్న షేక్‌ ఇసా ఎయిర్‌బేస్‌లతోపాటు ఒమన్‌లో ఉన్న రాడార్‌ వ్యవస్థలపైన అమెరికా మౌలిక సదుపాయాలపైన కూడా భీకరస్థాయిలో క్షిపణి,డ్రోన్‌ దా డులు చేశామని ఇరాన్‌ ఐఆర్‌జిసి ప్రకటించగా, ఇరా న్‌ ప్రయోగించిన నాలుగు క్షిపణులను కూల్చివేశామ ని ఇంకో వైపు జోర్డాన్‌ ప్రభుత్వం చెప్పింది. అమెరికా సెంట్‌కామ్‌ కూడా ఇరాన్‌ తీరాలపైన, టెహ్రాన్‌ సహా ఇతర నగరాలపైన దాడులు కొనసాగించింది. ఇరాన్‌లోని బందర్‌ అబ్బాస్‌లో కూడా క్షిపణి దాడులతో వ రుస పేలుళ్ళు సంభవించాయి. ఇరాన్‌లోని డజన్లకొ ద్దీ లక్ష్యాలపై దాడులు చేసినట్లు సెంట్‌కామ్‌ ప్రకటించింది. కువైట్‌లోని హిమ్రాస్‌పై దాడిచేశామని ఐఆర్‌జిసి ప్రకటించగా అలాంటి దాడులు జరగలేదని అ మెరికా, కువైట్‌ ఖండించాయి. యుద్ధాన్ని ఇదేవిధం గా ప్రజ్వరిల్లింపజేస్తే పశ్చిమాసియాలో అన్ని దేశాలకూ పూర్తిస్థాయిలో యుద్ధం విస్తరిస్తుందని,ఈ పర్యవసానాలకు అమెరికా,దాని మిత్రదేశాలే బాధ్యత వ హించాలని ఇరాన్‌ ఉన్నతస్థాయీ జాయింట్‌ మిలిట రీ కమాండ్‌ హెచ్చరించింది. పశ్చిమాసియాలో, హో ర్ముజ్‌ జలసంధిలో అమెరికా జోక్యం పూర్తిగా ముగిసిపోయేవరకూ జలసంధిని తెరిచే ప్రశ్నేలేదని ఇరాన్‌ నాయకత్వం ఖరాఖండీగా ప్రకటించిన నేపథ్యంలో జలసంధిని తామే స్వాధీనం చేసుకుంటామని ట్రంప్‌ సోమవారం ప్రకటించారు. వాణిజ్య నౌకల స్వేచ్ఛా రవాణా తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. హోర్ముజ్‌ జలసంధి తమ ప్రాదేశిక జలాలలో ఉందని, దీనిపై సర్వహక్కులూ తమకే ఉంటాయని, ఈ జలసంధి తమ నియంత్రణలోనే ఉంటుందని ఇరాన్‌ స్పష్టం చేసింది. డజన్లకొద్దీ అణుబాంబుల కంటే హోర్ముజ్‌ జలసంధే ఇరాన్‌కు ఎంతో ముఖ్యమైనదని,దానిని కాపాడుకుంటామని ఆ దేశ సర్వాధినేత మొజ్తాబా ఖమేనీ సలహాదారుడు మొహ్సెన్‌ రెజాయీ ఉద్ఘాటన,హోర్ముజ్‌ జలసంధిని మూసివేశామని ఐఆర్‌జిసి ప్రకటనలను అమెరికా తిరస్కరించడం,వాణిజ్య నౌకల రాకపోకలకు జలసంధి తెరచే ఉంటుందని సెంట్‌కామ్‌ ప్రకటన తర్వాత హోర్ముజ్‌ను తామే స్వాధీనం చేసుకుంటామని ట్రంప్‌ తాజా ప్రకటనల వాగ్యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి. శాంతి సాధన ఎండమావిగా మారింది. ఇప్పటిలో ఈ సమస్యకు ఒక సత్వర పరిష్కారం లభిస్తుందన్న ఆశలు కూడా ఆవిరయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.కాగా, బ్రిటన్‌ ప్రభుత్వం ఇరాన్‌ ఐఆర్‌జిసిని ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

### ఉద్రిక్తతలు తగ్గించేందుకు మధ్యవర్తులతో చర్చలు: ఇరాన్‌

టెహ్రాన్‌: హోర్ముజ్‌ జలసంధిలో నాలుగురోజులుగా కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తులతో చర్చలు కొనసాగిస్తున్నట్లు ఇరాన్‌ విదేశీవ్యవహారాలమంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్‌ బఖాయీ సోమవారం చెప్పారు.యుద్ధం ముగించేందుకు, పశ్చిమాసియాలో శాశ్వత శాంతి సాధించేందుకు వీలుగా చేసుకున్న ఇస్లామాబాద్‌ ఎంఓయు ఒప్పందాన్ని నిలబెట్టుకోవడంలో అమెరికా విఫలమైతే తాము కూడా ఒప్పందానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఉద్రిక్తతలు పెరగకుండా నివారించడమే మధ్యవర్తుల ప్రధానపాత్రగా ఆయన పేర్కొంటూ ఈ విషయంలో పాకిస్థాన్‌,ఖతార్‌,ఒమన్‌ మధ్యవర్తి దేశాలతో తాము సంభాషణలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఎదుటిపక్షం తన బాధ్యతలు నిలబెట్టుకోలేకపోతే, దాడులు చేస్తే మేం కూడా ఎంఓయు పట్ల మా కున్న బాధ్యతలను వదిలిపెడతాం,వారు అలా ప్రవర్తించిన ప్రతిసారీ మేం కూడా అదేపద్ధతిలో ప్రతిస్పందించాం అని టెహ్రాన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బఖాయీ చెప్పారు.

## 43.94% అర్హత
**(మొదటి పేజీ తరువాయి)**

మంది పరీక్షకు హాజరయ్యారు. 50,544 మంది అర్హత సాధించారు. ఇందులో ఇన్‌ సర్వీస్‌ టీచర్లు 8809(37.29 శాతం) మంది ఉన్నారు. ఈ మేరకు 'టెట్‌' ఫలితాలను హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాల విద్యా శాఖ సంచాలకులు డాక్టర్‌ ఇ. నవీన్‌ నికోలాస్‌ సోమవారం విడుదల చేశారు.

పేపర్‌ 1లో 36,129 పరీక్షకు హాజరవ్వగా 23590 అర్హత సాధించారు. ఇందులో 8122 మంది పురుషులు, 15466 మహిళలు, ట్రాన్స్‌జెండర్‌ ఇద్దరు ఉన్నారు. పేపర్‌ 2 (మ్యాథ్స్‌)లో 44128 పరీక్షకు హాజరవ్వగా, 17,987 మంది అర్హత సాధించారు. ఇందులో పురుషులు 5488, మహిళలు 12495 మంది, పేపర్‌2(సోషల్‌) లో 34,771 పరీక్షకు హాజరవ్వగా, 8967 మంది అర్హత సాధించారు. ఇందులో పురుషులు 3958 ,మహిళలు 5009 మంది అర్హత సాధించారు.టెట్‌ పరీక్షను జూన్‌ 16 నుంచి 22వ తేదీ వరకు పదిసెషన్లలో కంప్యూటర్‌ ఆధారిత పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో టెట్‌ కన్వీనర్‌ జి. రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

### 21న 'ఇన్‌ సర్వీస్‌ ఉపాధ్యాయ'టెట్‌ నోటిఫికేషన్‌..

రాష్ట్రంలోని ఇన్‌సర్వీస్‌ ఉపాధ్యాయులకు ఈ నెల 21న 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' (టిజి టెట్‌) నోటిఫికేషన్‌ విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు డాక్టర్‌ ఇ. నవీన్‌ నికోలాస్‌ వెల్లడించారు.సెప్టెంబర్‌ 7 నుంచి 11వ తేదీ మధ్య పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఇన్‌ సర్వీస్‌ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఈనెల 21న ప్రత్యేక టెట్‌ నోటిఫికేషన్‌ విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈనెల 21న నోటిఫికేషన జారీ చేయనుంది. సెప్టెంబర్‌ 7వ తేదీ నుంచి 11వ వరకు ఇన్‌సర్వీస్‌ ఉపాధ్యాయులకు టెట్‌ పరీక్షలు నిర్వహించానున్నారు. రాష్ట్రంలో టెట్‌ అర్హత పొందని వారు సుమారు మరో 20వేల మంది ఉన్నారన్నారు. రాష్ట్రంలోని కెజిబివిలో 20వేల మందికి ఒక జత యూనిఫామ్‌ను శుక్రవారం అందజేయనున్నామని, ప్రభుత్వ , స్థానిక సంస్థల పాఠశాలలో విద్యార్థులకు ఇప్పటికే బుక్స్‌ను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలోనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేసుకోవాలని ఇది వరకే తాము ఆదేశాలు జారీచేశామని, ఆయా జిల్లాలో స్థానిక పరిస్థితుల ఆధారంగా సర్దుబాటు చేసుకోవాలని ఇది నిరంతర పక్రియ అని అన్నారు. 17 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ చొప్పున జిఓ 25 ప్రకారం ఉపాధ్యాయుల బదిలీలు ఉంటాయని ఆయన తెలిపారు.

### 20వేల మంది ఇన్‌సర్వీస్‌ ఉపాధ్యాయలకు 'ప్రత్యేక టెట్‌'

ఇన్‌ సర్వీస్‌ ఉపాధ్యాయుల 'టెట్‌' ప్రస్తుతానికి రెండు సార్లు నిర్వహించనున్నారు. ఆ తర్వాత అప్పటికీ టెట్‌ అర్హత పొందనివారు ఉంటారా? అనే అంశం ఆధారంగా ప్రత్యేక టెట్‌ నిర్వహించాలా? వద్దా అనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం అధికారుల లెక్కల ప్రకారం 20వేల మంది ఉన్నారు. వీరికి మరో రెండుసార్లు ప్రత్యేక టెట్‌ నిర్వహిస్తే దాదాపు అర్హత పొందే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

## విప్లవం రావాల్సిందే
**(మొదటి పేజీ తరువాయి)**

నెలకొని ఉన్న నేపథ్యంలో, మోదీ ప్రభుత్వం, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ జవాబుదారీతనం నుండి ముఖం తిప్పుకుని మౌనం వహించారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. 'అవినీతి, అన్యాయం, పక్షపాతం, నిజాయితీ లేకపోవడం – ఈ నాలుగు పదాలు నావి కావు, భారతదేశ విద్యా వ్యవస్థకు ఈ రోజు దేశ విద్యార్థులు వాడుతున్న ప దాలు ఇవి. నిజం ఏమిటంటే – భారతదేశ విద్యా వ్య వస్థ ఇప్పుడు ఒక అవినీతిపూరిత దోపిడీ యంత్రాంగంగా మారింది' అని రాహుల్‌ సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. పిల్లలను వారి భవిష్యత్తుకు సిద్ధం చేయడానికి ఉద్దేశించిన వ్యవస్థ, నేడు వారిని, వారి కుటుంబాలను అప్పులు, ఒత్తిడి, నిరాశలోకి నెడుతోందని మాజీ కాంగ్రెస్‌ అధినేత ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈ అవినీతే పేపర్‌ లీక్‌ మాఫియాకు జన్మనిచ్చింది. ఇది లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల తరబ డి పడిన కష్టాన్ని ఒక్క దెబ్బతో దోచుకుంటుంది. ఇక్క డ, దోషులైన విక్రేతలు, అధికారులు టెండర్లు, పదోన్నతులు పొందుతారు. మరి శిక్ష ఎవరికి పడుతుం ది? చెదిరిన కలలతో ఒంటరిగా మిగిలిపోయిన వి ద్యార్థులకు' అని రాహుల్‌ గాంధీ అన్నారు. మోదీ ప్ర భుత్వం, విద్యా శాఖ మంత్రి ఇదంతా చూస్తున్నారు, కానీ వారు జవాబుదారీతనం నుండి ముఖం తిప్పుకుంటూ మౌనాన్ని ఎంచుకున్నారన్నారు. మరి మీడి యా? కేవలం సుదీర్ఘ నిశ్శబ్దం వహిస్తుందని, ఇక చా లు – విద్యారంగంలో విప్లవం రావాల్సిన తరుణమిది అని అన్నారు. 'ఛత్రోన్‌ కీ గూంజ్‌'ను మరింత విస్తృ తం చేయడానికి ఈనెల 17న డెహ్రాడూన్‌లో తనతో చేరాలని ఆయన విద్యార్థులను కోరారు. జూన్‌ 17న రాజస్థాన్‌లోని కోటాలో జరిగిన మొదటి 'ఛత్రోన్‌ కీ గూంజ్‌' ర్యాలీలో గాంధీ ప్రసంగించారు. ఆయన ఇతర నగరాల్లో కూడా ఇలాంటి ర్యాలీలలో ప్రసంగించనున్నారు. కోటా కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, భారతదేశ విద్యా వ్యవస్థ ఒక ఎంపిక ప్రక్రియ కాదని, అది ఒక 'తిరస్కరణ వ్యవస్థ' అని అభివర్ణించారు. ఇది విద్యార్థులు, మధ్యతరగతి కు టుంబాలపై అధిక ఆర్థిక భారం, ఒత్తిడిని మోపుతుందని ఆయన ఆరోపించారు.

## నీళ్లు తీసుకెళ్లలేం
**(మొదటి పేజీ తరువాయి)**

కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డిఎస్‌ఎ టెస్టింగ్‌ ప్రాసెస్‌ దాదాపు పూర్తి కావచ్చిందన్న మంత్రి మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి పునరుద్ధరించేందుకు ఐఐటి బాంబే సంస్థల ద్వారా రీ డిజైన్‌ చేస్తున్నామన్నారు. వచ్చే వేసవి కాలం నాటికి పనులు పూర్తి చేసి బ్యారేజీలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. సాంకేతికంగా కన్నెపల్లి బ్యారేజీ నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీళ్లు తీసుకెళ్లే అవకాశమే లేదని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టులోని 10 పంపుల్లో ప్రస్తుతం 7 పనిచేస్తున్నాయని, మిగిలిన పంపులను ఒకటి, రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి రూ.194 కోట్ల పెండింగ్‌ బిల్లులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. 22 రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపి కొత్త, స్థిరీకరణ ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రాజెక్టు పనుల పూర్తికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అంతకుముందు మంత్రులకు జిల్లా కలెక్టర్‌ బోర్కడే హేమంత్‌ సహదేవరావు, జిల్లా ఎస్‌పి సుధీర్‌ రామనాథ్‌ కేకన్‌, ఐటిడిఏ పిఓ లెనిన్‌ వస్తల్‌ టొప్పో తదితరులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వర్థన్నపేట ఎంఎల్‌ఏ కెఆర్‌ నాగరాజు, పాలకుర్తి ఎంఎల్‌ఏ యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సిహెచ్‌ మహేందర్‌ జి, సంపత్‌రావు, ములుగు మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్‌ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ పుట్టింట్లో గెలిచిన అమ్మాయిలు

లార్డ్స్ టెస్టులో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. నాలుగో రోజు తొలి సెషన్లోనే ఇంగ్లండ్ మిడిలార్డర్‌ను పడగొట్టి చరిత్రాత్మక విజయంతో సంబురాలు చేసుకున్నారు. టి-20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరిపించేలా.. 270 పరుగుల తేడాతో గెలుపొంది యావత్ భారతావనిని పులకింపజేశారు. తొలిఇన్నింగ్స్‌లోనే ఇంగ్లండ్ పాలిట విలన్లుగా మారిన పేసర్ క్రాంతిగౌడ్(2-54) రెండో ఇన్నింగ్స్‌లోనూ నిప్పులు చెరగడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. యస్తికా భాటియా(113) రికార్డు శతకం.. స్మృతి మంధాన(70)ల బ్యాటింగ్ మెరుపులతో కుదేలైన ఇంగ్లండ్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇంగ్లండ్ గడ్డపై భారత పురుషుల జట్టుకు చెంపపెట్టులాంటి విజయం సాధించారు అమ్మాయిలు. పేలవమైన ఆటతో టి-20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రేయాస్ అయ్యర్ సేనకు.. ఇంగ్లండ్‌ను ఇలా ఓడించాలి అని చాటిచెప్పింది



**6 పరుగులకే 2 వికెట్లు...** టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాక.. బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 6 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. 457 పరుగుల భారీ ఛేదనలో క్రాంతి గౌడ్(2-54).. సయాలీ సత్ఘరే(2-24)ల ధాటికి ఆతిథ్య జట్టు చేతులెత్తేసింది. ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న టమ్మీ బ్యూమంట్(0), హీథర్ నైట్ (13)లను ఔట్ చేసిన క్రాంతి విజయానికి పునాది వేసింది. మూడో రోజు పోరాడిన అమీ జోన్స్.. నాలుగోరోజు తొలి సెషన్లోనే ఔటవ్వగా.. టీమిండియా విజయం సులువైంది. ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ చూస్తుండగానే కుప్పకూలింది. తొలి సెషన్ మొదట్లోనే అమీ జోన్స్(54) వికెట్ తీసిన స్నేహ్ రాణా (4-42) ఆతిథ్య జట్టు ఓటమిని ఖాయం చేసింది. సోఫీ ఎకిల్స్టోన్(50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 22 రన్స్ జోడించిన ఇసీ వాంగ్(1)ను దీప్తి శర్మ బౌల్ చేసింది. తర్వాతి ఓవర్లోనే లారెన్ బెల్(0)ను దీప్తి బౌల్ చేయగా.. క్రీజునంటుకున్న ఎకిల్స్టోన్ను రాణా ఔట్ చేసి విజయంలో భాగమైంది.

**క్రాంతి గౌడ్ 5-37...** లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారతజట్టు పేసర్ క్రాంతి గౌడ్ (5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియాబౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే (9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్లో సయాలీ సత్ఘరే(2-40), స్నేహ్ రాణా (2-41) రెచ్చిపోగా లంచ్‌లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధశతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది.

# టిజి-ఇ20 విజేత హైదరాబాద్

మూడు వారాలుగా తెలుగు రాష్ట్రాల అభిమానులను అలరించిన అరంగేట్ర టిజి-20 లీగ్‌లో తొలి సీజన్ విజేతగా హైదరాబాద్ ఇ-చాంపియన్స్ నిలిచింది. ఆదివారం రాత్రి ఉప్పల్ వేదికగా జరిగిన ఏకపక్ష పోరులో హైదరాబాద్.. 6 వికెట్ల తేడాతో ఖమ్మం ఏసెస్ను ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. సీజన్ ఆసాంతం నిలకడగా రాణించిన హైదరాబాద్.. క్వాలిఫయర్1లో తమకు ఎదురైన పరాభవానికి ఫైనల్లో బదులు తీర్చుకుంది. మొదట హైదరాబాద్ బౌలర్లు కట్టడి చేయడంతో ఖమ్మం 20 ఓవర్లకు 157/8కే పరిమితమైంది. మికిల్ జైస్వాల్ (39 బంతుల్లో 65, 4 ఫోర్లు, 4 సిక్సులు) టాప్ స్కోరర్. యశ్వీర్ (3/17) మూడు వికెట్లతో చెలరేగగా దేవ్ మెహతా, అజయ్ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం ఛేదనలో కెప్టెన్ అభిరథ్ రెడ్డి (30 బంతుల్లో 48, 6 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులకు తోడు వైష్ణవ్ (41 నాటౌట్),



షణ్ముఖ (36) రాణించి హైదరాబాద్‌కు ఘనవిజయాన్ని అందించారు. ఫైనల్లో మూడు వికెట్లు తీసి హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించిన యశ్వీర్కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా సీజన్లో 10 మ్యాచ్‌లాడి 541 పరుగులు చేసిన సారథి అభిరథకు ఆరెంజ్ క్యాప్‌తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' వరించింది. అజయ్‌దేవ్ (21 వికెట్లు) పర్పుల్ క్యాప్ దక్కించుకున్నాడు. ఫైనల్‌కు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. టైటిల్ పోరును ప్రత్యక్షంగా చూసేందుకు ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్ స్థాయిలో సుమారు 33 వేల మంది ప్రేక్షకులు హాజరవడం విశేషం. ఫైనల్ ఆరంభానికి ముందు సినీనటుడు, ఈ లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ స్టేడియంలో సందడి చేయగా ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తన పాటలతో ఉర్రూతలూగించాడు.

## యువతరంగం

# అంతా ఎఐ మాయ!




ప్రపంచం మొత్తం కృత్రిమ మేధస్సు (ఎఐ) మాయలో చిక్కుకుంది. ఎఐ వల్ల లాభం ఎంత ఉందో, నష్టం కూడా అదే స్థాయిలో ఉంది. దీనివల్ల దేశ యువతే ఎక్కువగా ప్రభావితమవుతున్నదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆధునిక ఉద్యోగ మార్కెట్ ఈ ఏడాది ఎఐ వల్ల భారీ మార్పులకు గురవుతున్నది. చాలా ఉద్యోగాలను ఎఐ మింగేస్తున్నది. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అత్యధిక శాతం మంది ఎఐని ఆశ్రయిస్తున్నారు. తమతమ రెజ్యూమ్, కవర్ లెటర్లను ఎఐ సాయంతో రూపొందిస్తున్నారు. అదే సమయంలో కంపెనీలు కూడా ఎఐ సాయంతో, ఆటోమేటెడ్ వ్యవస్థల ద్వారా దరఖాస్తులను స్క్రీన్ చేసి, ఫిల్టర్ చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఎఐ ద్వారానే సమాధానాలు వస్తున్నాయి. యువతరం ఎక్కువగా ఎఐ ఆధారిత టూల్స్ ఉపయోగించి తమ దరఖాస్తులను తయారు చేస్తున్నా, వారి వ్యక్తిగతత, నైపుణ్యాలు, మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయి. ఇది ఒక పక్క నుంచి సమయాన్ని ఆదా చేస్తే, మరొక పక్క నుండి నైతికంగా మానవ అనుబంధం లేనిదైన అనుభూతిని కలిగిస్తోంది. అదే సమయంలో పలు సంస్థలు ఉత్పాదకత పెంచటానికి, ఎక్కువ మంది దరఖాస్తుదార్లను తేల్చుకోవడానికి ఎఐ ఆధారిత ఆటోస్క్రీనింగ్ వ్యవస్థలను వాడుతాయి. ఈ విధానం కొందరు అర్హులైన అభ్యర్థులకు అవకాశాలు చేజారే ప్రమాదం ఉంది. గోస్ట్ జాబ్ పోస్టింగ్స్, తక్కువ జీతాలు ఇస్తూ ఆఫర్లు, కష్టమైన దరఖాస్తు వ్యవస్థల కారణంగా అర్హత కలిగిన కొంతమంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మార్కెట్ పరిస్థితిని గమనిస్తే, నాలెడ్జ్ వర్కర్లలో కూడా ఎఐ పట్ల పెరుగుతున్న భయం ఉంది. కొంత మంది నైపుణ్యాలు మార్పుకు తగినట్టుగా ఉండకపోవడంతో ఉద్యోగాలు కోల్పోతున్నారు. 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' అంచనా ప్రకారం ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఎఐ వల్ల మాయం కానున్నాయి. అయితే, సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటే, కొత్త ఉద్యోగాలు సృష్టిస్తాయని చెప్పడం ఆశాజనకమైన విషయం. ఎఐ కారణంగా కొంతమంది ఉద్యోగాల తీరు, పని స్వరూపాలు మారిపోతున్నాయి. మార్కెటింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్ వంటి రంగాలలో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. సృజనాత్మకత, సంక్లిష్ట సమస్య పరిష్కారం, మనుషుల మధ్య సహకారం, నైపుణ్యతలు త్వరగా నేర్చుకోవడం, ఎఐఎథిక్స్ వంటిఅంశాలు ముఖ్యమవుతాయి. ఎఐ టూల్స్ ఉద్యోగ మార్కెట్ శకలాన్ని పెంచేకున్నా యి.. కొన్నింటి వల్ల ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమూ పెరుగుతుంది, ఇంకొన్నిటి ద్వారా కొత్త ఉద్యోగ అవకాశాలూ వస్తుంటాయి. కానీ, ఇది మనుషుల మధ్య కలయికను తగ్గించే దిశగా కొనసాగితే, అది ఉద్యోగ వాతావరణాన్ని కొంచెం 'తగదు' చేసేదిగా అనిపిస్తుంది. ఎఐ ఆధారిత వ్యవస్థలు, ఆటోమేషన్ తీసుకువచ్చినప్పటికీ, మానవ సంబంధాలు, వ్యక్తిగత ప్రతిభను దెబ్బతీసేదిగా దాని ప్రభావం ఉండకూడదు. ఏదిఏమైనా, ఈ మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అవసరం.

### పాఠ్యాంశాలలో ఎఐ ప్రాముఖ్యత

ఎఐని పాఠ్యాంశాలలో సమగ్రంగా చేర్చడం ద్వారా విద్య బట్టిపట్టే విధానంనుంచి సామర్థ్య ఆధారిత విద్యగా మారుతుంది. సమాచారాన్ని గుర్తుంచుకోవడం వంటి పనులను ఎఐ మరింత సమర్థంగా చేయగలదు కాబట్టి, విద్య లక్ష్యం విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, భావోద్వేగ మేధస్సు వంటి మానవ నైపుణ్యాలపై కేంద్రీకృతమవుతుంది. అలాగే ఎఐ ఆధారిత వ్యక్తిగతీకృత అభ్యాసం ద్వారా ప్రతి విద్యార్థి తన వేగానికి అనుగుణంగా నేర్చుకునే అవకాశం లభిస్తుంది. బలహీనమైన విద్యార్థికి అదనపు సహాయం, ముం దున్న విద్యార్థికి సవాలుతో కూడిన అంశాలు అందించడం సాధ్యమవుతుంది. ఇది వ్యక్తిగత ట్యూషన్‌ను ప్రజాస్వామ్యీకరించినట్లుగా మారుతుంది. భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుంటే, ఎఐను అన్వయించగల సామర్థ్యం తప్పనిసరి నైపుణ్యంగా మారుతోంది. ప్రపంచ ఆర్థిక వేదిక నివేదికల ప్రకారం రాబోయే సంవత్సరాల్లో ఉద్యోగ నైపుణ్యాల్లో భారీమార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ఎఐతో కలిసి పనిచేయగల విద్యార్థులే ఉపాధి అవకాశాల్లో ముందుంటారు. అంతేకాక, భాషా అడ్డంకులను అధిగమించడంలో కూడా ఎఐ కీలకపాత్ర పోషిస్తుంది. మాతృభాషలో సాంకేతిక విషయాలను అర్థం చేసుకునేలా చేసే అనువాద సాధనాలు ఉన్నత విద్యను మరింత సమానత్వపూరితంగా మారుస్తాయి.




### సవాళ్లు.. పరిష్కార మార్గాలు



ఎఐ ఏకీకరణలో అనేక సవాళ్లు ఉన్నాయి. మౌలిక వసతుల లోపం ముఖ్యమైన సమస్య. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ సామర్థ్య గల పరికరాలే అందుబాటులో ఉండటం వల్ల ఎఐని సమర్థంగా వినియోగించడం కష్టం అవుతుంది. దీనికి తోడు, అధికంగా ఎఐపై ఆధారపడటం వల్ల మానవ ఆలోచనా సామర్థ్యం తగ్గిపోతుందనే ఆందోళన కూడా ఉంది. పరీక్షా విధానాలు ఇంకా జ్ఞాపకశక్తిని పరీక్షించే విధంగా ఉండటంతో, ఎఐ ఆధారిత అసైన్‌మెంట్లను న్యాయంగా మూల్యాంకనం చేయడం సవాలుగా మారింది. డేటా సార్వభౌమత్వం, గోప్యత, విదేశీ డేటాసెట్లపై ఆధారపడటం వల్ల ఏర్పడే సాంస్కృతిక పక్షపాతం వంటి అంశాలు కూడా గమనించాలి. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎన్ఇపి సూచించిన జాతీయ విద్యా సాంకేతిక వేదిక వంటి సంస్థలు కీలక పాత్ర పోషించాలి. దేశీయ విద్యా అవసరాలకు అనుగుణమైన సార్వభౌమ ఎఐ క్లౌడ్ ఏర్పాటు చేయడం ద్వారా కంప్యూటింగ్ అసమానతను తగ్గించవచ్చు. పాఠశాల స్థాయి నుంచే ఎఐ పౌరసత్వంపై బోధన ద్వారా నైతిక అవగాహన పెంపొందించాలి. మూల్యాంకన విధానాలను ప్రక్రియ ఆధారితంగా మార్చి, విద్యార్థి ఆలోచనా ప్రయాణాన్ని పరిశీలించే విధానాలను అమలు చేయాలి. అలాగే ఉపాధ్యాయులకు ఎఐ బోధనా నైపుణ్యాలపై సమగ్ర శిక్షణ ఇవ్వడం అత్యవసరం. విద్యలో కృత్రిమ మేధస్సు సమన్వయం ఒక సాధారణ సాంకేతిక నవీకరణ కాదు... ఇది ఒక సాంస్కృతిక మరియు నాగరిక అవసరం. 'స్వీకరణ' ద్వారా పరిచయం, 'అవగాహన' ద్వారా విమర్శనాత్మక సమాచారం గ్రహించడం, 'అనుసరణ' ద్వారా సృజనాత్మక అన్వయం అనే మూడు దశలు సమర్థంగా అమలైనప్పుడు, భారత విద్యా వ్యవస్థ ప్రపంచ స్థాయిలో ఆవిష్కరణలకు కేంద్రంగా మారగలదు. ఈ ప్రయాణంలో ఎఐ మానవ మేధస్సుకు సేవకుడిగా ఉండాలి, అధిపతిగా కాదు. అప్పుడు మాత్రమే భారతదేశం ప్రపంచ సాంకేతిక పరిష్కారాల వినియోగదారుగా కాకుండా, సృష్టికర్తగా ఎదుగుతుంది.

## సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే ఇవ్వాలి

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణిలో నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఒసిపి2లో పిట్ సెక్రటరీ ఎం.సురేష్, ఎ.పోచయ్య ఆధ్వర్యంలో ఎఐటియుసి గేట్ మీటింగ్ సోమవారం ఏర్పాటు చేశారు. సమావేశానికి రాజుకుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ.రావు హాజరై మాట్లాడుతూ నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలని, వేజ్ బోర్డుకు అడ్డుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, సొంత ఇంటి పథకం అమలుచేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి సింగరేణి మేనేజ్‌మెంట్‌కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఆర్‌సి రెడ్డి, బండారు. క్రాంతి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికవర్గ సంక్షేమానికి ఉద్యమాలు

ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓమయ్య, హన్మాండ్లు




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కార్మికవర్గ సంక్షేమానికి ఉద్యమాలు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.ఓమయ్య, వెన్నెల హన్మాండ్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఎఐటియుసి జిల్లా మహాసభల తీర్మాణాలను వివరించారు. ఈ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ హాజరయ్యారన్నారు. మహాసభలో కార్మికులకు సంబంధించి సమస్యలు, ప్రభుత్వ విధానాలపై తీర్మానాలు చేశామన్నారు. జిల్లాలో స్థానిక నిరుద్యోగులకు మొదటి ప్రాధాన్యతగా పరిశ్రమలో ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించాలని ఇతర రాష్ట్రాల వలస కార్మికులకు తెలంగాణ కార్మిక చట్టాలు వర్తింపజేయాలని, బీడీ పరిశ్రమపై జీఎస్టీ ఎత్తివేయాలని తదితర అంశాలతో తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించి భవిష్యత్తులో ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించటం జరిగింది. అనంతరం నూతన జిల్లా కమిటీని 44 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడిగా వై. ఓమయ్య, ప్రధాన కార్యదర్శిగా పిన్నెల హన్మాండ్లు, ఉపాధ్యక్షులుగా టి.చక్రపాణి, రాజన్న, కవిత, అంజయ్య, చందర్, సహాయ కార్యదర్శిగా సంజీవ్, అనిల్, దేవేందర్, భాగ్యలక్ష్మి, గోవర్ధన్, సంపత్, కోశాధికారిగా సయ్యద్ ఫిరోజ్‌లతో పాటు కార్యవర్గ కౌన్సిల్‌సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు. సమావేశంలో నాయకులు సంజీవ్, అనిల్, చందర్, గోవర్ధన్, ఫెరోస్, రాధాకుమార్, లాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.18వేలు గౌరవవేతనం హామీ నిలుపుకోవాలి

అంగన్‌వాడీలు కట్టుబానిసలు కాదు

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్

కలెక్టరేట్ ముట్టడి విజయవంతం

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు రూ.18వేల గౌరవ వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని సిఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసూఫ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సహనాన్ని చేతకానితనంగా భావించొద్దని, వారి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే సమరం తప్పదని ఆయన హెచ్చరించారు. ఎఐటియుసి అనుబంధన అంగన్‌వాడీల టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 2వ రోజు సోమవారం పాల్వంచ పెద్దమ్మతల్లి ఆవరణ నుంచి ప్రారంభమైంది. ర్యాలీగా అంబేద్కర్ సెంటర్ వరకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. పాతపాల్వంచ, నవభారత్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని వందలాది మందితో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిడబ్ల్యుఒకు అందజేశారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు చాలీచాలని వేతనాలు ఇస్తూ అధిక పనిభారంతో వెట్టి చాకిరీ చేయించుకోవాలనే ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. అంగన్‌వాడీలతో పెట్టుకున్న ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మాతా, శిశు సంరక్షణ, పౌష్టికాహార పంపిణి చిన్నారుల సంక్షేమంలో అంగన్‌వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల చేరవేస్తున్న అంగన్‌వాడీల శ్రమను గుర్తించకుండా వారిపై సంబంధం లేని అదనపు విధులను మోపడం దారుణం అన్నారు. రూ.18 వేల గౌరవ వేతన హామీని అమలు చేడడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీల పోరాడానికి ఎఐటియుసి అండగా ఉంటుందన్నారు.



**ముగిసిన పాదయాత్ర :** సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి అనుబంధ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం కలెక్టరేట్‌కు చేరుకోవడంతో ముగిసింది. సుమారు 40 కిలోమీటర్ల మేర నాయకులు, అంగన్‌వాడీలు పాదయాత్ర నిర్వహించారు. పాల్వంచకు చేరుకున్న పాదయాత్రకు పాల్వంచ సిపిఐ నాయకులు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, వీశంశెట్టి విశ్వేశ్వరరావుతో పాటు నాయకులు స్వాగతం పలికారు. అంగన్‌వాడీల టీచర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర డిప్యుటీ జనరల్ సెక్రటరీ సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ రాష్ట్ర అధ్యక్షచ కార్యదర్శులు, సాయి ఈశ్వరి, కరుణకుమారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి అరుణ, గోనె మణితో పాటు మున్నా లక్ష్మి కుమారి, వేల్పుల మల్లిఖార్జున్ రాజు షాహీన్, కైసర్, ధనలక్ష్మి, పద్మ, లక్ష్మి, ప్రమీల రాణి సరోజ తదితరులు పాల్గొన్నారు.




# యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలం




ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా 16వ మహాసభలు సోమవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బ్రాహ్మణపల్లి యుగంధర్ అధ్యక్షతన జరిగాయి. మహాసభల ప్రతీకగా ఎఐవైఎఫ్ జెండాను పైడిపల్లి రాజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహిస్తూ శాశ్వత ఉద్యోగ అవకాశాలను కుదిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేయడం, ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయడంలో పురోగతి సాధించలేదన్నారు. యువతకు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చేలా ప్రభుత్వాలు నిర్దిష్ట ప్రణాళిక చేపట్టాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరగనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల్లో యువజన సమస్యల పరిష్కారానికి,




విద్య,ఉపాధి హక్కుల సాధనకు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు, ప్రజాస్వామ్య, లౌకిక భారత నిర్మాణానికి కొత్త కార్యాచరణను రూపొందించనున్నామన్నారు. సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా పరిశ్రమల్లో స్థానిక యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఖాళీలు భర్తీ చేయడం, జిల్లా కేంద్రంలో ఆధునిక యువజన అభివృద్ధి కేంద్రం, స్టడీ సర్కిల్, కెరీర్ గైడెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నాయకులు బోనగిరి మహేందర్, రంజిత్, కె. సంతోష్ చారి, రమ్య, శ్రీనివాస్, మురళి, స్వాతి, తిరుపతి, చెంచల రవి, అవినాష్, శివకుమార్, జెట్టి. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** అన్నిరంగాల కార్మికులకు అండగానిలుస్తూ, కార్మికవర్గ శ్రేయస్సు కోసం, వారి వేతనాల పెంపు, హక్కులు, చట్టాలు కాపాడేందుకు ఎఐటియుసి అండగా ఉండి పోరాటాలు చేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.బాలరాజు అన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐటియుసి కరీంనగర్ జిల్లా సమితి 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కార్మిక సంఘాలలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఎఐటియుసి ఉందని, కార్మిక వర్గాన్ని, ఉద్యోగ వర్గాన్ని ఐక్యం చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదని, సంఘటిత అసంఘటిత రంగాలకు చెందిన కార్మికవర్గానికి ఆశాజ్యోతిగా నిలిచిందన్నారు. శ్రమకు తగ్గ ఫలితం కావాలని, పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనాల కోసం నాటి నుంచి నేటివరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపి అనేక చట్టాలు తీసుకువచ్చిన కార్మిక సంఘం ఎఐటియుసి అన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను, సమ్మె చేసే హక్కు కూడా కాలరాయడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. కార్పోరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల, కర్షకుల వ్యతిరేకిగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బాలరాజు విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 6,7, 8 తేదీల్లో జరిగే ఎఐటియుసి నాలుగవ రాష్ట్ర మహాసభల్లో జిల్లాలోని కార్మికవర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో ఎఐటియుసి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సమ్మయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు తిరుపతి యాదవ్, కార్యదర్శి పిట్టల సమ్మయ్య, డి.రజిత, పిట్టల శ్రీనివాస్, కె.రజిత, స్రవంతి, ప్రభాకర్ కిమ్మసారపు నరసయ్య, ఏసు రజిత, లక్ష్మి, ఆగయ్య, ఎం.కొమురయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



# చెరువుల పునరుద్ధరణకు 'హైడ్రా'కు రూ.227.98 కోట్ల నిధులు!

- తొలి విడతగా ఓఆర్ఆర్ పరిధిలోని 4 ప్రధాన చెరువుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర పరిధిలోని సహజ వనరులు, చెరువుల సంరక్షణే ధ్యేయంగా అడుగులు వేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని నాలుగు ప్రధాన చెరువుల పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధి పనుల (ఫేజ్1 కోర్ పనులు) కోసం రూ. 227.98 కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం (జీ.ఓ నెంబర్ 678) ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. హైడ్రా కమిషనర్ సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డిపిఆర్), కార్యాచరణ ప్రణాళికను పరిశీలించిన ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించిన అంచనాలను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) పరిశీలించి, ఐఐటి హైదరాబాద్ (ఐఐటి హైదరాబాద్) ద్వారా స్వతంత్ర సాంకేతిక విశ్లేషణ, క్షేత్రస్థాయి తనిఖీలను పూర్తి చేయించింది. ఐఐటి హైదరాబాద్ ధృవీకరణ పత్రాల ఆధారంగా ఈ నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతమైంది. పనుల అత్యవసరత దృష్ట్యా ఈ ఖర్చును ప్రాథమికంగా హెచ్ఎండిఏ తన సొంత నిధుల నుండి భరించనుంది. ఈ నాలుగు చెరువుల సమగ్ర అభివృద్ధికి మొత్తం మూడు విడతల్లో రూ. 536.5 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించగా, ప్రస్తుతం అత్యంత కీలకమైన మొదటి విడత (కోర్ ఐటమ్స్) పనుల కోసం ప్రభుత్వం రూ. 227.98 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో చెరువుల పూడికతీత, గట్ల బలోపేతం, మురుగునీరు కలవకుండా మళ్లించడం వంటి అత్యవసర పనులను హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టనున్నారు.

**నిర్వహణ ఖర్చుల కోసం అదనంగా రూ.12.50 కోట్లు విడుదల**

చెరువుల అభివృద్ధి నిధులతో పాటు, హైడ్రా ఏజెన్సీ రోజువారీ నిర్వహణ, కార్యాచరణ సహాయం కోసం బడ్జెట్ అంచనాలు 2026–27 నుండి మరో రూ. 12.50 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం మరో జీ.ఓ నెంబర్ 679 జారీ చేసింది. ఆర్థికశాఖ బడ్జెట్ విడుదల ఉత్తర్వుల అనుగుణంగా ఈ నిధులను డ్రా చేసేందుకు హైడ్రా కమిషనర్‌కు పూర్తి అధికారాలు కల్పించారు. నగరంలో కబ్జాలకు గురవుతున్న, కాలుష్య కాసారాలుగా మారుతున్న ప్రధాన జలాశయాలకు ఈ నిధుల ద్వారా పునర్జీవం లభించనుందని నిపుణు లు అభిప్రాయపడుతున్నారు. జీ.ఓ ఆదేశాల ప్రకా రం హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, హైడ్రా కమిషనర్లు సంయుక్తంగా ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది.

**తొలి విడతలో నిధులు సాధించిన 4 ప్రధాన చెరువుల వివరాలు..**

– ఫాక్స్ సాగర్ జీడిమెట్ల చెరువు ఎఫ్‌టిఎల్ పరిధి 482.60 ఎకరాలు. ఫేజ్1 కేటాయింపులు రూ. 74.35 కోట్లు.
– అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధి 464.56 ఎకరాలు. ఫేజ్1 కేటాయింపులు రూ.68.00 కోట్లు.
– అంబర్ చెరువు బాగ్ అమీర్ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధి 162.00 ఎకరాలు. ఫేజ్1 కేటాయింపులు రూ. 50.63 కోట్లు.
– సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధి 150.80 ఎకరాలు. ఫేజ్1 కేటాయింపులు రూ.35.00 కోట్లు.

# ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రూ.573.28 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరితో కలిసి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/మక్తల్ :** రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. మక్తల్ నియోజకవర్గంలో హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం కోసం సోమవారం విచ్చేసిన రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్‌తో పాటు ప్రజాప్రతినిధులు, కలిసి రూ.237 కోట్లతో నిర్మించనున్న మక్తల్‌నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డుకు శంకుస్థాపన చేసి, హ్యామ్ రోడ్ల పైలాన్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో రూ.573.28 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేశాం. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రి కాక ముందు నుంచే ప్రతి సమావేశంలో మక్తల్‌నారాయణపేట రహదారి గురించి ప్రస్తావిస్తూ ఈ రోడ్డు నిర్మాణాన్ని మంజూరు చేయాలని నిరంతరం కోరేవారని, ఆ విజ్ఞప్తికి అనుగుణంగానే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందని ఆయన తెలిపారు. గతంలో తాను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్నానని, ఇక్కడి రహదారుల పరిస్థితిపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రహదారి విస్తరణకు ప్రజలు సహకరించి అవసరమైన భూమిని ఇవ్వాలని, భూములు ఇచ్చే వారికి ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తుందని రహదారి నిర్మాణం విషయంలో అవసరమైన పరిపాలన అనుమతులన్నింటిని తొందరగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ను మంత్రి ఆదేశించారు. సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఒక్క ప్యాకేజీలో రూ.547 కోట్లు అందులో 4 లైన్ల రోడ్డు నిర్మాణం అంటే ఆషామాషీ కాదు అని అన్నారు. రోడ్డు వ్యవస్థ ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి పట్టుదల, ఏమాన్నా చేయాలన్న తపన ఉన్న నాయకుడు అని, కొనియాడారు. సాగునీటి పరంగా మక్తల్ నుండి పురోగతి సాధిస్తుందని, వచ్చే ఎన్నికల నాటికి సాగునీటి వనరులు ఇక్కడ గణనీయంగా పెరుగుతాయని జూపల్లి తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన మంత్రి డా.వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో ప్రారంభమైన రోడ్ల నిర్మాణ పనులు చారిత్రాత్మకమైనవని అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల అవసరాలనే ప్రాధాన్యంగా తీసుకుని ఈ భారీ రహదారి ప్రాజెక్టులను మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల రవాణా కష్టాలు తొలగించాలనే సంకల్పంతో రూ.237 కోట్లతో మక్తల్‌నారాయణపేట నాలుగు లైన్ల రహదారిని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.మక్తల్ అభివృద్ధి ప్రయాణానికి ప్రజల ఆశీర్వాదం, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, మార్కెట్ చైర్మన్‌లు రాధా లక్ష్మారెడ్డి, సదా శివారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థలు చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఆర్అండ్‌బీసీ ఈ.వెంకటేశ్వర్ రావు, ఎస్ఈ రాజేందర్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్‌ను వర్తింపచేయండి

- టిఎస్ యుటిఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాత పెన్షన్ పథకాన్ని డీయస్సీ2003 ఉపాధ్యాయులతో పాటు కట్‌ఆఫ్ తేదీకి ముందు వచ్చిన నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఇతర ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1వ తేదీ కంటే ముందు గా రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు జారీ చేసిన, 2004 సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత సర్వీస్‌లో చేరిన ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పథకంలో చేరడానికి వన్ టైం ఆప్షన్‌కు అవకాశం కల్పిస్తూ అర్హత కలిగిన ఉద్యోగులు నిర్దిష్ట సమయంలోపు తమ ఎంపికను తెలియజేయడానికి అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిఎస్సీ 2003 ఉపాధ్యాయులకు అవకాశం కల్పించినట్టుగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అవకాశాన్ని కల్పించాలని కోరారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్ల తగ్గింపుపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ శాసనమండలిలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు తగ్గడంపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. సయ్యద్ ఇఫ్తికార్ హుస్సేని దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇతర కోటాలకు మళ్లించారని పిటిషనర్ తరఫు వాదనలు వినిపించగా, ఈ అంశంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

# ఇంజాపూర్ భూ ఆక్రమణలపై సిఐడి దర్యాప్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్‌లోని సర్వే నెం.126లో ఉన్న 74.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలపై సీఐడీతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశించారు. న్యాయవాది సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని డీజీపీని ఆదేశించింది. ఆక్రమణలకు సహకరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శికి సూచించింది.

# దాల్మియా పిటిషన్‌పై విచారణ 19కు వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసును కొట్టివేయాలని దాల్మియా సిమెంట్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. సీబీఐ తరఫు ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ, జగన్ కంపెనీల్లో పెట్టుబడులు క్విడ ప్రోకోలో భాగంగానే జరిగాయని, ఈ దశలో ఆధారాలను తిరస్కరించడం సరికాదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 19కు వాయిదా వేసింది.

# ఎన్‌బిడబ్ల్యు అమల్లో జాప్యంపై పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోర్టు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యు)ను సకాలంలో అమలు చేయడంలో జాప్యం చేసిన పోలీసుల తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళ్‌హాట్ ఎస్‌హెచ్‌వోకు నోటీసు జారీ చేసి వివరణ తీసుకోవాలని, జాప్యానికి గల కారణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. చెక్‌బౌన్స్ కేసులో పంచీవాలే దినేష్‌సింగ్‌పై ట్రయల్ కోర్టు జారీ చేసిన ఎన్‌బీడబ్ల్యూను అమలు చేయడం లేదంటూ ధూల్‌పేట్‌కు చెందిన దల్వాలే ధనంజయ్‌సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టీ. మాధవిదేవి విచారణ చేపట్టారు. పిటిషన్ దాఖలైన తర్వాతే పోలీసులు ఎన్‌బీడబ్ల్యూను అమలు చేసినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయని, ముందుగానే తమ చట్టబద్ధ బాధ్యత నిర్వర్తించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని కోర్టు వ్యాఖ్యానించింది. ఎస్‌హెచ్‌వోపై విచారణ జరిపించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను ముగించింది.

# కాళేశ్వరం... కెసిఆర్ అవినీతి దాహానికి నిదర్శనం

- ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అవినీతి దాహానికి నిలువెత్తు నిదర్శనమని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ విమర్శించారు. గాంధీ భవన్‌లో సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టుపై ఫొటో ప్రదర్శనను ఆయన ఏర్పాటు చేసి వాస్తవాలను వివరించారు. కాళేశ్వరం పేరుతో గత పదేళ్లలో రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న కెసిఆర్ ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పకుండా ఫామ్ హౌస్‌లో దాక్కున్నారని ఆయన ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన నిర్మాణ లోపాలు, అవినీతిపై ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత కెసిఆర్‌పై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, నిర్మాణ లోపాలను వెలుగులోకి తీసుకువచ్చామని బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా ప్రాజెక్టు నిర్మాణాల్లో లోపాలను గుర్తించిందని, అయినప్పటికీ బిఆర్ఎస్ నాయకులు ఇంకా ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ ఆలోచన కాదని, మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని తెలిపారు. తాము నిర్మించినట్లు చెప్పుకుంటూ బిఆర్ఎస్ నాయకులు చివరకు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కాళేశ్వరం అంశంపై నిజంగా ధైర్యం ఉంటే కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. ప్రజల రక్తాన్ని పీల్చుకున్న వారు ఇప్పుడు రక్తదానం పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

# పదవి ఉందనే అహంకారం వద్దు

- ఇంజినీర్లకు వెంటనే క్షమాపణ చెప్పు
- సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి ఈటల రాజేందర్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో బీఆర్ఎస్ నేతలు, రిటైర్డ్ ఇంజినీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత అహంకారంతో, నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణా ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఫోరమ్ ఆధ్వర్యంలో కరువు వర్సెస్ కాళేశ్వరం, కన్నెపల్లి నుంచి నీల తరలింపు సాధ్యమా? లేదా? ప్రభుత్వ వాదన కరెక్టేనా? అనే అంశంపై రౌండ్ టేబ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి కూడా మాట్లాడనటువంటి దిగజారుడు భాషను రేవంత్‌రెడ్డి వాడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఖబర్దార్ రేవంత్ రెడ్డి.. పదవి ఉందనే అహంకారంతో మాట్లాడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాత్రింబవళ్లు కష్టపడిన ఇంజినీర్లను కించపరిచేలా సీఎం చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని, వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ కూలిపోయింది, అన్నారం, సుందిళ్ల పనికిరావని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు.. నేను ఒక్కటే ముఖ్యమంత్రిని అడగదలుచుకున్నాను.. ఎన్డీఎస్ఏ పేరు చెప్పి తప్పించుకుంటున్న ముఖ్యమంత్రి.. ఇక్కడి రిటైర్డ్ ఇంజినీర్లు, సాగు నీటి నిపుణుల సూచనలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అనంతరం రిటైర్డ్ ఇంజనీర్స్ దామోదర్‌రెడ్డి, వెంకటేశం, శ్రీధర్ దేశ్ పాండే, వెంకట రామారావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రాజెక్టుల్లో నిలువ ఉన్న నీళ్లన్నీ డెడ్ స్టోరేజీకి చేరాయన్నారు. మేడిగడ్డ నింపితే కూలిపోతుందని, భద్రాచలం మునిగిపోతుందని ముఖ్యమంత్రి భయపెట్టే ప్రకటనలు చేస్తున్నారని, ఆ వాదనలు తప్పన్నారు. ప్రస్తుతం వస్తున్న వరదల కంటే రెట్టింపుస్థాయిలో నీళ్లు వచ్చినా ఏమీ కాలేదని తెలిపారు. రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని నీళ్లను ఎత్తిపోయాలన్నారు. లేకపోతే కరెంటు సమస్యలు కూడా తలెత్తుతాన్నారు. ఈ రౌండ్ టేబ్ సమావేశంలో ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు, బీజేపీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నేత చిరుమల్ల రాకేష్, సీనియర్ జర్నలిస్టుల గొర్ల బుచ్చన్న, ఎ.రమణ కుమార్, నర్రా విజయ్ పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలల సిబ్బందికి రెన్యువల్ జీవో జారీ

- ప్రభుత్వ డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గెస్ట్ ఫ్యాకల్టీ, టిఎస్‌కెసి ఉద్యోగుల సర్వీస్‌ను మరో ఏడాది కాలం పొడిగిస్తూ ప్రభుత్వం రెన్యువల్ జిఓను జారీ చేయడం పట్ల తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.వైకుంఠం, ప్రధాన కార్యదర్శి బిజ్జ మధుసూదన్ హర్షం వ్యక్తం చేశారు. దాదాపుగా 26 ఏళ్ల చరిత్రలో ఇంత వేగంగా రెన్యువల్ జీవో రావడం ఇదే తొలిసారి అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయడంతో ఇకపై నెలవారీ వేతనాల చెల్లింపుల్లో సమస్యలు తగ్గనున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ జిఓ ద్వారా మొత్తం 2784 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుందని, ఇందులో కాంట్రాక్టు లెక్చరర్లు 451 మంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 349 మంది, టిఎస్‌కెసి 45 మంది, గెస్ట్ ఫ్యాకల్టీ 1939 మంది ఉన్నారన్నారు. అయితే ఈ సారి కాంట్రాక్టు లెక్చరర్ పోస్టులను నాన్ శాంక్షన్డ్ కేటగిరీలో చూపించారని, వాటిని తిరిగి శాంక్షన్డ్ పోస్టుల కేటగిరీలో చేర్చి జిఓ 1171ను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రెన్యువల్ జిఓ జారీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉన్నత విద్యా శాఖ అధికారులు, ఇతర ఉన్నతాధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# 'ఎడ్, పిఈ'సెట్ షెడ్యూల్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ల బిఈడి కోర్సుతో పాటు యుజిడిపిఈడి, బిపిఈడి కోర్సులలో ప్రవేశాల భర్తీలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది.2026–27 విద్యా సంవత్సరానికి గానూ 'టిజి ఎడ్‌సెట్ 2026), టిజి పిఈ సెట్2026) కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను టిజి సెట్, అడ్మిషన్ల కన్వీనర్ ఐ.పాండురంగారెడ్డి సోమవారం విడుదల చేశారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం విడుదల కానుంది. టిజి ఎడ్‌సెట్ అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల అప్‌లోడింగ్‌కు అవకాశం కల్పించారు. ఎస్సీసీ, సీఏపీ, పీహెచ్, స్పోర్ట్స్ వంటి ప్రత్యేక కేటగిరీల అభ్యర్థులకు ఈనెల 28 నుంచి 31 వరకు ఉస్మానియా యూనివర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో భౌతిక ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. ఇందులో ఎస్సీసీ అభ్యర్థులకు జూలై 28, 29 తేదీల్లో, సీఏపీ ,పిహెచ్ అభ్యర్థులకు జూలై 29న, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు జూలై 31న వెరిఫికేషన్ నిర్వహిస్తారు. ఆగస్టు 1న అర్హులైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. సవరణలకు అవకాశం కల్పించి, ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు మొదటి విడత వెబ్ ఆప్షన్ల నమోదుకు, ఆగస్టు 4న ఆప్షన్ల సవరణకు అవకాశం ఉంటుంది. ఆగస్టు 8న మొదటి విడత సీట్ల కేటాయింపు ఫలితాలను విడుదల చేస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 10 నుంచి 14 మధ్య సంబంధిత కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకుని, ట్యూషన్ ఫీజు చెల్లించి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

**పిఈసెట్ కౌన్సెలింగ్ వివరాలు:**

టిజిపిఈసెట్ అభ్యర్థులకు జూలై 21 నుంచి 25 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడింగ్ ప్రక్రియ జరుగుతుంది. ప్రత్యేక కేటగిరీల అభ్యర్థులకు జూలై 28, 29 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో భౌతిక ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. జూలై 27న అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. జూలై 28 నుంచి 30 వరకు మొదటి విడత వెబ్ ఆప్షన్ల నమోదుకు, జూలై 31న ఆప్షన్ల సవరణకు అవకాశం కల్పించారు. ఆగస్టు 2న మొదటి విడత సీట్ల కేటాయింపు జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 3 నుంచి 6 వ తేదీల్లోగా సంబంధిత కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు ఫీజు చెల్లించి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

# బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సదస్సు




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంగా, భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సదస్సు నేటి నుంచి 16 తేదీ వరకు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రిక్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ చరిత్రలోనే ఈ అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్లో జరగడం ఇదే తొలిసారి అని అన్నారు. ప్రతిష్టాత్మక సదస్సులో బ్రెజిల్, రష్యా, చైనా, సౌదీ అరేబియా, యూఏఈ వంటి వివిధ దేశాల నుంచి 46 మంది అంతర్జాతీయ ప్రతినిధులు, దేశం నలుమూలల నుంచి 70 మంది ప్రతినిధులు పాల్గొని అందరికీ సామాజిక భద్రత, అంతర్జాతీయ పోర్టబిలిటీ, పని ప్రదేశాల్లో కృత్రిమ మేధస్సు బాధ్యతాయుత వినియోగం, నైపుణ్యాల కొరతమిగులు సమస్యలపై కార్మిక సంఘాల పాత్ర, మహిళలు , భవిష్యత్ ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించుకున్నట్లు తెలిపారు. జూలై 14న మారియట్ హోటల్లో జరిగే ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి డా.మన్సుఖ్ భాయ్ మాండవీయ, సాయంత్రం జరిగే 'వర్కర్స్ కాన్ఫ్లుయెన్స్' కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ, జూలై 15న జరిగే ప్లీనరీ సమావేశాన్ని రాష్ట్ర మంత్రి డా. వివేక్ వెంకటస్వామి, ముగింపు సభకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు.

# అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థి శ్రేష్ఠ సురయకు స్వర్ణం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొలంబియాలోని బుకారామంగాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన 56వ అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ 2026లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థి శ్రేష్ఠ సురయ బంగారు పతకం సాధించి చరిత్ర సృష్టించాడు. ప్రపంచ దేశాల మేధావులతో పోటీపడి, భారత దేశం తరపున ప్రాతినిధ్యం వహించిన శ్రేష్ఠ అద్భుత ప్రతిభతో ఈ ఘనత సాధించాడు. ఈ ఏడాది జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న భారత ప్రతినిధి బృందంలోని ఐదుగురు సభ్యులూ స్వర్ణ పతకాలు సాధించడం విశేషం. తద్వారా చైనా, రష్యా, సౌత్ కొరియా, కజకిస్తాన్, తైవాన్ దేశాలతో కలిసి భారతదేశం ప్రపంచస్థాయిలో జాయింట్ వరల్డ్ ర్యాంక్ నెంబర్ 1 సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 87 దేశాల నుండి 381 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జెఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ అద్భుత ప్రతిభ గ్లోబల్ స్టేజీపై గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా, శ్రేష్ఠ సురయ ఇటీవల విడుదలైన జెఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాల్లో ఆల్ ఇండియా 58వ ర్యాంక్ సాధించి తన అసాధారణ విద్యా నైపుణ్యాన్ని నిరూపించుకున్నాడు. యాజమాన్యం హర్షం ఈ ఘనవిజయంపై నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సింధూర నారాయణ హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

- 16 నుంచి ఆగస్టు 13 వరకు ఉత్సవాలు
- 3,427 దేవాలయాలకు రూ.15.05 కోట్లు విడుదల: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో జరిగే బోనాల జాతర నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో తొలి బోనాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జూలై 20, 21, 22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఎదుర్కోలు, కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహించనుండగా, ఆగస్టు 2న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం, ఆగస్టు 9న లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో ప్రధాన బోనాల ఉత్సవాలు జరుగనున్నాయి. పాత జిహెచ్ఎంసి పరిధిలోని 3,427 దేవాలయాలకు బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రూ.15 కోట్ల 5 లక్షల 41 వేల 150 విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. దేవాదాయ శాఖ, జిహెచ్ఎంసి, పోలీస్, ఆర్ అండ్ బి, ట్రాన్స్‌కో, మెట్రో వాటర్ బోర్డు, ఆర్‌టిసి తదితర శాఖలు కలిసి తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, భద్రత, ప్రత్యేక బస్సులు, విద్యుద్దీపాలంకరణ వంటి ఏర్పాట్లు చేపట్టాయని చెప్పారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాలతో పాటు నగరంలోని సుమారు 30 ప్రధాన దేవాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. బోనాల అనంతరం ఫలహారం బండ్ల ఊరేగింపు కూడా నిర్వహించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.







కేరళలోని తిరువనంతపురంలో సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి వి.డి.సతీశన్ 'పయనీర్' దినపత్రిక కేరళ ఎడిషన్‌ను ఆవిష్కరించారు. ఈ పత్రిక తొలి ప్రతిని ఆయన డిప్యూటీ స్పీకర్ షానిమోల్ ఉస్మాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం, కేరళ హోంమంత్రి రమేష్ చెన్నితల, పయనీర్ కేరళ చైర్మన్ బండి సుధాకర గౌడ్, పయనీర్ ఢిల్లీ చైర్మన్ ప్రశాంత్ తివారీ, గురురత్నం జ్ఞాన తపస్వి, పాలయం ఇమామ్ వి.పి. సుహైబ్ మౌలవి తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డును బేషరతుగా తొలగించాలి

### పోరాట కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** భరించలేని దుర్వాసన వెదజల్లుతూ, చెరువులను, భూగర్భ జలాలను, గాలిని కలుషితం చేస్తున్న రాంకీ డంపింగ్ యార్డును బేషరతుగా తొలగించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి డిమాండ్ చేసింది. సోమవారం జవహర్‌నగర్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, భాగ్యనగర్ కాలనీ, పాత గబ్బిలాలపేట ప్రాంతాల్లో మూడవరోజు పాదయాత్ర నిర్వహించారు. టిఆర్‌ఎస్ (జాగృతి) నాయకురాలు, మాజీ కార్పొరేటర్ మేక లలిత యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్, మాజీ ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మా గౌడ్ సహా వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు (సిపిఐ ఎంఎల్, ఇఫ్టూ, పిఓడబ్ల్యూ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ తదితరులు) పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు వల్ల ప్రజల ఆరోగ్యం, మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూలై 1 నుండి 20 వరకు కీసర, శామీర్‌పేట, కాప్రా, యాప్రాల్ మండలాల్లో రౌండ్ టేండ్ సమావేశాలు, పాదయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణం, ఆరోగ్య రక్షణే ధ్యేయంగా జులై 26న నిర్వహించబోయే భారీ సదస్సును ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డును ఇక్కడి నుండి తరలించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.



## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ.. బిఎల్‌ఒలదే బాధ్యత

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో భాగంగా బిఎల్‌ఒలు కొనసాగిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూర్తి చేసిన ఫారాల స్వీకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. సోమవారం జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కుత్బుల్లాపూర్ మున్సిపల్ జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్‌తో కల్సి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యుమరేషన్ ఫారాలు ఓటర్లకిచ్చి వాటిని సక్రమంగా పూరించి తీసుకోవటంలో బిఎల్‌ఒలే పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఫారాలు పూరించటంలో ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. దీంతోపాటు స్వీకరించిన ఫారాల్లో నమోదైన వివరాలను వెంటవెంటనే ఆపరేటర్ల ద్వారా డిజిటలైజేషన్ సైతం బిఎల్‌ఒలే రోజు చేయించాలన్నారు. బిఎల్‌ఒలు వారికిచ్చిన టార్గెట్‌లను ఏ విధంగా పూర్తి చేయాలన్న విషయంలో కలెక్టర్ దిశానిర్దేశం చేసారు.

## విద్యుత్, తాగునీరు దుస్థితిపై ఆందోళన

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలో యంనంపేట గ్రామంలో విద్యుత్, తాగునీరు,వీధిలైట్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత గ్రామ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పోలగోని వాసుదేవ్ గౌడ్, మాజీ సర్పంచ్ సుదర్శన్ యాదవ్, మాజీ ఎంపిటిసి నర్రే శ్రీశైలం, ప్రభాకర్ గౌడ్,మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అఇకారులు వెంటనే చర్యలు చేపట్టి సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులను కోరారు.



## కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం 8వ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం ఇస్మాయిల్‌ఖాన్‌గూడ,యంనంపేట్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్)అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు సవరణలు అవసరమైన ధ్రువపత్రాలపై ప్రజలకు వివరించారు. అనంతరం బూత్ స్థాయి ప్రతినిధులతో సమావేశమైన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని కర్రె రాజేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికల కృష్ణ రెడ్డి, గొంగళ్ల చంద్రకాంత్, జిల్లా బిసి సెల్ కన్వీనర్, బద్రి హేమంత్ మాజీ ఉపాధ్యాయులు కొండకళ్ల లింగం, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం : ఎమ్మెల్యే మర్రి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన శస్త్ర చికిత్సల ద్వారా వైద్యానికి నోచుకోలేని నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందే ఆర్థిక సాయం ఓ వరంలాంటిదని, దీనికోసం అవసరమైన వారు వైద్యులిచ్చిన ప్రతిపాదన లేఖలతో తనను సంప్రదిస్తే మంజూరు చేయిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. చికిత్సల నిమిత్తం నియోజకవర్గానికి చెందిన 27 కుటుంబాలకు గాను సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.18 లక్షలు చెక్కులను లబ్దిదారులకు ఆయన సోమవారం ఆనంద్‌బాగ్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులతో పాటు వెంకటేష్ యాదవ్, బికె శ్రీనివాస్, గుండా నిరంజన్, జివిస్వీ సతీష్‌కుమార్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

### పరిశుభ్రత, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి సోమవారం నాచారం సర్కిల్ పరిధిలోని బాబానగర్ వార్డులో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. పారిశుద్ధ్యం, పట్టణ హరితీకరణ, దోమల నివారణ చర్యలు, పౌర సేవల అమలును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి వెంటనే నిర్మూలించాలని, యాంటీ లార్వల్ చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఎంటమలాజీ విభాగాన్ని ఆదేశించారు. సీజనల్ వ్యాధు ల నివారణకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు నిర్వహణ లేకుండా ఉన్న లేదా ఆక్రమణకు గురైన ప్లాంటర్ బ్లాక్స్‌ను తొలగించి కొత్త మొక్కలు నాటాలని యుబిడి విభాగానికి సూచించారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను వెంటనే తొలగించి అక్రమంగా డంపింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఘన వ్యర్థాల నిర్వహణ విభాగాన్ని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

**ఎంఎంసి ప్రజావాణిలో వినతులు స్వీకరణ**



ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 29 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు వివరించగా, ప్రతి ఫిర్యాదును ఓర్పు గా ఆలకించిన ఆయన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నేరు గా అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పౌర సేవలు అందించడంలో ఎంఎంసి కట్టుబడి ఉందని కమిషనర్ అన్నారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీప్లానర్ బి.ప్రదీప్ కుమార్, అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘుప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల ఆక్రమణలు అరికట్టాలి

### జోనల్ కమిషనర్‌కు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో రోడ్లపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే అడ్డుకుని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు సోమవారం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ చింతల్ సర్కిల్, మహదేవపురం, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ఈ సమస్యపై గతంలో ఆయా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ముఖ్యంగా జగద్గిరిగుట్ట పరిధిలోని పైప్‌లైన్ రోడ్, సిపిఐ కార్యాలయం సమీపం, బీరప్పనగర్ ప్రాంతాల్లో ఇటీవల నిర్మించిన రోడ్లపై, మళ్లీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో మున్సిపల్ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకోవడంతో అక్రమ నిర్మాణాలు శాశ్వతంగా మారే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కఠిన చర్యలు తీసుకుని రోడ్లను ఆక్రమణల నుంచి రక్షించాలని కోరారు. స్థానిక అధికారులకు ఈ విషయాలు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదని, దీంతో ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా రాగి నారాయణరెడ్డి నగర్‌లో బాక్స్ డ్రెయి న్ నిర్మాణ పనుల కోసం రోడ్డును తవ్వి అలాగే వదిలేయడంతో స్థానికు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేసి రహదారిని యథావిధిగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు సదానంద్, సహదేవ రెడ్డి, వెంకటేష్, కొండయ్య, శ్రీనివాస్, జంబు, మహేష్ యాగంటి తదితరులు పాల్గొన్నారు.



## సిసి కెమెరాలు తప్పనిసరి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రతి ఒక్క రెస్టారెంట్,షాపింగ్‌మాల్‌లో సిసి కెమెరా లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి అన్నారు. కీరస ప్రధాన కూడలిలో ఉన్న అంజనా కిచెన్ రెస్టారెంట్‌లో సిసి కెమెరాలు ప్రారంభించి అట్టి సిసి కెమెరాలకు కీసర పిఎస్‌కి జియో ట్యాగ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ రద్దీ ఉన్న ప్రాంతాలలో రెస్టారెంట్స్, షాపింగ్‌మాల్స్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి కెమెరాలకు జియో ట్యాగ్ కూడా చేయించుకోవాలని సూచించారు. పనిచేసే కార్మికుల వివరాలు సైతం మీ సురక్షా యాప్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ ఆంజనేయులు, ఎస్‌ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రేవ్ యార్డుకు కోటి 80 లక్షల నిధులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉప్పల్ నియోజకవర్గం బీరప్పగడ్డ డివిజన్‌లో కుమ్మరి సంఘం గ్రేవ్ యార్డుకు కోటి 80 లక్షల నిధులు మంజూరయ్యాయ ని, త్వరలోనే దీని నిర్మాణ పనులు చేపట్టి పూర్తి స్థాయి లో వసతులు కల్పిస్తానని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.



ఇటీవ ల ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యేకు కుమ్మరి సంఘ ప్రతినిధుల వినతి మేరకు నిధులు మంజూరు చేయించిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యేతో పాటు బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌లను గౌడ సంఘ సభ్యులు కృష్ణగౌడ్, భిక్షపతి గౌడ్, రాములు గౌడ్,తదితరులు సన్మానించారు.

## ట్రాఫిక్ పోలీసులకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** సోమవారం మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది కోసం ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని మల్కాజ్‌గిరి కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ 2,ఉప్పల్ ఎల్‌బి నగర్ డివిజన్ డిసిపి వి శ్రీనివాసులు మార్గదర్శకత్వంలో శ్రీకర హస్పిటల్ ,రెటినోవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కంటి, దంత, పరీక్షలు, ఫిజియోథెరఫీ, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పిఎస్‌కు సంబంధించిన అధికారులు, సిబ్బంది 44 మంది వైద్య సేవలు ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రామలక్ష్మ ణ్‌రాజు, రిజర్వ్ సిఐ మల్లేష్,ఎస్‌ఐ మధు,భాస్కర్‌లు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణకు సహకరించాలి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బండ్లగూడ మాజీ కౌన్సిలర్ కొత్త హేమాలత భాస్కర్‌గౌడ్ అన్నారు. జాతీయ నూలి పురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ టాబ్లెట్లను ఇవ్వడం జరిగింది. పిల్లల తల్లి దండ్రులు టాబ్లెట్స్ ఇవ్వాలని, అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా ఇవ్వబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకన్న,హెడ్ మాస్టర్ నర్సింహరావు,ఏఎన్ఎం మంగ, తదితరులు పాల్గొన్నారు.

**శామీర్‌పేటలో:** విద్యార్థులు తప్పకుండా నులిపురుగుల మాత్రలను వేసుకోవాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ వెంకట గోపాల్ లు అన్నారు. సోమవారం మూడుచింతలపల్లిలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు వైద్యులు నులిపురుగుల మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలత, ఆశా వర్కర్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉచిత బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో అందజేత

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్:** తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల అర్థిక స్వావలంబన సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో దివ్యాంగుల, అర్హులైన వారికి ఉచితంగా బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వాహనాన్ని కలెక్టర్ దీపక్‌తివారి అంద జేశారు.

**చిన్నారులకు అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి:** జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని సంఘం లక్ష్మి బాయి బాలికల జూనియర్ కళాశాలలో చిన్నారులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1నుండి 19సంవత్సరాల వయస్సుగల ప్రతి చిన్నారికి ఏడాదిలో రెండుసార్లు ప్రభుత్వం ఉచితంగా పంపిణి చేశారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, షోషకహారలోపం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఅరోగ్యశాఖ అధికారి సుధాకర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి :** ఎస్ఐఆర్ ను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్‌అధికారులకు సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘంనిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర దీపక్‌తివారి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాళ్లచిట్టెంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర తహసీల్దార్ లక్ష్మి నారాయణతో కలిసి పరిశీలించారు. ఈనెల 24తేది వరకు పూర్తిచేసే విధంగా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారా ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని బూత్‌స్థాయి అధికారులు, ఎజెంట్లు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించా రు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతిఓటరు వివరాలు నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు తావులేకుండా విదులు నిర్వహించాలని సూచించారు.





## ఇక మీదట కరెంట్ కోతలు ఉండవు

### నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ప్రజాపక్షం/మర్పల్లి:** మర్పల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి పట్లూర్ గ్రామంలో 33/11 కెవి నూతన విద్యుత్ ఉప కేంద్రాన్ని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కూమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ కూడా ఇక మీదట కరెంట్ కోతలు ఉండబోవన్నారు.

రైతన్నలకు, వినియోగ దారులకు నిరంతరం కరెంట్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం పలు శుభ కార్యా ల తో పాటుగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్, సర్పంచుల సంఘం అధ్యక్షులు రఫియోద్దీన్, రాష్ట్ర నాయకులు రాములు యాదవ్, అయా శాఖల అధికారులు, నాయకులు, కార్యకార్తలు తదితరులు ఉన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు ధనరాజ్ నాయక్, చైల్డ్ వెల్ఫేర్ కమిటి సభ్యుడు రాంమోహన్ లు కోరారు. సోమవారం మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్‌ను కల్సిన వారు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు లేనందున జిల్లాకు సంబంధించి ఈ కేసులన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలోనే కొనసాగుతున్నాయని, దీని వల్ల వృథా వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయన్న విషయాన్ని పేర్కొన్నారు.

## చెత్త శాశ్వతంగా డంపింగ్ చేయడం జరగదు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** రాంపల్లి ఎస్‌సిటిపిలో ఎటువంటి చెత్త శాశ్వతంగా డంపింగ్ చేయడం జరగదని ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఎంఎంసి ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రాంపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో ఉన్న స్థలంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోజువారీ సేకరించే ఘన వ్యర్థాలను అదే రోజున శాస్త్రీయ పద్ధతిలో స్వీకరిం చి, మూసివేసిన వాహనాల ద్వారా సంబంధిత ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించే విధంగా సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ ఏర్పాటు చేయుటకు స్థలాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. రాంపల్లి వద్ద జవహర్ నగర్ డంపింగ్ యార్డు మాదిరిగా కొత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం అవాస్తవమని, కొందరు వ్యక్తు లు, ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిం చేలా చేస్తున్నారని ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని అన్నారు. సర్వే నంబర్ 226లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని ఈ ప్రజాప్రయోజన ప్రాజెక్టు కోసం కేటాయించాలని మాత్రమే సంబంధిత అధికారులను కోరడం జరిగింది. ఇతర సంఘాలకు కేటాయించిన లేదా కేటాయింపు ప్రతిపాదనలో ఉన్న భూములను ఎట్టి పరిస్థితిలోనూ కోరడం గానీ స్వాధీనం చేసుకోవడం జరగలేదు. ఈ విషయంలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని అన్నారు. సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల ద్వారా వ్యాప్తిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మకుండా ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, అధునిక వ్యర్థాల నిర్వహణ అమలు చేస్తున్నామని డిసి తెలిపారు.




## ఓటరు సవరణ ప్రక్రియ పరిశీలన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఓటరు సవర ణ ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరు సర్ ఫారమ్‌ను పూర్తి వివరాలతో నింపి బిఎల్‌ఒలకు అందజేయాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట డివిజన్, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపల్‌లో పర్యటించి ఓటరు సవరణ జాబితా ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క ఓటరు బిఎల్‌ఒలు అందజేసిన ఫారాలను తప్పులు లేకుండా పూర్తి చేసి అధికారులకు అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హనుమాన్‌దాస్‌గౌడ్, మాజీ జడ్పిటిసి అనితలాలి, మాజీ ఎంపిపి ఎల్లుబాయి, మాజీ సర్పంచ్ చీదు వనజ శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/దుండిగల్ :** కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి రైతులకు నీటిని విడుదల చేయాలని కేటీఆర్ చేపట్టిన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ విద్యార్థి విభాగం నాయకులు రక్తదానం చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లేందుకు బయలుదేరగా, పోలీసులు వారిని అడ్డుకొని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థి నాయకుడు కొర్ర ప్రవీణ్ నాయక్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శంభీపూర్ కృష్ణ, కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్వి టీమ్ సభ్యులు మనీష్, హోమ్, ప్రవీణ్, మనీషా, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** స్థానిక బిజెఆర్ నగర్ అంబేద్కర్ నగర్ లో ఒక 19 ఏళ్ల యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన సోమవారం వెలుగుచూసింది. జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం, దూదివెంకటాపురం గ్రామానికి చెందిన లింగాల రాములు (41, కూలీ) కొంతకాలంగా తన కుటుంబంతో కలిసి కాప్రా మండలం, బీజేఆర్ నగర్‌లో నివసిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రాము లు, ఆయన భార్య కలిసి తమ సొంత గ్రామమైన దూదివెంకటాపురానికి వెళ్లారు. మిగిలిన పిల్లలు మేనమామ ఇంట్లో ఉండగా, వారి చిన్న కుమారుడు లింగాల గణేష్ (19, డ్రైవర్) మాత్రం ఇంట్లోనే ఒంటరిగా ఉన్నాడు.

ఆదివారం రాత్రి సమయంలో కుటుంబ సభ్యులు గణేష్‌కు ఫోన్ చేయగా అతడు స్పందించలేదు. నిద్రపోతున్నాడేమోనని వారు భావించారు. అయితే, సోమవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో గణేష్ ఆత్మహత్య చేసుకున్నాడనే సమాచారం పెద్ద కుమారుడి ద్వారా తండ్రి రాములుకు అందింది. దీంతో ఆయన వెంటనే తన ఇంటికి చేరుకుని చూడగా.. గణేష్ ఇంట్లోని ఇనుప పైపునకు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. అప్పటికే స్థానికులు గమనించి మృతదేహాన్ని కిందకు దించారు. బాధిత తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

12 ప్రజాపక్షం Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
14-07-2026
www.prajapaksham.in

“ రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన ‘రాజా ది రాజా’ చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్ కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. ”

రీల్

## డబ్బింగ్‌లో ‘కిల్లర్’



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ ‘కిల్లర్’. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. వీఎఫ్ఎక్స్ వర్క్స్ సహా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ‘కిల్లర్’ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో సూపర్ వుమెన్ గా, మిస్టీరియస్ వుమెన్ గా జ్యోతి పూర్వజ్ ఎలక్ట్రిఫైయింగ్ లుక్స్ లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. మెలిఫిసెంట్ మూవీలో ఏంజెలీనా జోలిని తలపించేలా జ్యోతి పూర్వజ్ లుక్స్ ఉండటం విశేషం. ‘కిల్లర్’ సినిమా ప్రస్తుతం డబ్బింగ్ పనుల్లో ఉంది. ‘కిల్లర్’ సినిమా ప్రోగ్రెస్ గురించి డైరెక్టర్ పూర్వాజ్ మాట్లాడుతూ త్వరలోనే బిజినెస్ డీల్స్ కంప్లీట్ చేసుకుని సెన్సార్ పూర్తి చేసి మా సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తాం అన్నారు. జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, ఎడిటింగ్.

## ‘రాజా ది రాజా’ రొమాంటిక్ ఎంటర్‌టైనర్



### నిర్మాత నిహారిక దాసరి

రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన ‘రాజా ది రాజా’ చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్ కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. బృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారిక దాసరి నిర్మించిన ఈ చిత్రాన్ని కె. శ్రీలత రెడ్డి సమర్పిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా సినిమా భారీ స్థాయిలో 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత కె. నిహారిక దాసరి విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు . నిర్మాతగా మారడానికి నాలుగైదేళ్లు ఆలోచించి నిర్ణయం తీసుకున్నాను. రుత్విక్‌కు సినిమాలంటే చాలా ప్యాషన్. అమెరికాలో ఫిల్మ్ కోర్స్ చేశాడు. అదే సమయంలో ఒక షార్ట్ ఫిల్మ్‌లో అబ్బాయి, అమ్మాయి రెండు రకాల పాత్రలు చేశాడు. ఆ షార్ట్ ఫిల్మ్ చూసిన తర్వాత తనపై నాకు మరింత నమ్మకం పెరిగింది. ఆ షార్ట్ ఫిల్మ్ చూసి తన కోసం కొన్ని కథలు కూడా వచ్చాయి. కానీ ఒక మంచి ఛాలెంజింగ్ పాత్రతో హీరోగా పరిచయం చేయాలనుకున్నాం. అలా ’రాజా ది రాజా’ కథ మా దగ్గరకు వచ్చింది. ఇది చాలా బలమైన కథ. ఇందులో హీరో రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తాడు. ఏ నటుడికైనా ఇది పెద్ద ఛాలెంజ్. రుత్విక్ ఆ రిస్క్ తీసుకుని ఈ సినిమా చేశాడు. ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం వంద శాతం కష్టపడ్డారు. కథ పరంగా కూడా మేము చాలా కాన్ఫిడెంట్గా ఉన్నాం. ఇలాంటి మంచి ప్రయత్నాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాం. ఫైనల్ అవుట్పుట్ చూసిన తర్వాత మేము అనుకున్నదానికంటే ఇంకా బాగా వచ్చిందనే సంతృప్తి కలిగింది. సినిమా తీస్తున్నప్పుడు మాకు అలాంటి ఆలోచన రాలేదు. కానీ ట్రైలర్ విడుదలైన తర్వాత చాలామంది ’మగధీర’ వంటి గొప్ప సినిమాతో పోల్చడం ఆనందంగా అనిపించింది. అయితే రెండు కథలకు ఎలాంటి సంబంధం లేదు. సినిమా చూసిన తర్వాత అసలు ట్విస్ట్ మీకే తెలుస్తుంది. రుత్విక్‌కు తనపై చాలా ఆత్మవిశ్వాసం ఉంది. ప్రేక్షకులను అలరించగలననే నమ్మకంతో సినిమా చేశాడు. చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉంది. ఫస్ట్ స్టాండర్డ్ నుంచే స్కూల్లో స్కిట్స్ చేసేవాడు.తొలి సినిమాకే ఇలాంటి రిస్క్ తీసుకోవడం చిన్న విషయం కాదు. ప్రేక్షకులు తప్పకుండా అతని కష్టాన్ని గుర్తిస్తారని నమ్ముతున్నాను.. ఇండస్ట్రీలో అందరూ మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా స్వాగతించారు. ట్రైలర్, టీజర్‌కు ఎంత మంచి స్పందన వచ్చిందో, సినిమా కూడా అంతే మంచి ఆదరణ పొందుతుందని నమ్ముతున్నాను.

## ‘శ్రీనివాసమంగాపురం’ ట్రైలర్ రిలీజ్



క్రిష్ణ మనవుడు జై క్రిష్ణ నటించిన ‘శ్రీనివాస మంగాపురం’ ట్రైలర్ రిలీజ్ అయింది. విజయవాడలో గ్రాండ్ గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో జై కృష్ణ మాట్లాడుతూ మా తాత సూపర్ స్టార్ కృష్ణ లేకపోతే నేను ఈ రోజు ఇక్కడ ఉండేవాడిని కాదు. ఆయన నాకు దేవుడితో సమానం. అలాగే మా బాబాయ్ మహేష్ బాబు కూడా నాకు ఎంతో సపోర్ట్ చేశారు. మా సినిమా టీజర్, ట్రైలర్ అన్నీ చూసి నాకు ఎంతో మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. థాంక్ యూ బాబాయ్. మా నాన్నగారి గురించి మాట్లాడితే చాలా ఎమోషనల్ అవుతాను. ఆయన ఈ రోజు ఉండి ఉంటే చాలా సంతోషపడేవారు. ఎక్కడ ఉన్నా నన్ను చూసి ఆనందపడుతున్నారని నమ్ముతున్నాను. ’శ్రీనివాస మంగాపురం’ కోసం దర్శకుడు అజయ్ భూపతి అద్భుతమైన కథ రాశారు. సినిమాను కూడా చాలా అద్భుతంగా తీశారు. ఇందులోని ఎమోషన్స్, పాత్రలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయి. సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది. విజువల్స్, మ్యూజిక్ అన్నీ కొత్తగా ఉంటాయి. రాషా తడానీ చక్కగా నటించింది. ఆమె నటనను ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. మోహన్ బాబు మా సినిమాలో చాలా మంచి పాత్ర చేశారు. మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానానికి చాలా ఆనందంగా ఉంది. జూలై 30న అందరూ థియేటర్లకు వచ్చి ’శ్రీనివాస మంగాపురం’ సినిమా చూడండి. తప్పకుండా మీ అందరూ ఎంజాయ్ చేస్తారు.

హీరోయిన్ రాషా తడానీ మాట్లాడుతూ తెలుగు సినిమాలో తొలిసారి నటించడం చాలా ఆనందంగా ఉంది. కోస్టార్ జై కృష్ణ ఎంతో సహకరించారు. జూలై 30న మీరందరూ థియేటర్లలో ’శ్రీనివాస మంగాపురం’ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ . ఆయనకు మీ అందరి ఆశీర్వాదాలు కావాలి. ’మంగా మంగా’ పాట మీ అందరికీ ఎంత నచ్చిందో నాకు తెలుసు. మిగతా పాటలన్నీ కూడా అద్భుతంగా వచ్చాయి.. రగ్గడ్ యాక్షన్‌తో పాటు అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుంది. యూత్కు ఈ సినిమా బాగా నచ్చుతుంది అన్నారు . ఘట్టమనేని ఆది శేష గిరిరావు మాట్లాడుతూ కృష్ణకి, మహేష్ బాబుకి విజయవాడలో ఎంత అభిమానం ఉందో అందరికీ తెలుసు. మా కుటుంబానికి అప్సర థియేటర్తో ఐదు దశాబ్దాల అనుబంధం ఉంది. ఈ వేడుకను ఇంత అద్భుతంగా నిర్వహించిన అందరికీ ధన్యవాదాలు. ట్రైలర్‌లో చూసినట్టుగానే సినిమా కూడా చాలా అద్భుతంగా వచ్చింది. మీ అందరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.

రాషా తడానీ చాలా బాగా నటించింది. జై కృష్ణ చాలా అందంగా కనిపించడమే కాదు, అద్భుతంగా నటించాడని చెప్పారు.

## డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో ‘ఇడుపు కాయితం’ రిలీజ్



ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా ‘ఇడుపు కాయితం‘. ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా ‘ఇడుపు కాయితం‘ సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ‘ఇడుపు కాయితం‘ సినిమా టైటిల్ నేపథ్యంగా సాగిన చర్చ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టైటిల్ తోనే ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. అతి తక్కువ టైమ్ లో మరే చిత్రానికీ లేనంతగా ఈ సినిమా వార్తల్లో నిలిచింది. దీంతో ప్రేక్షకుల దృష్టిని ఈ సినిమా బాగా ఆకర్షిస్తోంది. సినిమా పూజా కార్యక్రమాల సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ‘ఇడుపు కాయితం‘ త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనుంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో దర్శక నిర్మాతలు షేర్ చేసుకోనున్నారు.ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ అశ్వత్ భైరి, ఆర్ట్ డైరెక్టర్ ఆశిష్ తేజ, ఎడిటర్ శ్రీధర్ సొంపల్లి డివోపీ ఎంఎన్ బాల్ రెడ్డి, మ్యూజిక్ సురేష్ బొబ్బిలి బ్యానర్స్ సుకుమార్ రైటింగ్స్, బన్నీవాస్ వర్క్స్ ప్రొడ్యూసర్ బన్నీవాస్ స్క్రిప్ట్, డైరెక్షన్ వంశీరెడ్డి దొండపాటి

## విద్య, వైద్యానికి ప్రాధాన్యం

### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ నగరంలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్, దాతల సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి.వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, దాతలు ఎన్‌సి మూర్తి, జీవన్ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ.ధర్మారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు మంత్రి కొండా సురేఖకు కళాశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రకాంతయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. యువత నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం దేశ్‌పాండే ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నెహ్రూ మెమోరియల్ పాఠశాల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు అందించారు. తదుపరి జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ జి.పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ. ధర్మారెడ్డి, దాత ఎన్‌సి. మూర్తి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మంత్రి కొండా సురేఖ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

## భేషజాలకు పోకుండా కన్నేపల్లి మోటర్లను ఆన్ చేయండి

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేషజాలకు పోకుండా కన్నేపల్లి మోటార్లను ఆన్ చేయాలని.. ఎన్ డి ఎస్ ఏ రిపోర్టును అడ్డం పెట్టుకొని రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, రాజకీయాలు పక్కన పెట్టి సాగు, తాగునీటిపై దృష్టి పెట్టాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ అన్నారు. ఎన్‌డి ఎస్ ఏ రిపోర్టు కాదు అది.. ఎన్డీఏ రిపోర్టు.. కేంద్రంలోని బిజెపి ఇచ్చిన రిపోర్టు గా కేటిఆర్ అభివర్ణించారు. కనీసం ఏ పరీక్షలు చేయకుండా, నీళ్లలో అడుగుపెట్టకుండా 48 గంటల్లో రిపోర్టును ఎలా ఇచ్చారని కేటిఆర్ విమర్శించారు. కరీంనగర్ లో సోమవారం లోయర్ మానేరు డ్యాంలోని నీటి మట్టాన్ని పరిశీలించిన అనంతరం కేటిఆర్ మీడియాతో మాట్లాడారు. ఎన్ డి ఎస్ ఎ చైర్మన్ ఆధ్వర్యంలో పోలవరం కడితే అది మూడుసార్లు కొట్టుకుపోయిందని,సుంకిశాల కొట్టుకుపోయినా, గుజరాత్ లో ప్రాజెక్టులు కొట్టుకుపోయినా.. అక్కడికి ఎన్డీఎస్ఏ ఎందుకు పోలేదని ప్రశ్నించారు. బీజేపీ ఇచ్చిన రిపోర్టును పట్టుకొని కేసీఆర్ ను బద్నాం చేస్తున్నారని అన్నారు. మేడిగడ్డ దగ్గర లక్ష క్యూసెక్కుల నీరు వృధాగా పోతున్నా ఎత్తిపోయడం లేదని, ఈ ప్రభుత్వం క్రిమినల్ నెగ్లిజెన్సీ ప్రదర్శిస్తోందని, రైతులకు నష్టం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద రోజుకు 9 టీఎంసీల నీరు వృధాగా పోతుందని, గోదావరి బేసిన్ లోని అన్ని ప్రాజెక్టుల్లో 20 శాతం నీరు కూడా లేదని, అక్కడ నీరు వృధాగా పోతుంటే ఇక్కడ ప్రాజెక్టులు నోరెళ్ళబెడుతున్నాయని అన్నారు .28.50 లక్షల క్యూసెక్కుల నీరు మేడిగడ్డ నుంచి పోతేనే 2022లో భద్రాచలానికి ఏం కాలేదని, రెండున్నర లక్షల క్యూసెక్కులు పోతే భద్రాచలం మునుగుతోందా? అన్నారు.

## రెపరెపలాడాలి


(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత లాభాల కోసం కాకుండా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకులుగా వారు చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.పేదలకు భూమి, నీరు, విద్య, వైద్యం అందాలనే లక్ష్యంతో జీవితాన్ని అంకితం చేసిన వారి త్యాగస్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి వారి ఆశయాలను యువత ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ అట్టడుగు వర్గాల అభ్యున్నతికే జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడని పేర్కొన్నారు. వేలాది మంది అమరుల త్యాగాలతో నల్లగొండ జిల్లా పోరాటాల ఖిల్లాగా మారిందని,ఇప్పుడు అది నల్లగొండ కాదు... ఎర్రగొండ అని అభివర్ణించారు.కమ్యూనిస్టులు ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేశారని,బిజెపి,బిఆర్‌ఎస్,కాంగ్రెస్ పార్టీలు అలాంటి త్యాగాలు చేశాయా అని ప్రశ్నించారు. దేశంలో అధికారంలో ఉన్నా లేకున్నా శతాబ్ద కాల రాజకీయ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐనేనని స్పష్టం చేశారు.

## బొగ్గు బ్లాకులు

(మొదటి పేజీ తరువాయి)

నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థకు రూ. 600 కోట్ల రూపాయలను కేటాయించి నాటి ప్రధాని వాజపేయి ఆదుకుంటే, ప్రస్తుతం ప్రధాని మోదీ బొగ్గు బ్లాక్ కేటాయించి మరోసారి ఆదుకున్నారని అన్నారు. పది సంవత్సరాలు పాలించిన బిఆర్‌ఎస్ రాజకీయాలు చేసి సింగరేణి ని భ్రష్టు పట్టించారని, కేవలం ఓటు బ్యాంకు గానే చూశారనీ, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ విధానాన్ని కొనసాగించి అవినీతిని కొనసాగించిందని విమర్శించారు. సింగరేణి భవిష్యత్ కోసం ఆలోచన చే యలేదని, బొగ్గుబ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుకున్నాయని ఫలితంగా ప్రైవేట్ కంపెనీలు పోటీ పడి దక్కించుకు న్నాయన్నారు. పదేళ్ల పాలనలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం తమను గుర్తించలేదని, ఇప్పుడేమో సంస్థలో అవినీతి జరుగుతుందని, విచారించి కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్, హరీష్ రావులు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందన్నారు. సింగరేణి సొమ్మును కమిషన్‌ల రూపంలో దోచుకుంటున్నరని, సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గుకు గత బిఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 54 వేల కోట్లు బాకీ పడ్డాయని ఇప్పటివరకు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం కోలిండియాకు ఇప్పటివరకు రూపాయి బాకీ లేకుండా చెల్లిస్తున్నామని, భవిష్యత్‌లో నిర్వహించే అన్నీ వేలం పాటలో పాల్గొని సింగరేణికి అండగా ఉంటామన్నారు సింగరేణి సంస్థను లాభాల్లోకి తీసుకురావడంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ విఫలం చెందాయనీ, తాడిచర్ల బొగ్గు బ్లాక్ వలన యువతకు ఉద్యోగాలు వస్తాయని, సింగరేణి నీ రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణ, శాసనసభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పటేల్, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజి రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ చెరుకు భాగ్య లక్ష్మి, రాష్ట్ర నాయకులు జీవీకే మనోహర్, జయ శ్రీ, డాక్టర్ వెంకన్న నాయక్, రవి నాయక్, బలగం శ్రీధర్, బిఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్, మొగిలి పాక రవి కుమార్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు గను ల శాఖ మంత్రిని కొత్తగూడెం మే యర్ మూడ్ గణేష్ మర్యాద కొత్తగూడెం బైపాస్ నిర్మాణానికి, నూతనంగా ఏర్పడిన కొత్తగూడెం కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని వినతి పత్రాన్ని అందించారు.





## లాక్కుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఉజ్జిని యాదగిరిరావు,రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కలకాండ కాంతయ్య తదితరులు హాజరయ్యారు. ‘ఉజ్జిని నారాయణరావు ఉద్యమ ప్రస్థానం’ పేరుతో రత్నాకర్‌రావు రచించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అంతకుముందు చింతపల్లిలో సిపిఐ మండల కార్యాలయానికి కామ్రేడ్ ఉజ్జిని నారాయణ రావు భవన్‌గా నామకరణం చేశారు.

అనంతరం సమీప ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వర్ధంతి సభలో పల్లా వెంకట్‌రెడ్డి ప్రసంగిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా చారిత్రక కేంద్రంగా నిలిచిందన్నారు. దొరలు,భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల్లో పల్లా పర్వతరెడ్డి, రామశర్మ తదితర నాయకులతో కలిసి ఉజ్జిని నారాయణరావు భూమిలేని నిరుపేదలకు భూములు పంచి అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. గ్రామాగ్రామాన రైతు సంఘాలను ఏర్పాటు చేసి కౌలు రైతుల హక్కుల కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహించారని చెప్పారు. నారాయణరావు,పల్లా పర్వతరెడ్డి అందించిన పోరాట స్ఫూర్తే తనను జాతీయ కార్యదర్శిగా,ఎమ్మెల్యేగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు.

**దున్నేవాడికే భూమి నినాదాన్ని ఆచరణలో పెట్టింది సిపిఐ : చాడ వెంకట్‌రెడ్డి**

నల్లగొండ జిల్లాలో ఎర్రవిత్తనాలుగా మొలిచిన కమ్యూనిస్టు ఉద్యమం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవాడికే భూమి అనే నినాదాన్ని ఆచరణలో పెట్టి వేలాది మంది పేదలకు లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కిందని చాడ వెంకట్ రెడ్డి అన్నారు.రంగురంగుల రాజకీయ పార్టీలు వచ్చినప్పటికీ పేదల పక్షాన అంకితభావంతో నిలిచిన పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు.ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పాలకులపై సమరశీల పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

**రైతాంగ సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి:పశ్య పద్మ**

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా రైతులను చైతన్యపరిచిన నాయకుడు నారాయణరావు అని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని,రైతులకు గిట్టుబాటు ధర,సంక్షేమ పథకాలు అమలు చేసేలా ప్రభుత్వాలపై ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**కడవరకు ఎర్రజెండా ఆశయాలకే అంకితమైన మహోన్నత నాయకులు : బొమ్మగాని ప్రభాకర్**

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ పల్లా పర్వతరెడ్డి,ఉజ్జిని నారాయణరావులు భూస్వామ్య కుటుంబాల్లో జన్మించినప్పటికీ తమ వర్గ ప్రయోజనాలను పక్కనబెట్టి పేద ప్రజల పక్షాన నిలబడి జీవితాంతం పోరాటాలు నడిపిన మహోన్నత కమ్యూనిస్టు యోధులని గుర్తు చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొన్న అన్యాయాలను చూసి వారు ఎర్రజెండా బాట పట్టారని, దోపిడీకి వ్యతిరేకంగా గ్రామగ్రామాన ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు. ఒకసారి చేతిలో ఎత్తుకున్న ఎర్రజెండాను చివరి శ్వాస వరకు వదలకుండా కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అంకితభావంతో జీవించారని గుర్తు చేశారు.

**మూడు సార్లు ఎమ్మెల్యేగా ప్రజా సేవ : నెల్లికంటి సత్యం**

ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేవరకొండ,మునుగోడు ప్రాంత ప్రజలపై దొరలు, భూస్వాములు చేసిన దౌర్జన్యాలకు ఎదిరించి పోరాడిన నాయకుడు ఉజ్జిని నారాయణరావు అని అన్నారు. కమ్యూనిస్టులను నక్సలైట్లుగా ముద్రవేసి వేధింపులకు గురిచేసిన రోజుల్లో ప్రతి కార్యకర్తకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు శాసనసభలో బలంగా గళం విప్పారని, ప్రజల విశ్వాసాన్ని చూరగొని వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు.

సభకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లొడంగి శ్రవణ్ కుమార్,ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, మాజీ జిల్లా కార్యదర్శి మల్లేపల్లి ఆదిరెడ్డి, సీనియర్ నాయకులు వి. యుగంధర్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజా చారి,తూము బుచ్చిరెడ్డి,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మండల కార్యదర్శి పోలె వెంకటయ్య,మ్యునుగోడు మండల కార్యదర్శి చాపల శ్రీను,బచ్చనబోయిన గాలయ్య,పల్లె శేఖర్ రెడ్డి,దుబ్బ భాస్కర్,నలపరాజు సతీష్,బుర్ర శేఖర్,దేవి సుదర్శన్ రెడ్డి,ఈదుల బిక్షం రెడ్డి, ఉజ్జిని అంజలరావు,ముదిగొండ మురళి,బుడిగేపాక జగన్,చల్లం పాండురంగారావు, ఉజ్జిని నారాయణరావు కుటుంబసభ్యులు హాజరయ్యారు. .

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com